ninadam.in

తెలుగు దినపత్రిక

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

ఆదివారం, మే 24, 2026 | సంపుటి - 22 | సంచిక 235 | వెల - 7 | పేజీలు - 12 - 8

Published from Hyderabad, Vijayawada Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam

## డాక్టర్ బాధ్యత మందులు ఇవ్వడమే కాదు
## రోగిలో ఆశను నిలబెట్టాలి



డాక్టర్ డి.భూషణ్ రాజుతో నినాదం బ్యూరో చీఫ్ గుంపుల ఇందిరా ప్రియ దర్శిని యాదవ్ ఇంటర్వ్యూ

- అవయవ దానం అనేది కేవలం ఒక వైద్య ప్రక్రియ మాత్రమే కాదు..
- ఒక మనిషి జీవితాన్ని మరో మనిషి ద్వారా కొనసాగించే మహత్తర మానవతా కార్యక్రమం

హైదరాబాద్లోని నిజాం ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) లో నెఫ్రాలజీ విభాగం హెడ్, సీనియర్ ప్రొఫెసర్ గా సేవలందిస్తున్న డాక్టర్ డి. శ్రీ భూషణ్ రాజు గారు వైద్య రంగంలో అత్యున్నత స్థాయి గుర్తింపు పొందిన నిపుణులు. ఎంతో అనుభవం, అంకితభావం కలిగిన ఆయన, కిడ్నీ వ్యాధుల చికిత్సలో ముఖ్యంగా డయాలసిస్ , కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సల్లో ఎన్నో క్లిష్టమైన కేసులు విజయవంతం చేసి రోగులకు ప్రాణదానం చేశారు. కేవలం వైద్యుడిగా కాకుండా, రోగులకు అవగాహన కల్పించడంలో వైద్య విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించడంలో ఆయన ఎప్పుడూ ముందుంటారు. ఆయన వైద్య వృత్తి పట్ల చూపే అంకితభావం, నిరాడంబరమైన వ్యక్తిత్వం నేటి యువ వైద్యులకు ఒక గొప్ప స్ఫూర్తిదాయకం. ఆయనతో ముఖాముఖి..

12

## పర్సంటేజీ అయితేనే సినిమా ఆడుద్ది



- పెద్ది సినిమా నుంచే మొదలు పెడదాం
- రెంటల్ సిస్టమ్ కాలం చెల్లిన విధానం
- తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్

**హైదరాబాద్,మే24(నినాదం):** తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. పెద్ది సినిమా విడుదల చేయాలంటే తమకు పర్సెంటేజ్ ఇవ్వాల్సిందేనని స్పష్టం చేసింది. ఇకపై ఏ సినిమా అయినా పర్సంటేజ్ కావాలని తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ తేల్చి చెప్పింది.

▸▸వివరాలు 2లో..




## పశ్చిమాసియాలో సడలని ఉద్రిక్త పరిస్థితులు

6

- ఇరాన్‌పై దాడులకు అమెరికా సన్నద్ధమైనట్లుగా వార్తలు
- తమ గగన తలాన్ని మూసేస్తూ ఇరాన్ ఆదేశాలు

## మాసాబ్ ట్యాంక్‌లో దారుణం

- న్యాయవాదిని కారుతో ఢీకొటంటి చంపిన దుండుగుల
- కారు నంబర్ ఆధారంగా పోలీసుల దర్యాప్తు



2



## 25 నుంచి 'రైతు గోస' బీజేపీ భరోసా

**హైదరాబాద్,మే24(నినాదం):** ఈ నెల 25 నుంచి 'రైతు గోస' బీజేపీ భరోసా' పేరిట పోరుబాట నిర్వహించేందుకు బీజేపీ సిద్ధమవుతోంది. తొలిరోజు తాండూరులో.. రెండో రోజు గజ్వేల్, భువనగిరి, వరంగల్‌లో..

## రెండో విడతలో రెండున్నర లక్షలు

రాష్ట్రంలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. మొత్తం 2 లక్షల 50 వేల మంది పేద కుటుంబాల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రతి నియోజకవర్గానికి 2 వేల చొప్పున ఇళ్లను మంజూరు చేయాలని నిర్ణయించింది. కేబినేట్ వివరాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ కుమార్‌లు మీడియాకు వివరించారు.

### ప్రతి నియోజకవర్గానికి 2 వేల చొప్పున ఇందిరమ్మ ఇళ్ల మంజూరు
### పాత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి నిధులు కేటాయింపు

- జూన్ 1న కొలారిలో ఆదివాసీల ఇందిరమ్మ కాలనీ ప్రారంభం
- కేబినేట్ నిర్ణయాలను వివరించిన మంత్రి పొంగులేటి

**హైదరాబాద్,మే24(నినాదం):**

ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభించి గోడలు, శ్లాబు దశలో నిలిచి పోయిన వాటిని కూడా పూర్తి చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. పునాదులు పూర్తయి గోడలు, శ్లాబు పడని ఇళ్లకు రూ.3 లక్షలు, గోడలు పూర్తయి శ్లాబు నిలిచి పోయిన ఇళ్లకు రూ.2 లక్షలు చొప్పున అందిస్తాం. అసంపూర్తిగా ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పూర్తి చేసేందుకు నియోజకవర్గానికి 500 ఇళ్లకు చొప్పున నిధులు కేటాయిస్తూ క్యాబినెట్ తీర్మానించింది. తొలి విడతలో నిర్మాణం ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్లలో జూన్ రెండు నాటికి దాదాపు లక్ష ఇళ్ల గృహ ప్రవేశాలు జరుగుతాయి. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం కొలారి గ్రామంలో కొలాం ఆదివాసీలకు ప్రభుత్వం కట్టించిన 28 ఇందిరమ్మ ఇళ్లను జూన్ 1వ తేదీన ప్రారంభించాలని నిర్ణయించాం.




## గోదావరి పుష్కరాలకు వేయికోట్లు

- జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజనం
- గంగాధర కాలేజీలో పోస్టుల భర్తీకి ఆమోదం
- కేసముద్రం ఫైర్‌స్టేషన్‌కు 18 పోస్టుల మంజూరు
- తెలంగాణ కేబినేట్‌లో కీలక నిర్ణయం

వివరాలు 2



## రూ.43.80 కోట్లతో వేదపాఠశాలకు భూమిపూజ

- రూ.వందకోట్ల అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన
- యాదగిరిగుట్టలో రేవంత్ రెడ్డి పర్యటన

**యాదగిరిగుట్ట,మే23(నినాదం):**

యాదగిరిగుట్టలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా రూ.100 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. శనివారం ఉదయం యాదగిరిగుట్టకు చేరుకున్న సీఎం రేవంత్ శ్రీలక్ష్మీనర్సింహ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం రూ.43.80 కోట్లతో నిర్మించనున్న వేద పాఠశాలకు రేవంత్ శంకుస్థాపన చేశారు. కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతితో కలిసి వేదపాఠశాలకు భూమిపూజ చేశారు. అనంతరం రూ.9.87 కోట్లతో కొండపై స్వామివారి నిత్య కల్యాణ మండపం నిర్మాణానికి, రూ.1.41 కోట్లతో వైకుంఠ ద్వారం నుంచి కొండపైకి వెళ్లే మెట్ల మార్గంపై కప్పు నిర్మాణానికి, రూ.1.35 కోట్లతో నిర్మించనున్న రథశాల వైపు మాడవీధులకు మెట్ల నిర్మాణానికి, రూ.43.12 కోట్లతో డార్మిటరీ హాల్స్, దీక్షాపరుల సదన్ నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు.

▸▸తరువాయి 2లో..

## విధులను విస్మరించి.. విశ్రాంతికి పరిమితమై

- మండుటెండలో భక్తులు.. ఏసీ గదుల్లో అధికారులు
- కింది స్థాయి ఉద్యోగులకు విశ్రాంతి మందిరంగా సీఎం గెస్ట్ హౌస్
- విశ్రాంతికి ప్రాధాన్యమిస్తున్న రెవెన్యూ శాఖల ఉద్యోగులు
- అధికారుల తీరుపై భక్తులు తీవ్ర ఆగ్రహం



జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలో సరస్వతి అంత్య పుష్కరాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని భారీగా ఏర్పాట్లు చేశారు. కానీ సరస్వతి అంత్య పుష్కరాల విధి నిర్వహణలో భక్తులకు సౌకర్యాలు కల్పించాల్సిన అధికారులు. కిందిస్థాయి ఉద్యోగులు వారి బాధ్యతలను గాలికి వదిలేస్తున్నారు.

**భూపాలపల్లి ప్రతినిధి, మే 23(నినాదం):**

పోలీసు భద్రతతో అత్యంత సర్వ సన్నద్ధంగా ఉండాల్సిన ముఖ్యమంత్రి గెస్ట్ హౌస్, అధికారిక విశ్రాంతి భవనము మండల స్థాయి అధికారులకు వారి కిందిస్థాయి ఉద్యోగులకు విశ్రాంతి మందిరంగా మారడం పలు విమర్శలకు తావిస్తోంది, విధి నిర్వహణలో భాగం కావలసిన అధికారులు ముఖ్యమంత్రి గెస్ట్ హౌస్ లో బాధ్యతలు మరిచి రెస్ట్ తీసుకోవడం వివాదాస్పదంగా మారింది అంత్య పుష్కరాలలో ఎండలు నిప్పుల కొలిమిలా మండుతున్న, సరస్వతి ఘాట్ వద్ద భక్తుల రద్దీ అంతకంతకు పెరుగుతుంది ఎండల దృష్ట్యా అవస్థలు పడుతున్న భక్తులకు క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉంటూ, పనులు పర్యవేక్షించాల్సిన

▸▸తరువాయి 2లో..

## దేశవ్యాప్తంగా భానుడి భగభగలు



### బయటకు రావాలంటే భయపడతున్న జనాలు

**న్యూఢిల్లీ,మే23(నినాదం):**

దేశంలో భానుడు తన ఉగ్ర రూపం చూపిస్తున్నాడు. చాలా ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది గంటల నుంచే ఎండలు భగభగ మండుతున్నాయి. జనం ఇళ్ల నుంచి అడుగు బయటపెట్టాలంటే భయంతో వణికిపోతున్నారు. అత్యవసర పనులు ఉంటే తప్ప ఇళ్లకే పరిమితం అవుతున్నారు. రానున్న వారం రోజులపాటు కూడా తీవ్రమైన వడగాలులు వీచే అవకాశం ఉందని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. రెండు తెలుగు రాష్ట్రాలు సహా వాయవ్య, మధ్య, తూర్పు భారత్‌లోని పలు మైదాన ప్రాంతాల్లో వడగాలులు వీస్తాయని అంచనా వేసింది.

## తెలంగాణ ఎండల తీవ్రతపై ప్రభుత్వం అలర్ట్

- వడదెబ్బకు 16 మంది మృతి చెందినట్లు గుర్తింపు
- మృతుల కుటుంబాలకు రూ.4లక్షల చొప్పున పరిహారం
- పరిస్థితిపై అధికారులతో మంత్రి పొంగులేటీ సమీక్ష

2

**హైదరాబాద్,మే23(నినాదం):**

రాష్ట్రవ్యాప్తంగా హీట్ వేవ్‌పై హై అలర్ట్ ప్రకటించినట్లు తెలంగాణ రెవెన్యూ, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. తీవ్ర ఉష్ణోగ్రతలపై మంత్రి పొంగులేటి సచివాలయంలో శనివారం అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై మంత్రి దిశానిర్దేశం చేశారు.

## దేశంలో పెరుగుతున్న చిన్నారుల అదృశ్యం కేసులు

- చిన్నారుల అంతర్ధానంపై సుప్రీంకోర్టు ఆందోళన
- కిడ్నాప్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేయండి
- అన్ని రాష్ట్రాలకు సుప్రీం ధర్మాసనం కీలక ఆదేశం



దేశవ్యాప్తంగా నానాటికీ పెరిగిపోతున్న చిన్నారుల అదృశ్యం కేసులపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రస్తుతం దేశంలో దాదాపు 47,000 మంది చిన్నారుల ఆచూకీ లభించకుండా పోయిందని, ప్రతి ఏటా ఈ బ్యాక్‌లాగ్ పెరుగుతుండటంపై తీవ్ర అసంతృప్తిని వెలిబుచ్చింది.

2

**న్యూఢిల్లీ,మే24(నినాదం):**

ఈ వ్యవస్థాగత లోపాలను సరిదిద్దడానికి, అంతర్రాష్ట్ర మానవ అక్రమ రవాణా ముఠాల నెట్‌వర్క్‌ను ఛేదించడానికి సుప్రీంకోర్టు సంచలన ఆదేశాలు జారీ చేసింది. జస్టిస్ అహసానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ఆర్. మహాదేవన్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం.. చిన్నారుల అదృశ్యం కేసులను

## వరుసగా మూడోసారి పెట్రో ధరల పెంపు

- పెట్రోల్‌పై 87 పైసలు, డీజిల్ పై 91 పైసల వాయింపు

**న్యూఢిల్లీ,మే24(నినాదం):**

పెట్రోల్ డీజిల్ ధరలు వరుసగా మూడోసారి పెరిగాయి. శనివారం పెట్రోల్‌పై 87 పైసలు, డీజిల్ పై కేంద్ర ప్రభుత్వం 91 పైసలు పెంచింది. 10 రోజుల్లో ధరలు పెంచటం ఇది మూడోసారి. పెట్రోల్, డీజిల్ ధరల పెంపు విషయంలో ఆయిల్ కంపెనీలు ఓ ప్యాటన్ ఫాలో అవుతున్నట్లు సోషల్ వి డియాలో జోరుగా చర్చ నడుస్తుంది.

2

## అమెరికాకు భారత్ కీలక భాగస్వామి

- భద్రత, వాణిజ్య,సాంకేతిక రంగాల్లో సహకారం
- ప్రధాని మోడీతో అమెరికా విదేశాంగ మంత్రి రూబియో చర్చలు



## హరీష్ రావువి పగటి కలలు

### అధికారంలోకి రావడం కల్ల

- ఫ్యూచటర్ సిటీపై బాధ్యాతారాహిత్య ప్రకటన
- అభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా బిఆర్‌ఎస్
- మండిపడ్డ మంత్రి శ్రీధర్ బాబు

### బీఆర్ఎస్‌కు ఫ్యూచర్ లేదు

- ఫ్యూచర్ సిటీకి తిరుగులేదు
- హరీష్ వ్యాఖ్యలపై పొంగులేటి కౌంటర్

బీఆర్ఎస్‌కు ఫ్యూచర్ లేదు.. ఫ్యూచర్ సిటీకి తిరుగులేదు' అంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు. లాగే మాజీమంత్రి హరీశ్‌రావుపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

▸▸వివరాలు 2లో..



**హైదరాబాద్,మే24(నినాదం):**

ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని బీఆరఎస్ నేత హరీశ్‌రావు బాధ్యతా రాహిత్యంగా మాట్లాడుతున్నారని మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. ఇది బ్లాక్ మెయిల్ రాజకీయమని మండిపడ్డారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలా? వద్దా? ఆయన చెప్పాలన్నారు. 'ఇలా చేస్తే పెట్టుబడులు రావు.



## రూ.43.80 కోట్లతో వేదపాఠశాలకు భూమిపూజ

ఉదయం ప్రత్యేక హెలికాప్టర్లో యాదగిరిగుట్ట పెద్దగుట్టపైకి చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డికి.. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, కలెక్టర్ అనురాగ్ జయంతి ఘన స్వాగతం పలికారు. సీఎంతో పాటు శాసనమండలి చైర్మన్ గుత్త సుఖేందర్ రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, ఎంపీ వేంనరేందర్ రెడ్డి.. యాదాద్రికి చేరుకున్నారు. పవిత్ర పుణ్యక్షేత్రం యాదగిరిగుట్టపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంప్రదాయ వేదపాఠశాల భవనానికి శంకుస్థాపన చేశారు. కంచి కామకోటి పీఠాధిపది శ్రీశంకర విజయేంద్ర సర్వస్వతి స్వామి సమక్షంలో ఈ క్రతువు జరిగింది. రూ.43.79 కోట్లతో క్షేత్రంలోని పెద్దగుట్ట ఆలయ నగరి లేఅవుట్ వద్ద 15 ఎకరాల విస్తీర్ణంలో వేదపాఠశాల భవనం నిర్మించనున్నారు. వచ్చే రెండేళ్లలో నిర్మాణం పూర్తి చేసి తరగతులు ప్రారంభించనున్నారు. అనంతరం శ్రీలక్ష్మి నరసింహస్వామి వారిని సీఎం దర్శించుకున్నారు.

## వరుసగా మూడోసారి పెట్రో ధరల పెంపు

**పెట్రోల్‌పై 87 పైసలు, డీజిల్ పై 91 పైసల వాయింపు**

ఇప్పటి వరకు నాలుగు రోజులకు ఒకసారి పెంచటం జరిగింది. 15వ తేదీ తర్వాత 19.. ఆ తర్వాత 23వ తేదీ.. అంటే ధరల పెంపు మధ్య 4 రోజుల గ్యాప్ ఉండేలా చూసుకుంటున్నారు. ఇదే సమయంలో మరో ఆసక్తికరమైన అంశంపై సోషల్ వి డియాలో చర్చ నడుస్తుంది. గతంలో పెట్రోల్, డీజిల్ ధరల పెంపును రాత్రి టైంలో అనౌన్స్ చేసేవాళ్లు.. రేపటి ఉదయం పత్రికల్లో ఆ వార్త వచ్చేసింది. ఇప్పుడు ఈ విధానం మారింది. అర్థరాత్రి తర్వాత.. తెల్లవారుజామున ధరల పెంపు ప్రకటన చేస్తున్నారు. ఉదయం ఆరు గంటల సమయంలోనే ఈ వార్త జనానికి తెలుస్తుంది. పెంచిన ధరలు ఈ ఉదయం 6 గంటల నుంచే అమల్లోకి వచ్చాయని ప్రకటిస్తున్నారు. పెట్రోల్, డీజిల్ రేట్లు పెంపు అనేది టీవీల్లో, సోషల్ మీడియాలో చూసి మాత్రమే జనం తెలుసుకుంటున్నారు.



## 25 నుంచి 'రైతు గోస' బీజేపీ భరోసా'

మూడో రోజు భూపాలపల్లి, కాటారం, మంథని, పెద్దపల్లిలో పోరుబాట నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నిరసన తెలపనున్నారు. రైతులతో ముఖాముఖి నిర్వహించనున్నారు. వారి సమస్యలు అడిగి తెలుసుకోనున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనుగోలు కేంద్రాల వద్ద ఉండనున్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఆధ్వర్యంలో పోరుబాట కొనసాగనుంది. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి అభయ్ పాటిల్ ఇందులో పాల్గొననున్నారు.



## అమెరికాకు భారత్ కీలక భాగస్వామి

న్యూఢిల్లీ :
భద్రత, వాణిజ్యం, సాంకేతిక రంగాలలో అమెరికా`భారత్ సహకారాన్ని మరింతగా పెంపొందించే మార్గాలపై ప్రధాని మోదీతో చర్చించినట్లు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో పేర్కొన్నారు. తమ దేశానికి భారత్ ఓ కీలక భాగస్వామి అన్నారు. అమెరికా` భారత్ మధ్య వాణిజ్య సంబంధాలు మరింత బలపడుతున్నాయని.. భారతీయ కంపెనీలు తమ దేశంలో 20 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు పెట్టాయని తెలిపారు. నాలుగు రోజుల పర్యటన నిమిత్తం భారత్‌కు చేరుకున్న మార్కో రూబియో ప్రధాని మోదీతో సమావేశమయ్యారు. వైట్‌హౌస్‌ను సందర్శించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తరఫున ఆయన మోదీని ఆహ్వానించారు. సేవాతీర్థ్ లో దాదాపు గంటకు పైగా ప్రధానితో భేటీ అనంతరం ఆయన వి□డియాతో మాట్లాడారు. భారత్‌కు ముడి చమురు సరఫరా చేయడానికి తమ దేశం సిద్ధంగా ఉందన్నారు. అదే సమయంలో ప్రపంచ ఇంధన మార్కెట్‌ను తన ఆధీనంలోకి తీసుకోవడానికి ఇరాన్ చేస్తున్న ప్రయత్నాలను తాము ఎప్పటికీ అంగీకరించబోమన్నారు. ప్రధాని మోదీకి, ట్రంప్‌నకు మధ్య మంచి స్నేహపూర్వక సంబంధాలు ఉన్నాయని రూబియో అన్నారు. వారిద్దరూ కేవలం తాత్కాలిక ప్రయోజనాల గురించే కాకుండా దీర్ఘకాలిక ప్రయోజనాలపైనా దృష్టిపెడతారని పేర్కొన్నారు. ఈ క్రమంలో దేశంలో మండుతున్న ఎండల గురించి మాట్లాడుతూ.. వేడిగా ఉన్నందున తన ప్రసంగాన్ని క్లుప్తంగా ముగించాలనుకుంటున్నానంటూ చమత్కరించారు. అమెరికా విదేశాంగ మంత్రి రూబియోతో భేటీపై ప్రధాని మోదీ స్పందించారు. భారత్`అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యం పురోగతితోపాటు ప్రాంతీయ, అంతర్జాతీయ శాంతి భద్రతలు తదితర అంశాలపై చర్చలు జరిపామన్నారు. భవిష్యత్తులో ఇరుదేశాల మధ్య బంధం మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచ శ్రేయస్సు కోసం అమెరికాతో కలిసి పని చేస్తామన్నారు. ఇరాన్‌తో నెలకొన్న ఉద్రిక్తతలను పరిష్కరించుకోవడానికి శాంతియుత చర్చలు జరపాలని ఈ సందర్భంగా ప్రధాని సూచించారు.

# దేశవ్యాప్తంగా భానుడి భగభగలు

ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, పంజాబ్, హర్యానా, చండీగఢ్, ఢిల్లీ, రాజస్థాన్‌లలోని పలు ప్రాంతాల్లో వడగాలులు వీస్తాయని ఐఎండీ వెల్లడించింది. విదర్భ, ఆంధ్రాలోని తీరప్రాంతం, యానాం, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశా, తెలంగాణ, జమ్మూ కశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలోనూ వడగాలులు వీచే అవకాశముందని తెలిపింది. శుక్రవారం ఉదయం దాదాపు 11 గంటల సమయానికి నమోదైన ఉష్ణోగ్రతల ప్రకారం.. ప్రపంచంలోనే 50 అత్యంత వేడి నగరాలన్నీ భారత్‌లోనే ఉన్నాయి. ఎయిర్‌క్వాలిటీ ఇండెక్స్ ఈ గణాంకాలను వెల్లడించింది. జాబితాలోని సగం నగరాలు ఉత్తరప్రదేశ్‌లోనివే కావడం గమనార్హం. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, బీహార్, తెలంగాణ, హర్యానా, మధ్యప్రదేశ్ తదితర రాష్టాల్లో□ని పలు ప్రాంతాలూ ఇందులో ఉన్నాయి.

**తెలంగాణ ఎండల తీవ్రతపై ప్రభుత్వం అలర్ట్**

వడగాల్పులతో 7 జిల్లాల్లో 16 మంది మృతిచెందారని తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల ఎక్‌గ్రేష◌ియా ఇస్తున్నట్లు ప్రకటించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో నష్టపరిహారం ఇస్తున్నామని స్పష్టం చేశారు. వచ్చే మూడు రోజులు మరింత తీవ్రంగా హీట్ వేవ్ ఉండనుందని తెలిపారు. జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని మార్గనిర్దేశం చేశారు. ప్రజల ప్రాణ రక్షణెలి తమ ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని తెలిపారు. వడగాల్పులతో ఒక్క ప్రాణం కూడా కోల్పోకూడదని చెప్పుకొచ్చారు. ఎండ తీవ్రతపై ప్రజలకు గంట గంటకు హెచ్చరికలు జారీ చేశామని మంత్రి పొంగులేటి తెలిపారు. ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ప్రజలు బయటకు రావొద్దని సూచించారు. వృద్ధులు, గర్భిణులు, చిన్నారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. వ్యవసాయ, భవన నిర్మాణ కార్మికులు ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టాలని నిర్దేశిరచారు. హీట్‌వేవ్‌పై గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఎండదెబ్బకు గురైన వ్యక్తులకు ఆయా ఆస్పత్రులు అత్యవసర చికిత్స అందించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఇదిలావుంటే తెలంగాణలో భానుడి భగభగలు తీవ్రరూపం దాల్చాయి. రాష్ట్రవ్యాప్తంగా ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతుండగా, 18కు పైగా జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 46 డిగ్రీల సెల్సియస్‌ను దాటాయి. పరిస్థితి తీవ్రంగా మారడంతో అధికారులు 18 జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. హైదరాబాద్ లోనూ ఉష్ణోగ్రతలు భారీగా పెరిగి 43 డిగ్రీలకుపైగా నమోదయ్యాయి. రాష్ట్రంలోని ఉత్తర, తూర్పు జిల్లాలు తీవ్ర వడగాలుల ప్రభావానికి గురవుతున్నాయి. వడదెబ్బ ప్రభావం ఆందోళనకరంగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా వడదెబ్బ కారణంగా 34 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో ప్రజలు అత్యవసరం అయితే తప్ప మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా అలసటగా ఉంటుంది, గాలిలో తేమ ఎక్కువగా ఉండటం, వేడిగా ఉన్నప్పుడు ఎక్కువగా అలసిపోయినట్లు అనిపిస్తుంది. కండరాల నొప్పి ఉంటుంది. హీట్ ఇంజురీలో శరీర భాగాలు దెబ్బతినే అవకాశం ఉంది. కిడ్నీ, గుండె సమస్యలు వచ్చే అవకాశం ఉంది. హీట్ స్ట్రోక్ తీవ్రమైన సమస్య.. దీనిలో శరీర భాగాలు తీవ్రంగా దెబ్బతింటాయి. దీని కారణంగా మెదడు పనితీరు దెబ్బతింటుంది. స్ట్రోక్ సంభవించవచ్చు. దీన్ని నిర్లక్ష్యం చేస్తే.. కోమాలోకి వెళ్లే ప్రమాదం ఉంది. ఈ వడదెబ్బ నుంచి తప్పించుకోవాలంటే.. శరీరాన్ని ఎప్పుడూ హైడ్రేట్‌గా ఉంచుకోవాలి. ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. మధ్యాహ్నం పూట బయటకు వెళ్లకపోవడం మంచిది. షుగర్, బీపీ పేషెంట్లు మెడికేషన్ సక్రమంగా తీసుకోవాలి. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 వరకు బయట తిరగకపోవడమే మంచిది. అత్యవసర పరిస్థితిలో వెళ్లాల్సి వస్తే.. తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ముదురు రంగు దుస్తులు కాకుండా తేలికపాటి లేత రంగు దుస్తులను ధరించాలి. ఆల్కాహాల్ శరీరంలోని నీటి శాతాన్ని తగ్గిస్తాయి. ఎండాకాలంలో మద్యానికి దూరంగా ఉండటం మంచిది. ఓఆరఎస్, కొబ్బరి నీళ్లు, ఉప్పు కలిపిన నిమ్మరసం లాంటివి శరీరం కోల్పోయిన లవణాలను తిరిగి భర్తీ చేస్తాయి. దోసకాయలు, పుచ్చకాయలు, దానిమ్మ, బత్తాయి లాంటి పండ్లు తీసుకోవాలి. వేసవిలో తేలికపాటి వ్యాయామాలు ఉదయం 8 గంటల్లోపే ముగించాలి. వడదెబ్బ లక్షణాలు కనిపించగానే చికిత్స అందించాలి. లేదంటే శరీరం పూర్తిగా నిర్జలీకరణం చెంది.. బీపీ, పల్స్ పడిపోయి కొన్నిసార్లు ప్రాణాలు పోవచ్చు.

# హరీష్ రావువి పగటి కలలు

పక్క రాష్టా లకు వెళ్తాయి. ఫ్యూచర్ సిటీలో కాలుష్యకారక పరిశ్రమలు ఉండవు. దాన్ని రద్దు చేస్తామనడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని బీఆరఎస్ అడ్డుకుంటోందని మంత్రి ఆరోపించారు. ఆ పార్టీ బ్లాక్‌మెయిలింగ్ రాజకీయాలకు యత్నిస్తోందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన మొదటిరోజు నుంచే బీఆరఎస్ నేతలు విమర్శలే ప్రధాన అంశంగా ముందు కెళ్తున్నారని తెలిపారు. జంట నగరాలకు సంబంధించిన మెట్రోను విస్తరించాలనుకుంటే అడ్డుకుంటున్నారని బీఆరఎస్ పార్టీ నేతలపై మంత్రి శ్రీధర్ బాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆరఎస్ నేతలు చీప్ పాలిటిక్స్.. బ్లాక్ మెయిల్ పాలిటిక్స్ చేయొద్దని అన్నారు. శనివారం వి డియాతో మాట్లాడుతూ.. ఎక్కడ అభివృద్ధి చేస్తే అక్కడ ఆపుతామంటే ఎలా అని ప్రశ్నించారు. ప్రజలు కోరుకున్నది తప్పకుండా చేసి తీరుతామన్నారు. వేలాది కోట్లు పెడతామని మల్టీ నేషనల్ కంపెనీలు వస్తున్నాయని.. ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామంటే పెట్టుబడిదారులు భయపడరా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్ తెచ్చిన మెట్రోనే ముందుకు సాగిందని మంత్రి తెలిపారు. తాము ఎన్ని కిలోవి టర్లు తెచ్చామో అన్ని కిలోవి□టర్లు మాత్రమే మెట్రో వచ్చిందని చెప్పారు. మెట్రోను విస్తరిద్దామంటే అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. పెరిగిన జనాభాకి అనుగుణంగా మెట్రో విస్తరించకూడదా అని ప్రశ్నించారు. అధికారంలోకి వస్తామని మాజీ మంత్రి హరీశ్ రావు పగటి కలలు కంటున్నారని విమర్శించారు. అసెంబ్లీ, పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆరఎస్ ఓడిపోయిందని.. అయినా ఆ పార్టీ నేతల బుద్ధి మారడం లేదని వ్యాఖ్యానించారు. నగరాన్ని విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోందని మంత్రి తెలిపారు. ప్రజల అవసరాలను తీర్చడానికి ప్రణాళికలు రూపొందించామన్నారు. ఇతర నగరాల అభివృద్ధిపై అధ్యయనం చేశామన్నారు. రాబోయే తరాలకు ఉపయోగపడే కార్యాచరణ చేపట్టాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడానికే బీఆరఎస్ ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని అడ్డుకోవాలని బీఆరఎస్ ప్రయత్నిస్తోందని మంత్రి ఆరోపించారు. ఓటమితో ఎదురైన నిరాశ నుంచి ఇప్పటికీ బయటకి రాలేకపోతున్నారన్నారు. బుల్లెట్ □ట్రైన్ తెస్తామంటే.. ఎందుకని బీఆరఎస్ నేతలు అడ్డుపడుతున్నారని ఫైర్ అయ్యారు. తెలంగాణ యువతకు మంచి భవిష్యత్తు ఇవ్వొద్దా అని అన్నారు. స్వార్థ రాజకీయాలే తమకి ముఖ్యమని బీఆరఎస్ నేతలు భావిస్తున్నారని మంత్రి శ్రీధర్ బాబు విరుచుకుపట్టారు.

**బీఆర్ఎస్‌కు ఫ్యూచర్ లేదు..**

బీఆరఎస్‌కు ఫ్యూచర్ లేదు.. ఫ్యూచర్ సిటీకి తిరుగులేదు' అంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు. లాగే మాజీమంత్రి హరీశ్‌రావుపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికా నుంచి ఫ్యూచర్ సిటీని ఆపేస్తామంటూ హరీశ్‌రావు ఎలా మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పొంగులేటి పోస్టు పెట్టారు. బీఆరఎస్‌లో హరీశ్‌రావు ఫ్యూచర్ ఏంటో ఆయనకే తెలియదు అంటూ కౌంటర్ ఇచ్చారు. ఫ్యూచర్ సిటీ భూములపై అమెరికాలో ఎవరికైనా ఒప్పందాలు చేసుకున్నారా..? అంటూ నిలదీశారు. కేసీఆర్ హయాంలోని పదేళ్లలో ఒక్క మెట్రోస్టేషన్ కూడా ఎందుకు పూర్తిచేయలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏకంగా కొత్త నగరాన్ని నిర్మిస్తోందని మంత్రి పొంగులేటి వ్యాఖ్యానించారు. కేసీఆర్ కుటుంబం ఫాంహౌస్‌లు కట్టుకుందని.. కానీ తాము రాష్ట్ర



భవిష్యత్తు కోసం ఫ్యూచర్ సిటీ కడుతున్నామని ఉద్ఘాటించారు. మ□సీప్రక్షాళన, లగచర్ల ఇండస్ట్రీస్‌కు బీఆరఎస్ నేతలు అడ్డుపడ్డారని ఆగ్రహించారు. యువతకు ఉద్యోగాలు కల్పించే ప్రయత్నాలను కుట్రలతో అడ్డుకున్నారని ◌ై□ర్ అయ్యారు. వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. దేశం గర్వించే విధంగా తాము ఫ్యూచర్ సిటీని నిర్మిస్తామని స్పష్టం చేశారు. హరీశ్‌రావు రాజకీయ భవిష్యత్తు ఖతం చేయాలని బీఆరఎస్ నేతలే చూస్తున్నారని సెటైర్లు గుప్పించారు.

## విధులను విస్మరించి.. విశ్రాంతికి పరిమితమై

మండల స్థాయి అధికారులు కిందిస్థాయి ఉద్యోగులు విధులను మరచి ఏసి గదుల్లో సేద తీరడం తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి, కొంతమంది అధికారులు ఉద్యోగులు సీఎం గెస్ట్ హౌస్ ని ప్రైవేటు రిసార్ట్ ల వాడుకోవడం స్థానికంగా చర్చనీయమైంది విధులకు డుమ్మా కొట్టి గంటల తరబడి విశ్రాంతి భవనంలో చేరదీరుతు పర్యవేక్షణను నిర్లక్ష్యం చేస్తూ గాలికి వదిలేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి, నిబంధనలకు విరుద్ధంగా అత్యంత భద్రతతో కూడిన ముఖ్యమంత్రి గెస్ట్ హౌస్ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పర్యటనలో తప్ప ఇతరులకు అనుమతి ఉండదు అంత్య పుష్కరాల విధులను సాగుగా చూపించి మండల స్థాయి సిబ్బంది భవనాన్ని ఆవాసంగా మార్చుకుని విశ్రాంతి తీసుకోవడం కోసం మెరుపు ఉన్నత అధికారుల దిశా నిర్దేశం లేక ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని పలువురు చర్చించుకుంటున్నారు, ఏది ఏమైనా విఐపి, వివిఐపీల భవనాలు కింది స్థాయి ఉద్యోగులకు మండుటెండల్లో మంచు దుప్పటిగా మారాయనే చెప్పవచ్చు.

## మాసాబ్ ట్యాంక్‌లో దారుణం

**హైదరాబాద్, నినాదం:**

హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ ప్రాంతంలో న్యాయవాది ఖాజా మొహియుద్దీన్‌పై ప్రత్యర్థులు దాడికి తెగబడ్డారు. శనివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వచ్చిన న్యాయవాదిని దుండగులు కారుతో బలంగా ఢీకొట్టారు. పక్కా ప్లాన్‌తో న్యాయవాది కోసం వేచి చూస్తున్న దుండగులు.. ఖాజా మొహియుద్దీన్ బయటకు వచ్చిన వెంటనే అత్యంత వేగంగా వచ్చి ఢీకొట్టి పరారయ్యారు. కారు ఢీకొట్టిన వెంటనే న్యాయవాది గాల్లోకి ఎగిరి కిందపడ్డారు. దీంతో ఆయనకు తీవ్రమైన గాయాలయ్యాయి. వెంటనే గమనించిన కుటుంబసభ్యులు.. మొహియుద్దీన్‌ను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు.అయితే ఆయన అప్పటికే మృతి చెందారు. న్యాయవాదిపై హత్యాయత్నం దృశ్యాలు సీసీటీవీ కెమెరాలో రికార్డ్ అయ్యాయి. న్యాయవాదిపై దాడి సమాచారం తెలుసుకున్న తోటి న్యాయవాదులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖాజా మొహియుద్దీన్‌ను కారుతో ఢీకొట్టిన దుండగులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఇది న్యాయవ్యవస్థపైనే దాడి అని వారు అభివర్ణించారు. ఈ ఘటనపై నాంపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. న్యాయవాదిపై దాడికి గల కారణాలు, ఆయనపై ఎవరు దాడి చేశారనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. కారు నంబర్ ఆధారంగా నిందితులను గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఇకపోతే మాసబ్‌ట్యాంక్ వద్ద కారు ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడ్డ న్యాయవాది ఖాజా మొయినుద్దీన్ కన్నుమ శారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ న్యాయవాది తుదిశ్వాస విడిచారు. న్యాయవాది తన కారు వద్దకు వచ్చి వెనక సీట్లో బ్యాగు పెట్టి.. డ్రై వింగ్ సీట్‌లో కూర్చోబోతున్న సమయంలో ఒక్కసారిగా దుండగులు కారుతో అతివేగంగా దూసుకొచ్చి బలంగా ఢీకొట్టారు. క్షణాల్లోనే ఈ ఘటన చోటు చేసుకుంది. న్యాయవాదికి తీవ్రమైన గాయాలవడంతో వెంటనే కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే న్యాయవాది పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. చివరకు చికిత్స పొందుతూ మొయినుద్దీన్ ప్రాణాలు కోల్పోయారు. సీసీటీవీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు.. కారు నంబర్ ఆధారంగా నిందితులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

## పర్సంటేజీ అయితనే సినిమా ఆడుద్ది

శనివారం తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ సభ్యులు మీడియాతో మాట్లాడుతూ.. 'తెలుగు ఫిల్మ్ ఛాంబర్ కమిటీతో రెండు, 3 సార్లు చర్చలు జరిగాయి. హరిహర వీరమల్లు రిలీజ్ సమయంలో.. రెండు నెలల్లో మా సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. 'కానీ, సంవత్సరం గడిచిపోయింది. పెద్ది సినిమాకు మాకు పర్సంటేజ్ కావాల్సిందే. మమ్మల్ని నిర్మాతలు రెచ్చగొడుతున్నారు. మొదట 3 వారాలు అన్నారు.. ఇప్పుడు ఆరు వారాలు అంటున్నారు. పర్సెంటేజ్ సిస్టమ్ అయితేనే సినిమాలు ఆడిస్తాము. 120 మంది థియేటర్స్ ఓనర్లు దీనస్థితిలో ఉన్నారు. పర్సంటేజ్ సిస్టంను కావాలనే నిర్మాతలు లేట్ చేస్తున్నారు. మాకు పర్సెంటేజ్ విధానం కావాల్సిందే. అది ఎంత ఇస్తారో చెప్పండి. 10,15 ఏళ్ల కింద థియేటర్స్‌కి మంచి రెవెన్యూ ఉండేది. ఇప్పుడు ఎగ్జిబిటర్స్‌కి రెవెన్యూ రావడం లేదు. కానీ, నిర్మాతలకు 14 రకాలుగా ఆదాయం వస్తోంది'.. పర్సంటేజ్ విధానం కొత్త విషయం కాదు. అన్ని రాష్టా ల్లో ఇప్పటికే ఉంది. కాబట్టి కూర్చుని పర్సంటేజ్‌ను తేల్చండి. అన్ని సినిమాల రిలీజ్ సాఫీగా జరుగుతుంది. మీటింగ్‌లో కూడా పర్సంటేజ్‌కు సైన్ చేస్తేనే పెద్ది రిలీజ్‌కు ఒప్పుకుంటామని చెప్పాము. సబ్ కమిటీలో మెంబర్స్‌గా ఉండి.. మాకు కావలసిన పర్సంటేజ్‌ను సాధించుకుంటాం. మెగాస్టార్ చిరంజీవి పిలిస్తే వెళతాం. పెద్దమనిషికి మా బాధలు చెప్పుకుంటాం. పర్సంటేజ్ సిస్టమే ఉండాలి. రెంటల్ మాట వద్దు' అని అన్నారు.

## దేశంలో పెరుగుతున్న చిన్నారుల అదృశ్యం కేసులు

కేవలం 'మిస్సింగ' కేసులుగా కాకుండా, అంతర్రాష్ట్ర ముఠాల కిడ్నాప్ కోణంలోనే దర్యాప్తు చేయాలని స్పష్టం చేసింది. పోలీసుల వద్ద ఉన్న క్రిమినల్ ట్రాకింగ్ డేటాబేస్, చైల్డ్ వెల్ఫేర్ అథారిటీల వద్ద ఉన్న 'విశాల్ వాసిల్య' డేటాబేస్ మధ్య సమన్వయం లేకపోవడాన్ని కోర్టు తప్పుపట్టింది. ఈ క్రమంలో సుప్రీంకోర్టు ఐదు కీలక ఆదేశాలను జారీ చేసింది. దేశంలోని వివిధ సంస్థలు నిర్వహిస్తున్న చిన్నారుల డేటాబేస్‌లన్నింటినీ అనుసంధానం చేయాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖను కోర్టు ఆదేశించింది. దీనివల్ల పోలీస్ అధికారులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు , జిల్లా బాలల రక్షణ విభాగాలు చైల్డ్ కేర్ హోమ్‌ల మధ్య సమాచారం రియల్ టైమ్‌లో షేర్ అవుతుంది. చాలా జిల్లాల్లో మానవ అక్రమ రవాణా నిరోధక విభాగాలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. దేశంలోని అన్ని ◌ంఊ□Tజలను తగిన అధికారాలు, మౌలిక సదుపాయాలతో 4 వారాల్లోగా పూర్తిగా అందుబాటులోకి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఏదైనా చైల్డ్ మిస్సింగ్ కేసు నమోదైన వెంటనే.. అధికారులు ప్రాథమికంగా దానిని కిడ్నాప్ లేదా అపహరణగా భావించి దర్యాప్తు ప్రారంభించాలి. దీనివల్ల ప్రొసీజర్ ఆలస్యం కాకుండా దర్యాప్తులో సీరియస్‌నెస్ వస్తుందని కోర్టు పేర్కొంది. ఒకవేళ ఆ కేసులో హ్యూమన్ ట్రాఫికింగ్ అనుమానాలు ఉంటే.. నిబంధనల ప్రకారం 4 నెలలు వేచి చూడకుండా వెంటనే కేసును బదిలీ చేయాలని స్పష్టం చేసింది. రక్షించిన లేదా రికవరీ చేసిన చిన్నారులను సాధారణంగా 24 గంటల్లోగా వారి కుటుంబాలకు అప్పగించాలి. ఒకవేళ ఆ నిర్దిష్ట చైల్డ్ ట్రాఫికింగ్ లేదా దోపిడీ వెనుక కుటుంబ సభ్యుల ప్రమేయం ఉన్నట్లు అనుమానం వస్తే తప్ప, మిగిలిన సమయాల్లో తక్షణమే తల్లిదండ్రుల వద్దకు చేర్చాలి. 2011 సెప్టెంబరులో చెన్నైలోని విరుగంబాక్కం పరిధిలో 'కవిత' అనే చిన్నారి అదృశ్యమైంది. స్థానిక పోలీసులు, సెంట్రల్ క్రై□మ్ బ్రాంచ్ దర్యాప్తు చేసినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులు ఈ కేసును ఆచూకీ లభించనిది గా పేర్కొంటూ క్లోజర్ రిపోర్ట్ ఇచ్చారు. దీనిపై తండ్రి జి. గణెలిష్ దాఖలు చేసిన పిటిషన్‌ను 2025 మార్చిలో మద్రాస్ హైకోర్టు తిరస్కరించింది. చిన్నారి 2011 లో మిస్ అయింది కావున, 2013 లో వచ్చిన హోం శాఖ యాంటీ`ట్రాఫికింగ్ గైడ్‌లైన్స్ దీనికి వర్తించవని హైకోర్టు పేర్కొంది. ఈ తీర్పును సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. 'చిన్నారి ఆచూకీ లభించనంత కాలం, చైల్డ్ ప్రొటెక్షన్ గైడ్‌లైన్స్, యాంటీ`ట్రాఫికింగ్ ప్రొటోకాల్స్ అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంటుంది' అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ కేసును సుమోటోగా స్వీకరించి, దేశవ్యాప్తంగా ఉన్న మిస్సింగ్ చిన్నారుల సమస్యపై ఈ సమగ్ర ఆదేశాలు జారీ చేసింది. ఇక, ఈ కేసు తదుపరి విచారణ ఆగస్టుకు వాయిదా వేసింది.

# రెండో విడతలో రెండున్నర లక్షలు

జూన్ 1వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క,రాష్ట్ర మంత్రులంతా అక్కడికి వెళ్లి ఈ కార్యక్రమంలో పాల్గొంటాం అని మంత్రి పొంగులేటి తెలిపారు. హైదరాబాద్ మహానగరం క్యూర్ పరిధిలోని 24 నియోజకవర్గాల్లో అల్పాదాయ వర్గాల వారి కోసం లక్ష ఇళ్లు నిర్మించి ఇవ్వాలని రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయించిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వివిధ దఫాలుగా చేసిన సర్వేల ప్రకారం 15 వేల కుటుంబాలు గుడిసెల్లో నివాసం ఉంటున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. వెంటనే ఆ కుటుంబాల న్నింటికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందించాలని రాష్ట్ర క్యాబినెట్ తీర్మానించింది. గుడిసెలు లేని ఆదర్శ రాష్ట్రంగా తెలంగాణను నిలపాలని క్యాబినెట్ నిర్ణయించింది. వచ్చే ఏడాది జూన్ 26 నుంచి జులై 7వ తేదీ వరకు జరగనున్న గోదావరి పుష్కరాలకు సంబంధించి వివిధ పనులు చేపట్టేందుకు రూ.1000 కోట్ల నిధులకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో తొలి విడతగా రూ.300 కోట్లు మంజూరుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. విద్యుత్ పంపిణీ, మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఖీఆ□Sలో చేరేందుకు తెలంగాణ డిస్కంలు తయారు చేసిన ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాష్ట్రంలోని అన్ని జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలు చేసేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రభుత్వం పాఠశాలలతో పాటు అన్ని జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకూ ఉదయం అల్పాహారంతో పాటు పాలు అందించాలని నిర్ణయించింది. రాష్ట్రంలోని డిసిఎంఎస్‌లను మార్క్ ఫెడ్లో విలీనం చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. తెలంగాణ రూరల్ ఇన్‌ఫ్రాస్టక్చ□ర్ కార్పొరేషన్ హాకాలో విలినం చేయాలని క్యాబినెట్ నిర్ణయించింది. పాలమ□రు` రంగారెడ్డి ఎత్తిపోతల పథకం భూ సేకరణ, పునరావాసం, మౌలిక వసతుల సదుపాయాల కల్పనకు రూ.587 కోట్లు కేటాయిస్తూ రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. తెలంగాణను 2030 నాటికి ప్రపంచంలోని టాప్ 5 లైఫ్ సైన్సెస్ హబ్‌లలో ఒకటిగా నిలబెట్టాలన్నది రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం. అందుకే నెక్స్ జనరేషన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026`30ని రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. దావోస్‌లో ఈ పాలసీని లాంఛనంగా ఆవిష్కరించాం అని తెపిపారు. ఈ పాలసీ ద్వారా వచ్చే ఐదేళ్లలో 5 లక్షల ఉద్యోగాలతో పాటు 25 బిలియన్ డాలర్ల పెట్టుబడులు ఆకర్షించాలనేది లక్ష్యంగా పెట్టుకున్నాం. లైఫ్ సైన్సెస్, ఫార్మా, బయోటెక్, మెడికల్ ఇన్నోవేషన్ రంగాల్లో భారీ పెట్టుబడులకు గమ్యస్థానంగా మారుస్తాం. యువతకు పరిశోధన, తయారీ, డిజిటల్ హెల్త్, గ్లోబల్ ఇన్నోవేషన్ రంగాల్లో మంచి అవకాశాలు కల్పిస్తాం. ఇప్పటివరకు ఎక్కువగా తయారీ వి ద దృష్టి ఉంటే, ఇక నుంచి విలువైన ఇన్నోవేషన్ వి ద ఎక్కువ ఫోకస్ పెడతాం. రీసెర్చ్ అండ్ డెవెలప్మెంట్ య నిట్లను కూడా పరిశ్రమలుగా గుర్తించే విధంగా ఈ పాలసీలో మార్పు తీసుకొస్తున్నాం. గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు, గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్లు తెలంగాణకు రావడానికి ఈ పాలసీ ఉపయోగపడుతుందని మంత్రులు వివరించారు.




## గోదావరి పుష్కరాలకు వేయికోట్లు

వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నేపథ్యంలో.. సంబంధిత పనులకు రూ.వెయ్యి కోట్ల కేటాయిస్తూ తెలంగాణ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. తొలి విడతగా రూ.300 కోట్ల మంజూరుకు పచ్చజెండా ఊపింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ భేటీలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. జూనియర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజనం పథకం అమలుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో అల్పాహారం, పాలు అందించాలని నిర్ణయించింది. అస్సాం రైఫిల్స్, బీఎసఎఫ్, సీఐఎసఎఫ్ సెంటర్ల ఏర్పాటుకు కరీంనగర్ జిల్లాను ఎంపిక చేసింది. కేసముద్రం ఫైర్‌స్టేషన్‌కు 18 పోస్టుల మంజూరుకు అంగీకారం తెలిపింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ కేబినెట్ శనివారం భేటీ అయ్యింది. రాష్ట్రానికి సంబంధించి పలు అంశాలపై మంత్రిమండలి చర్చించింది. ఈ సందర్భంగా కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేసేందుకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పాఠశాలలతో పాటు జూనియర్ కళాశాలల్లోనూ విద్యార్థులకు ఉదయం అల్పాహారం, పాలు అందించాలని మంత్రిమండలి నిర్ణయించింది. 2027 గోదావరి పుష్కరాల పనులకు రూ.1,000 కోట్లు కేటాయిస్తూ తెలంగాణ క్యాబినెట్ ఆమోదం తెలిపింది. తొలివిడతగా రూ.300 కోట్లు మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మరోవైపు నిరుద్యోగ యువతకూ మంత్రిమండలి గుడ్ న్యూస్ చెప్పింది. కరీంనగర్ జిల్లా గంగాధరలోని డిగ్రీ కళాశాలలో నియామకాలకు పచ్చజెండా ఊపింది. 20 రెగ్యులర్ టీచింగ్ పోస్టులు, 6 నాన్ టీచింగ్ పోస్టులు, అవుట్ సోర్సింగ్ పద్ధతిన మరో 3 పోస్టుల మంజూరుకు ఆమోదం తెలిపింది. మహబూబాబాద్ జిల్లా కె.సముద్రం అగ్నిమాపక కేంద్రానికి సంబంధించి 18 పోస్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

# యువత క్రీడలను జీవితంలో భాగం చేసుకోవాలి

## గ్రామీణ–పట్టణ యువత ఉత్సాహభరిత భాగస్వామ్యం అభినందనీయం

### జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని యువతకు పిలుపు.. నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్





**నాగర్ కర్నూల్ మే 23 (నినాదం)**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా మే 18 నుండి మే 23వ తేదీ వరకు నాగర్ కర్నూల్ జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన యువత క్రీడోత్సవాలు శనివారం నాగర్ కర్నూల్ కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ హాజరై మాట్లాడుతూ., యువతలో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ పెంపొందించడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ప్రభుత్వం కూడా యువత ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకునేలా క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. క్రీడలు కేవలం వినోదానికి మాత్రమే కాకుండా వ్యక్తిత్వ వికాసానికి, నాయకత్వ లక్షణాల పెంపుకు, సమయపాలన అలవాటు చేసుకోవడానికి దోహదపడతాయని కలెక్టర్ వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా క్రీడా సంస్కృతి పెరుగుతోందని, ఇది భవిష్యత్తులో మరింత మంది ప్రతిభావంతులైన క్రీడాకారులు ఎదగడానికి దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన యువకులు, యువతులకు జిల్లా కలెక్టర్ బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. పోటీల్లో విజయం సాధించిన వారిని అభినందిస్తూ, వారి కృషి, పట్టుదల ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. విజయం ఒక్క రోజులో రాదని, నిరంతర సాధన, క్రమశిక్షణ, అంకితభావంతోనే ఉన్నత ఫలితాలు సాధించవచ్చని చెప్పారు. అలాగే పోటీల్లో విజయం సాధించలేకపోయిన వారు నిరుత్సాహానికి గురికావద్దని సూచించారు. ఓటమిని అంతిమంగా భావించకుండా దాన్ని విజయానికి మెట్టుగా తీసుకోవాలని, మరింత కృషి చేసి తదుపరి అవకాశాల్లో తమ ప్రతిభను నిరూపించుకోవాలని యువతకు సూచించారు. ప్రతి పోటీ అనుభవాన్ని భవిష్యత్తు విజయానికి పునాదిగా మార్చుకోవాలని తెలిపారు. జిల్లాకు చెందిన యువత రాష్ట్ర, జాతీయ స్థాయిలో మాత్రమే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో కూడా రాణించే సామర్థ్యం కలిగి ఉన్నారని, అందుబాటులో ఉన్న క్రీడా సదుపాయాలు, ప్రభుత్వ ప్రోత్సాహక కార్యక్రమాలను వినియోగించుకుని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లాకు మంచి పేరు తీసుకురావడంతో పాటు భవిష్యత్తులో క్రీడలను ఉపాధి అవకాశాలుగా కూడా మలచుకోవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జ్యూట్ బ్యాగులను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించి పంపిణీ చేశారు. కార్యక్రమం ముగింపులో యువతను క్రీడలు, ఆరోగ్యకర జీవన విధానం మరియు సామాజిక బాధ్యతల వైపు మరింతగా మళ్లించేందుకు ఇటువంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని అధికారులు, నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి సీతారాం నాయక్, జిల్లా టూరిజం అధికారి నరసింహ, డీఈఓ రమేష్ కుమార్, డిఎంహెచ్వో డాక్టర్ రవి కుమార్, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకటరమణ వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.





## మార్కెట్ వాల్యూ అప్డేషన్ వేగవంతం చేస్తాం

### నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

**నాగర్ కర్నూల్ మే 23 (నినాదం)**

హైదరాబాద్ నుండి చీఫ్ కమిషనర్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ లోకేష్ కుమార్ మరియు రెవెన్యూ శాఖ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మార్కెట్ వాల్యూ అప్డేషన్ పై శనివారం సమీక్ష నిర్వహించారు. నాగర్ కర్నూలు వీడియో కాన్ఫరెన్స్ మందిరం నుండి వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ అమరేందర్ తో కలిసి జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ పాల్గొన్నారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా మార్కెట్ వాల్యూ అప్డేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. భూభారతి ఐజిఆర్ఎస్ పోర్టల్లో ఫామ్ 1, 2, 3, 4లకు సంబంధించి అప్డేషన్ ప్రక్రియ వేగవంతంగా చేపట్టాలని సూచించారు. జీవో నెంబర్ 44 ప్రకారం జిల్లా స్థాయి నుండి మండల స్థాయి వరకు కమిటీలను ఏర్పాటు చేసి మార్కెట్ వాల్యూ సవరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. భూ లావాదేవీలు, రిజిస్ట్రేషన్ వ్యవస్థలో పారదర్శకత పెంపుతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఈ ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ...నాగర్ కర్నూలు జిల్లాలో ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలోని గ్రామాలు పట్టణాల్లో మార్కెట్ వాల్యూ అప్డేషన్ పనులను వేగవంతంగా పూర్తి చేయడం జరుగుతుందని, జిల్లాలో భూ భారతి దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు తాహసిల్దార్లు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## తండ్రిని బలిగొన్న బ్లడ్ క్యాన్సర్..

### పసికందును ముద్దాడకుండానే కన్నుమూసిన వైనం

**కామారెడ్డి జిల్లా మే 23 (నినాదం):**

కామారెడ్డి జిల్లా మాచరెడ్డి మండలం అతనికి ఇద్దరు ఆడపిల్లలు.వారసుని కోసం కలలు కన్నాడు.తనకు కొడుకు పుట్టాలని తాపత్రయ పడ్డాడు.దేవుడు కరుణించి వారసుడిని ఇచ్చాడు.కొడుకు పుట్టడంతో అందరూ సంబరపడ్డారు. కొడుకుతో తనివితీరా ఆడుకోకుండానే బ్లడ్ క్యాన్సర్ అనే మహమ్మారి ఆ తండ్రిని కొడుక్కు దూరం చేసింది.దాంతో "నాన్న" అనే పిలుపు వినకుండానే,కన్న కొడుకును ఒక్కసారి ముద్దాడకుండానే ఓ తండ్రి అనంతలో కాలకు వెళ్లిపోయాడు.ఉన్నట్టుండి కుప్పకూలాడు..ఈ విషాద ఘటన మాచారెడ్డి మండలం లక్ష్మీరావుల పల్లి గ్రామంలో చోటుచేసుకుంది.గ్రామానికి చెందిన పుట్ట శంకర్ది (38) రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబం.8 ఏళ్ల కూతురు,3 ఏళ్ల పాపతో బతుకు బండి లాగుతున్న వేళ,15 రోజుల క్రితం కొడుకు పుట్టాడు."మగ పిల్లాడు పుట్టాడు,ఇక నా కష్టాలు తీరినట్టే" అని ఊరంతా చెప్పుకున్నాడు.పేరు పెట్టాలని, బారసాల చేయాలని కలలు కన్నాడు.శుక్రవారం ఉదయం కూలి పనికి వెళ్లిన శంకర్,సాయంత్రం ఇంటికొచ్చేసరికి ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు.హుటాహుటిన కుటుంబ సభ్యులు శంకర్ను హైదరాబాద్ తరలించగా డాక్టర్లు బ్లడ్ క్యాన్సర్ చివరి దశ అని చెప్పారు.ఆ మాట వినేలోపే,చికిత్స అందేలోపే శంకర్ ప్రాణం గాల్లో కలిసిపోయింది.

**ఆగమైన కుటుంబం..**

కొడుకును ఎత్తుకోలేదు,పేరు పెట్టి పిలవలేదు,నాన్న అని పిలిపించుకోలేదు.అంతలోనే అతని ఊపిరి ఆగిపోయింది.మంచంపై 15 రోజుల పసివాడు.పక్కన భర్త మరణం..మరోవైపు ఏం జరిగిందో తెలియక నాన్న ఎప్పుడొస్తాడు? అని అడుగుతున్న 6వ తరగతి కూతురు,మూడేళ్ల చిన్నారి మాటలు ఆ తల్లిని కృంగిపోయేలా చేస్తోంది.భర్తే ఆధారంగా బతికిన ఆ తల్లికి,ఇప్పుడు ముగ్గురు పిల్లల్ని ఎలా సాకాలో తెలియని పరిస్థితి నెలకొంది.ఒక్క కుటుంబ పెద్ద మరణంతో లక్ష్మీరావులపల్లి లో విషాదఛాయలు అలుముకున్నాయి.క్యాన్సర్ లాక్కెళ్లింది ఒక్క ప్రాణాన్నే కాదు..ముగ్గురు పిల్లల భవిష్యత్తును,ఒక తల్లి ధైర్యాన్ని కూడా..అంత్యక్రియలు చేసే చోటకు 15 రోజుల కొడుకును తీసుకుని వస్తే గ్రామస్థులంతా అది చూసి కంటతడి పెట్టుకున్నారు.

## వారం రోజుల్లో 162 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

### 16,00,000 జరిమానా విధించిన సంబంధిత కోర్టులు
### పోలీస్ కమిషనర్ సాయిచైతన్య వెల్లడి

**నిజామాబాద్ ప్రతినిధి, మే 23 (నినాదం) :**



నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అన్ని లా అండ్ ఆర్డర్ , ట్రాఫిక్ పి.ఎస్ లలో గడిచిన వారం రోజుల్లో 162 మంది డ్రంకన్ డ్రైవ్ లో పట్టుబడగా వారిని నిజామాబాద్, బోధన్, అర్మూర్ కోర్టులలో వారిని హాజరుపర్చగా వారిలో ఇద్దరికి వారం రోజుల పాటు జైలు శిక్ష విధించగా, మిగిలిన వారికి 16,00,000 జరిమానా విధించినట్లు పోలీసు కమిషనర్ సాయిచైతన్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనరేట్ పరిధిలో చేసిన తనిఖీలలో అధిక మొత్తంలో మద్యం తాగి వాహనాలు నడిపి పోలీస్ వారికి పట్టుబడటం జరిగిందన్నారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్ , ఆర్మూర్ , బోధన్ డివిజన్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వాహనాల తనిఖీలు నిర్వహించారన్నారు. ఇందులో భాగముగా ఈ నెల 18 నుండి 23 వరకు వాహన తనిఖీలు నిర్వహించగా ఇందులో మొత్తం 162 కేసుల నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా సీపీ వాహనదారులకు పలు సూచనలు చేశారు. ప్రజలు మద్యం సేవించి వాహనాలు నడపరాదని, వాహనాదారులు వాహనానికి సంబంధించినటువంటి పత్రములు సక్రమముగా తమ వద్ద ఉంచుకోవాలన్నారు. డ్రంకన్ డ్రైవ్ లో పట్టుబడిన వారి లైసెన్స్ 6 నెలల పాటు సస్పెండ్ చేయబడునని, మద్యం తాగి వాహనం నడిపి అనుకోని రోడ్ ప్రమాదం జరిగినట్లయితే ఇన్సూరెన్సు లభించదన్నారు. మైనర్లు తాగి వాహనం నడిపి పోలీస్ వారికి దొరికినట్లైతే మైనర్, వెహికల్ ఓనర్ పైన ఛార్జ్ షీట్ నమోదు చేయబడునని అలాగే జైలు శిక్ష విధించే అవకాశం కలదన్నారు. ఒక సారి కంటే ఎక్కువ సార్లు పట్టుబడినట్లయితే జైలు శిక్ష విధించబడునని, మోటర్ వెహికల్ యాక్ట్ 1989 (చట్టం సవరణ – 2019) అమలులో ఉన్నందున డ్రంక్ అండ్ డ్రైవ్ లో మొదటిసారి పట్టుబడినట్లయితే 10,000/- జరిమానా లేదా ఆరు నెలల జైలు శిక్ష లేదా జరిమానా తో పాటు జైలు శిక్ష విధించబడునన్నారు. అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్ లో రెండోసారి పట్టుబడినట్లయితే 15,000 జరిమానా లేదా జైలు శిక్ష లేదా జైలు శిక్షతో పాటు జరిమానా విధించబడునన్నారు.

## గోలి శ్రీనివాస్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి

**కల్వకుర్తి మే 23 (నినాదం)**



హైదరాబాద్ లోని ఆదర్శనగర్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి,సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గోలి శ్రీనివాస్ రెడ్డి ని శాలువాతో సన్మానించి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు వారితో పాటు ఎమ్మెల్సీ ఎల్. రమణ మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి శంషాబాద్ మాజీ ఎంపీపీ మురలీధర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

## రెవెన్యూ ఇరిగేషన్ శాఖల సమన్వయంతో ప్రాజెక్టులు వేగవంతం

### సాగునీటి ప్రాజెక్టులకు భూ సేకరణ నిర్దేశిత గడువులో పూర్తి చేయాలి

### నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

**నాగర్ కర్నూల్ మే 23 (నినాదం)**






నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలో కొనసాగుతున్న ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల భూ సేకరణ ప్రక్రియను ప్రాజెక్టుల నిర్మాణాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులను ఆదేశించారు.
పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకంతో పాటు జిల్లాలో అమలవుతున్న ఇతర సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణపై శనివారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు, ప్రాజెక్టుల ఇంజినీర్లు, అదనపు కలెక్టర్ అమరేందర్ తో కలిసి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సమీక్ష నిర్వహించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతి ప్రాజెక్టు వారీగా వివరాలు ఆరా తీశారు. ఏ ప్రాజెక్టుకు ఎంత భూమి అవసరం, ఇప్పటివరకు ఎంత భూమి సేకరించబడింది, ఇంకా ఎంత భూమి సేకరించాల్సి ఉంది అనే అంశాలపై పూర్తి గణాంకాలతో నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. భూ సేకరణలో జరుగుతున్న ఆలస్యానికి గల కారణాలు, రైతుల అభ్యంతరాలు, కోర్టు కేసులు, పరిహారం చెల్లింపుల స్థితి వంటి అంశాలను కూడా సమగ్రంగా పరిశీలించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులు ఆలస్యం కాకుండా పనులు వేగవంతం చేయాలని, భూ సేకరణ అనేది ఏ ప్రాజెక్టు పురోగతికైనా కీలకమైన దశ అని, భూ సేకరణ దశలో చిన్నపాటి ఆలస్యం జరిగినా మొత్తం ప్రాజెక్టు పనులపై ప్రభావం పడే అవకాశం ఉందని కలెక్టర్ సూచించారు. అందుకే ప్రతి మండల స్థాయిలో ప్రత్యేక సమన్వయ బృందాలను ఏర్పాటు చేసి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని కలెక్టర్ ఆర్డీవో లకు సూచించారు. రైతులతో సానుకూల చర్చల ద్వారా భూసేకరణను వేగవంతం చేయాలని, వారికి చట్టప్రకారం న్యాయమైన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని, భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను సూచించారు. ప్రాజెక్టుల పురోగతిని మరింత వేగవంతం చేయడానికి రెవెన్యూ మరియు ఇరిగేషన్ శాఖల మధ్య సమన్వయం అత్యంత అవసరమని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి వారం పురోగతి నివేదికలు సమర్పించాలని, పెండింగ్ సమస్యలను స్థాయివారీగా సమీక్షించి పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.సాగునీటి ప్రాజెక్టులు పూర్తయితే జిల్లాలో వేలాది ఎకరాల భూమికి సాగునీరు అందుబాటులోకి వచ్చి వ్యవసాయ ఉత్పాదకత పెరుగుతుందని కలెక్టర్ తెలిపారు.
ఈ సమావేశంలో ఇరిగేషన్ శాఖల ఎస్సీలు పార్థసారథి, సత్యనారాయణ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అరుణ, ఆర్డీవోలు సురేష్ బాబు , జనార్దన్ రెడ్డి, యాదగిరి బన్సీలాల్ తాహసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## అర్బన్ అభివృద్ధికి నిధులు ఇవ్వండి

**కాంగ్రెస్‌లో పదవులే ముఖ్యం . . .**
**ప్రజా సమస్యలు కాదు**
**కేంద్రం నుంచి నిధులు నిండుగా వస్తున్నా . .**
**రాష్ట్రం నుంచి సున్నా**
**అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ**



**నిజామాబాద్ ప్రతినిధి, మే 23 (నినాదం)**

ప్రభుత్వ పెద్దలు జిల్లాలో అనేక మంది ఉన్నా అర్బన్ కు నిధులు తేవడంలో విఫలమయ్యారని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే ధన్ పాల్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడిచినా అర్బన్ కు ఒక్క రూపాయి నిధులు ఇవ్వలేదన్నారు. జిల్లాపై కక్షపూరితంగా వ్యవహరిస్తుందని ప్రజలను మభ్యపెడుతూ ముందుకు సాగుతుందన్నారు. వైఎస్ఆర్, డీఎస్ మాదిరిగా.. రేవంత్ రెడ్డి, మహేష్ కుమార్ గౌడ్ జోడీ లక్కీ అంటున్నారు కానీ..కేవలం జేబులు నింపడానికి జోడీ కలిసిందన్నారు. ఖమ్మం, కరీంనగర్, వరంగల్ కు వోఆర్ఆర్ మంజూరు చేశారు కానీ నిజామాబాద్ పై చిన్నచూపు ఎందుకని ఎమ్మెల్యే ప్రశ్నించారు. మున్సిపల్ ఎన్నికలకు ముందు ఫిబ్రవరిలో స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి జిల్లాకు వచ్చి ఓఆర్ఆర్ తీసుకొస్తానంటూ ప్రకటించారని గుర్తు చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం కాంగ్రెస్ పిసిసి ప్రెసిడెంట్ జిల్లా వాసి, ఇద్దరు ప్రభుత్వ సలహాదారులు, చైర్మన్లు, రూరల్ ఎమ్మెల్యే కాంగ్రెస్ కు చెందిన వ్యక్తే అయినా నగరానికి రింగురోడ్డు తేలేకపోయారని విమర్శించారు. సీఎం వైయస్సార్ సమయంలోనే జిల్లాకు 52 కిలోమీటర్ల ఓఆర్ఆర్ ప్రణాళిక సిద్ధమైందన్నారు. ఏళ్లు గడుస్తున్నా పూర్తి కావడం లేదు అన్నారు. కేవలం 11 కిలోమీటర్ల బైపాస్ రోడ్డును 12 ఏళ్లుగా పూర్తి చేయకుండా నత్తనడకన నడిపిస్తున్నారని విమర్శించారు. అలాగే ఖమ్మం, వరంగల్, కరీంనగర్ కు ఆయా అభివృద్ధి పనుల కోసం 5,620 కోట్లు నిధులు వచ్చాయన్నారు. రాష్ట్ర వాటాతో నిధులు సమకూరాయని కానీ నిజామాబాద్ కు మాత్రం విస్మరించారన్నారు. నిజామాబాద్ అర్బన్ లో 30 ఏళ్లుగా మాస్టర్ ప్లాన్ అటకెక్కిందని, స్టేడియం నిర్మిస్తామని హామీ ఇచ్చి విస్మరించారన్నారు. కళాభారతి, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ లు అసంపూర్తిగా మిగిలిపోయాయని చెప్పారు. కాంట్రాక్టర్లకు నిధులు చెల్లించకపోవడంతో నిలిచిపోయాయని తెలిపారు. కేంద్రం నుంచి నిధులు నిండుగా వస్తున్న రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఇవ్వడం లేదని ఆరోపించారు. ఇలాగే కొనసాగితే బిజెపి పోరాటం ఉధృతం చేస్తుందన్నారు. వచ్చే వారంలో సీఎంని కలుస్తానని, స్పందించకపోతే తమ సత్తా చాటుతామన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి స్రవంతి రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు నాగోల్ల లక్ష్మీనారాయణ, పోతన్కర్ లక్ష్మీనారాయణ, బీజేపీ ఫ్లోర్ లీడర్ ప్రమోద్, కార్పొరేటర్లు న్యాలం సునీత రాజు, మఠం పవన్, చింతకాయల రాజేందర్, కల్పే చిరంజీవి, జగదీష్ కులకర్ణి, పసునూరి రాము మండల అధ్యక్షులు ఇప్పకాయల కిషోర్, భూపతి తదితరులు పాల్గొన్నారు.






## కామారెడ్డిలో అమానవీయ ఘటన
## ఇసుక కుప్పలో పసికందు మృతదేహం

### కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన కామారెడ్డి పట్టణ సిఐ నరహరి

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 23 (నినాదం)**

కామారెడ్డి పట్టణంలో మానవత్వం మంటకలిసింది..ఇసుక కుప్పలో పసికందు మృతదేహాన్ని చూసిన వారి కళ్లల్లో నీళ్లు తిరిగాయి.పట్టణంలోని ముషీరాబాగ్ ప్రాంతంలో ఈ హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది.రెండురోజుల వయస్సున్న పసికందు..పట్టణంలోని ముషీరాబాగ్ ప్రాంతంలోని ఇసుక కుప్పలో రెండు రోజుల వయసున్న పసికందు విగతజీవిగా పడి ఉండడాన్ని స్థానికులు గుర్తించారు.ఈ ఘటనతో ప్రాంతంలో తీవ్ర కలకలం రేగింది.శనివారం ఉదయం ఆ దారిన వెళ్తున్న వారు ఇసుక కుప్పలో పసికందు మృతదేహాన్ని చూసి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.ఘటనాస్థలికి చేరుకున్న కామారెడ్డి పట్టణ పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.అభం శుభం తెలియని ఆ చిన్నారిని ఎవరు వదిలేసి వెళ్లారనే దానిపై సర్వత్రా చర్చ జరుగుతోంది.బిడ్డను పోషించలేక వదిలేశారా..? లేక ఇంకా ఏమైనా కారణాలు ఉన్నాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.పోలీసులు కేసు నమోదు చేసుకొని,చుట్టుపక్కల సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తున్నారు.ఆస్పత్రుల్లో ఇటీవల జరిగిన ప్రసవాల వివరాలను కూడా ఆరా తీస్తున్నట్లు సమాచారం.ఈ ఘటనపై స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## రూ 5 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

**మణుగూరు మే 23 (నినాదం):**





భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలో మున్సిపాలిటీ పరిధిలో 5 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శనివారం శంకుస్థాపన చేశారు. మణుగూరు పట్టణంలో మున్సిపాలిటీ పరిధిలో ఉన్న డ్రైనేజ్ సమస్యలను శాశ్వత పరిష్కారం చూపటమే లక్ష్యంగా ఈ పనులను ప్రారంభించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అన్నవరం బైపాస్ రోడ్ లో సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు 43 లక్షల రూపాయలతో పనులను ప్రారంభించారు. అలాగే శాంతినగర్ సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు 23 లక్షలు తో పనులు ప్రారంభించారు. కోటకట్ట ప్రాంతంలో సైడ్ డ్రైనేజ్ నిర్మాణ పనులకు 47 లక్షల రూపాయలు, పాత మణుగూరులో సైడ్ డ్రైనేజ్ నిర్మాణ పనులకు 42 లక్షల రూపాయలు, గాంధీ బొమ్మ సెంటర్ ప్రాంతంలో సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు 48 లక్షల రూపాయలు, మంగళ కట్ట ప్రాంతంలో సైడ్ డ్రైనేజీ పనులకు 47 లక్షల రూపాయలు, నాయుడు కుంటలో పూడిక తీత మరియు అభివృద్ధి పనులకు 2.50 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు ప్రారంభించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోనే ఎన్నడూ లేని విధంగా సుమారు 5 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమ ధ్యేయంగా పనిచేస్తుందని, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి మరియు సంక్షేమ పాలన సమర్థవంతంగా కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. పినపాక నియోజకవర్గం ప్రజలకు అవసరమైన ప్రతి మౌలిక వసతులు కల్పించేందుకు తాను నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు భాగంగానే మణుగూరు మున్సిపాలిటీ పరిధిలో ఐదు కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు ఈరోజు శంకుస్థాపన చేయడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు మున్సిపల్ డి ఈ, హౌసింగ్ ఏఈ పావని, వర్క్ ఇన్స్పెక్టర్లు పాల్గొనగా, మండల అధ్యక్షుడు పీర్నాకి నవీన్ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ శివ సైదులు, లక్ష్మణ్, దుర్గంపూడి ఈశ్వర్ రెడ్డి, శివాలయం చైర్మన్ కూచిపూడి బాబు, తదితరులు పాల్గొన్నారు.



## వైరా ఏసీపీని కలిసిన డీసీసీ డాక్టర్స్ సెల్ జిల్లా అధ్యక్షులు మురళీకృష్ణ

**వైరా, మే 23 (నినాదం):**

వైరా ఏసిపి ఎస్ సారంగపాణిని శనివారం కాంగ్రెస్ పార్టీ డాక్టర్ సెల్ జిల్లా అధ్యక్షులు, లయన్స్ క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. తన పరిధిలో ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ మత్తు పదార్థాల రవాణా, వినియోగం తదితర అక్రమ కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపుతూ, చెడు మార్గాల వైపు మళ్ల కుండా యువత లో చైతన్యం కలిగిస్తున్నందుకు అభినందించారు. అనంతరం ఏసీపీకి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైరా ఎస్సై పుష్పాల రామారావు, లైన్స్ క్లబ్ సభ్యులు ఉంద్రు శ్యాంబాబు, తోటకూర శ్రీకాంత్, ఉయ్యూరు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## డాక్టరేట్‌ను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

**కల్వకుర్తి మే 23 (నినాదం)**

మలిదశ తెలంగాణ ఉద్యమకారులు, సామాజిక విద్యావేత్త అయిల్ సదానందం గౌడు కి యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీచే చెన్నై లోని భారతీయ విద్యా భవన్ లో మే 17 ఆదివారం రోజున "డాక్టరేట్ పురస్కారం పొందిన సందర్భంగా కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ మరియు కౌన్సిలర్ లు ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసు లో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆనంద్ కుమార్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమకారుడు, సామాజిక విద్యావేత్త అయిల్ సదానందం గౌడు ని డాక్టరేట్ పురస్కారంతో గౌరవించడం మన కల్వకుర్తి ప్రాంతానికి గర్వకారణం అని పేర్కొన్నారు.తలకొండపల్లి మండలం, చెన్నంపల్లి గ్రామంలోని సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన సదానందం గౌడు ప్రభుత్వ హాస్టల్లో చదువుకోని ప్రసిద్ధ ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఎ, ఎంఫిల్, బి.ఎడ్, సెట్ లో ఫస్టు క్లాసులో పట్టా పొందారు.విద్యారంగంలో గత 26 ఏండ్లుగా లెక్చరర్ గా వారు చేసిన సేవలు ,పర్యావరణ పరిరక్షణకై చేసిన కృషి, సామాజిక సేవలకు గుర్తింపుగా ఈ గౌరవ డాక్టరేట్ అవార్డు అందజేశారని ఆనంద్ కుమార్ పేర్కొన్నారు.ఈ సన్మాన కార్యక్రమంలో కౌన్సిలర్ రామరాజు, శ్రీకాంత్ రెడ్డి ,గణేష్ యాదవ్, చిత్తారి శ్రీను, నిజాముద్దీన్ ,హరికృష్ణ, దున్న భాస్కర్ ,పుస్తకాల రాహుల్, పడకంటి వెంకటేష్ , దున్న సురేష్, శివ మొదలగు వారు పాల్గొన్నారు



## ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేసిన కాంగ్రెస్ నాయకులు

**ఆర్మూర్, మే 23 ( నినాదం):**

బాల్కొండ పట్టణ కేంద్రంలో గల పోచమ్మ గల్లీలో నూతన ఇందిరమ్మ గృహ నిర్మాణానికి బాల్కొండ మండల కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు సంజీవ్ గౌడ్, స్థానిక సర్పంచ్ గాండ్ల రాజేష్, ఉప సర్పంచ్ రాజేందర్, డిసిసి కార్యదర్శి యూనిస్, యూత్ అధ్యక్షులు అరవింద్ కుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఇమ్రాన్ ఖాన్, మజారుద్దీన్, సన్నీ యాదవ్, సాయన్న, వినేసులు శనివారం రోజున లబ్ధిదారులైన నూతన ఇందిరమ్మ గృహ నిర్మాణానికి ముగ్గు పోసి భూమి పూజ చేసి ఇందిరమ్మ గృహ నిర్మాణ పనులను ప్రారంభించారు. అర్హులైన ఇల్లు లేని ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు విడతల వారీగా నిర్మించి అందిస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, లబ్ధిదారులు, తదితరులు, పాల్గొన్నారు.

# యువత లక్ష్య సాధనకు పట్టుదలతో కృషి చేయాలి

## దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం: అదనపు కలెక్టర్ (రెవిన్యూ) మధుమోహన్

## యూత్ వీక్ సెలబ్రేషన్స్ పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం

**గద్వాల బ్యూరో మే 23 ( నినాదం)**

యువత తమ లక్ష్య సాధనకు పట్టుదలతో కృషి చేయాలని, దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలని అదనపు కలెక్టర్ (రెవిన్యూ) మధుమోహన్ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల షెడ్యూల్లో భాగంగా నిర్వహిస్తున్న యూత్ వీక్ సెల బ్రేషన్స్ లో చివరి రోజు శనివారం ఐడిఓసి సమావేశపు మందిరంలో జరిగిన కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఏ దేశానికైనా యువతే గొప్ప సంపదని, దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలన్నారు. స్వామి వివేకానంద ఉక్కు నరాలు, వజ్ర సంకల్పం కలిగిన యువత దేశానికి అవసరమని పేర్కొన్నట్లు తెలిపారు. కొంతమంది యువత ఇటీవల డ్రగ్స్ వంటి వ్యసనాలకు బానిసలై తమ జీవితాన్ని అంధకారం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ రంగంలో రాణించాలన్న పట్టుదల అవసరమని, అంకితభావంతో కృషి చేయాలని సూచించారు. ఈ యూత్ వీక్ సెలబ్రేషన్స్ ద్వారా యువత స్ఫూర్తి పొంది తమ భవిష్యత్తును గొప్పగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా టూరిజం శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన గోడ పత్రికలను విడుదల చేశారు. అనంతరం యూత్ వీక్ లో భాగంగా నిర్వహించిన వివిధ క్రీడల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు అతిథులు బహుమతులను అందజేశారు. అలాగే ఫోటోగ్రఫీ పోటీల్లో విజేతలుగా నిలిచిన అయ్యప్ప, రాఘవేంద్ర, విక్రమ్ లకు వరుసగా రూ. 5000, రూ. 3000, రూ. 2000 నగదు బహుమతులను, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఇటీవల వివిధ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను, స్పోర్ట్స్ పాఠశాలకు ఎంపికైన చిన్నారులను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి డివైఎస్ఓ రామలింగేశ్వర గౌడ్, డిపిఆర్ఓ ఆరిఫుద్దీన్, పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడా సంఘాల ప్రతినిధులు, యువత, తదితరులు పాల్గొన్నారు.





## భారత్ ఫ్యూచర్ సిటీపై బీఆర్ఎస్ తీరును

# తీవ్రంగా ఖండించిన మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్,బ్యూరో మే 23(నినాదం ) :**



రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన కీలక ప్రాజెక్టులపై ప్రతిపక్షాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సూచించారు. సీఎల్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ, నిర్మాణాత్మక విమర్శలు స్వాగతించదగినవేనని, కానీ అభివృద్ధిని అడ్డుకునే విధంగా వినాశకర రాజకీయాలు చేయడం సరైంది కాదన్నారు. రాజకీయాలు తాత్కాలికమైతే, రాష్ట్ర ప్రయోజనాలు శాశ్వతమని స్పష్టం చేశారు.

బీఆర్ఎస్ నాయకులు ఇప్పటికీ ఎన్నికల ఓటమి నుంచి బయటకు రాలేకపోతున్నారని మంత్రి విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించారని, పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా ఇవ్వలేదని, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్‌ను ప్రజలు పూర్తిగా తిరస్కరించారని పేర్కొన్నారు. అయినప్పటికీ ఆ పార్టీ నేతలు "చీప్ పాలిటిక్స్", "డైవర్షన్ పాలిటిక్స్", "బ్లాక్‌మెయిలింగ్ పాలిటిక్స్" చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

### పెట్టుబడులపై ప్రతికూల ప్రభావం

అంతర్జాతీయ సంస్థలు వందల కోట్ల పెట్టుబడులతో రాష్ట్రానికి రావడానికి సిద్ధంగా ఉన్న సమయంలో, "మేమొస్తే ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తాం" అనే ప్రకటనలు చేయడం వల్ల పెట్టుబడిదారులు వెనక్కి తగ్గే ప్రమాదం ఉందన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ స్వార్థానికే బీఆర్ఎస్ ప్రాధాన్యం ఇస్తోందని విమర్శించారు.

ఒక ప్రభుత్వం మారినప్పుడల్లా పాత ప్రాజెక్టులను రద్దు చేస్తూ పోతే రాష్ట్ర అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. గతంలో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటర్ రింగ్ రోడ్ వంటి ప్రాజెక్టులపై కూడా అప్పటి ప్రతిపక్షాలు విమర్శలు చేశాయని గుర్తుచేశారు. అయితే ఆ ప్రాజెక్టులను తర్వాత వచ్చిన ప్రభుత్వాలు రద్దు చేయలేదని, వాటివల్లే హైదరాబాద్ చుట్టుపక్కల భారీ అభివృద్ధి జరిగిందన్నారు.

### హైటెక్ సిటీ నుంచి ఫ్యూచర్ సిటీ వరకు

1990లలో సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్కులు, హైటెక్ సిటీ వంటి ప్రాజెక్టులు ప్రారంభమైనప్పుడు కూడా విమర్శలు వచ్చాయని, కానీ తరువాతి ప్రభుత్వాలు వాటిని మరింత అభివృద్ధి చేశాయని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. అప్పట్లో వేసిన పునాదుల వల్లే హైదరాబాద్ నేడు గ్లోబల్ ఐటీ హబ్‌గా ఎదిగిందని అన్నారు.

ఇప్పటి AI యుగంలో యువతకు భవిష్యత్ ఉద్యోగ అవకాశాలు కల్పించాలంటే 'భారత్ ఫ్యూచర్ సిటీ' వంటి ప్రాజెక్టులు అవసరమని తెలిపారు. బెంగళూరు, చెన్నై వంటి నగరాలు వేగంగా ముందుకు వెళ్తున్న సమయంలో తెలంగాణ కూడా సమయానుగుణంగా మారాల్సిన అవసరం ఉందన్నారు.

### ఫార్మా సిటీపై స్పష్టత

ఫార్మా సిటీ ప్రాజెక్టును రద్దు చేయడం లేదని ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసిందని మంత్రి తెలిపారు. ఈ విషయాన్ని హైకోర్టుకు కూడా తెలియజేశామని చెప్పారు. ఫార్మా సిటీ కోసం సేకరించిన భూముల్లో 'లైఫ్ సైన్సెస్ పార్క్' ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఫార్మా పేరిట కాలుష్యాన్ని ప్రోత్సహించిందని ఆరోపించిన మంత్రి, తమ ప్రభుత్వం మాత్రం "గ్రీన్ ఫార్మా" విధానానికి కట్టుబడి ఉందన్నారు. కాలుష్యం లేని పరిశ్రమలను మాత్రమే ప్రోత్సహిస్తామని స్పష్టం చేశారు.

### 'భారత్ ఫ్యూచర్ సిటీ' తెలంగాణ భవిష్యత్తుకు దిక్సూచి

'భారత్ ఫ్యూచర్ సిటీ' కేవలం ఒక ప్రాంతానికి పరిమితమైన ప్రాజెక్ట్ కాదని, తెలంగాణ బ్రాండ్‌ను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే ప్రణాళిక అని శ్రీధర్ బాబు తెలిపారు. భవిష్యత్తులో ఇది తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు ఇంజిన్‌లా మారుతుందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టును రద్దు చేస్తామని బీఆర్ఎస్ నేత హరీష్ రావు చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. అలాంటి బాధ్యతారహిత ప్రకటనలు హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను, పెట్టుబడిదారుల నమ్మకాన్ని దెబ్బతీస్తాయని అన్నారు. తెలంగాణను గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దే ప్రయత్నాలను బీఆర్ఎస్ అడ్డుకోవాలని చూస్తోందని ఆరోపించారు.



## ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో

# యువతకు ఉపాధి బాట

## 31 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేసిన జిల్లా కలెక్టర్ ప్రియాంక

**నారాయణపేట ప్రతినిధి, మే 23, (నినాదం):**

ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా నారాయణపేట జిల్లాకు చెందిన 31 మంది యువతీ యువకులకు జిల్లా కలెక్టర్ ప్రియాంక ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. 99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా, యువజన & క్రీడా వారోత్సవాలను పురస్కరించుకొని 6వ రోజున జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 1వ తేదీన మహబూబ్ నగర్ వేదికగా జరిగిన మెగా జాబ్ మేళాలో వివిధ ప్రైవేట్ సంస్థలలో ఉద్యోగాలకు ఎంపికైన నారాయణపేట జిల్లా అభ్యర్థులకు జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆర్డర్ కాపీలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...యువతలోని ప్రతిభను గుర్తించి, వారికి తగిన ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా బంగారు భవిష్యత్తుకు బాటలు వేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం నిరంతరం కృషి చేస్తున్నాయని తెలిపారు. తగిన అర్హత, నైపుణ్యాలు కలిగిన స్థానిక యువతీ యువకులకు రాబోయే రోజుల్లో జిల్లా యంత్రాంగం సహాయం చేయడానికి సిద్ధంగా ఉంది అని పేర్కొన్నారు. జీవితంలో అనుకున్నది సాధించడానికి పట్టుదలతో కృషి చేయాలన్నారు. 20 ఏళ్ల తర్వాత మనం ఎలా ఉండాలని అనుకుంటామో అందుకోసం ఈ రోజు మనం ఏం చేయాలో తెలుసుకోవాలని సూచించారు. ఉద్యోగం చిన్నదా... పెద్దదా అని కాకుండా ఇష్టంతో పని చేయాలని అప్పుడే అనుకున్నది సాధ్యం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన & క్రీడల అధికారి వెంకటేశ్ శెట్టి డి.పి.ఆర్.ఓ.రషీద్, ఉద్యోగాలు సాధించిన యువత తదితరులు పాల్గొన్నారు.



# ధాన్యం నాణ్యత పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

## రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి..

## నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్





**నాగర్ కర్నూల్ మే 23 (నినాదం)**

శనివారం సాయంత్రం తాడూరు మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహ రైస్ మిల్లు, మేడిపూర్ గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ ఆకస్మికంగా సందర్శించి వరి ధాన్యం నిల్వ సామర్థ్యం, కొనుగోలు ప్రక్రియలను కలెక్టర్ పరిశీలించారు. రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎలా నిల్వ చేస్తున్నారో, గిడ్డంగుల సామర్థ్యం ఎంత ఉందో, ధాన్యం నాణ్యత పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలపై ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. మిల్లు సామర్థ్యం 8000 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం అందించడం జరుగుతుందని, ప్రతిరోజు సీఎంఆర్ రైస్ మూడు ఏసీకేలు ప్రభుత్వానికి అందించాల్సి ఉంటుందని సివిల్ సప్లై అధికారి కలెక్టర్కు వివరించారు . ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...., రైతులు పండించిన ప్రతి గింజకు సరైన విలువ దక్కేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. రైతులు తీసుకొచ్చే ధాన్యాన్ని ఆలస్యం లేకుండా కొనుగోలు చేసి, తేమ శాతం, నాణ్యత ప్రమాణాలను పరిశీలించి పారదర్శకంగా నమోదు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. రైతులు ధాన్యం అమ్మకానికి వచ్చినప్పుడు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా తాగునీరు, నీడ, కూర్చునే సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. రైస్ మిల్లులో నిల్వ ఉంచిన వరి ధాన్యం రాశులను పరిశీలించిన కలెక్టర్, ధాన్యం తడవకుండా మరియు నాణ్యత దెబ్బతినకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిల్వ గిడ్డంగుల పరిశుభ్రత, రక్షణ చర్యలు, రవాణా సౌకర్యాలపై కూడా సమీక్ష నిర్వహించారు. రైతుల నుండి వచ్చిన ధాన్యాన్ని వేగంగా మిల్లింగ్ ప్రక్రియకు పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని మిల్లర్లకు సూచించారు. రైతులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్ వారి సమస్యలను తెలుసుకుని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎటువంటి ఇబ్బందులు చోటుచేసుకోకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని, రైతులు కూడా నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని కోరారు. జిల్లా కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ రెవిన్యూ అమరేందర్, సివిల్ సప్లై అధికారి నరసింహారావు డీఎం సివిల్ సప్లై రాజేందర్, వ్యవసాయ శాఖ అధికారులు, పౌర సరఫరాల శాఖ సిబ్బంది, రైస్ మిల్ నిర్వాహకులు మరియు రైతులు ఉన్నారు.

## బాలశక్తి అవార్డులకు

# దరఖాస్తుల ఆహ్వానం

**గద్వాల బ్యూరో మే 23( నినాదం)**

మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రతి ఏటా అందజేసే ప్రధానమంత్రి రాష్ట్రీయ బాలశక్తి అవార్డులకు అర్హులైన 5 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాల లోపు బాల బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిడబ్ల్యూఓ సునంద శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ధైర్య సాహసాలు, సామాజిక సేవ, పర్యావరణ పరిరక్షణ, క్రీడలు, కళలు, సంస్కృతి, విజ్ఞాన శాస్త్రం, మరియు సాంకేతికత రంగాలలో విశేష ప్రతిభ కనబరిచిన చిన్నారులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హులైన బాలబాలికలు ఆన్లైన్ ద్వారా తేదీ : 31.8.2026 లోగా https://awards.gov.in వెబ్సైట్ లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు.

# పేదలకు ఆరోగ్య భరోసా.. 'సీఎంఆర్ఎఫ్'

## 150 మంది లబ్ధిదారులకు రూ.44 లక్షల చెక్కులు పంపిణీ చేసిన ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి.. ఆటో డ్రైవర్లకు ఖాకీ చొక్కాలు అందజేత

**ఖమ్మం ప్రతినిధి, మే 23(నినాదం)**

కార్పొరేట్, ప్రైవేట్ ఆసుపత్రులలో అత్యవసర వైద్య చికిత్సలు చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం కొండంత అండగా నిలుస్తోందని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి అన్నారు. శనివారం నగరంలోని గట్టయ్య సెంటర్ లో గల తన క్యాంప్ కార్యాలయంలో ఉభయ జిల్లాలైన ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం పరిధిలోని ఏడు నియోజకవర్గాలకు చెందిన 150 మంది లబ్ధిదారులకు తన సిఫారసుతో మంజూరైన రూ.44 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను ఆయన పంపిణీ చేశారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి మద్దినేని స్వర్ణకుమారి లతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు.





ఈ సందర్భంగా ఎంపీ రఘురాం రెడ్డి మాట్లాడుతూ.. పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తూ, లబ్ధిదారుల దరఖాస్తులను వేగవంతంగా పరిశీలించి సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరయ్యేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్క పేదవానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించి, అండగా నిలవడమే తన ప్రధాన లక్ష్యమని ఆయన వివరించారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులంతా ఈ సందర్భంగా ఎంపీ రఘురాం రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

### ఆటో డ్రైవర్లు, కార్మికులకు అండగా ఉంటాం...

అనంతరం వివిధ ఆటో అడ్డాలకు చెందిన వందమంది ఆటో డ్రైవర్లకు ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి ఖాకీ చొక్కాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో నిరంతరం శ్రమిస్తూ రవాణా రంగంలో కీలక పాత్ర పోషిస్తున్న ఆటో కార్మికులందరికీ తమ ప్రభుత్వం, తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని అభయమిచ్చారు.

ఈ కార్యక్రమాల్లో.. నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దీపక్ చౌదరి, కాంగ్రెస్ నాయకులు కొప్పుల చంద్రశేఖర్, టెలిఫోన్ అడ్వైజర్ కమిటీ సభ్యులు ఉమ్మినేని కృష్ణ, రంజిత్ నాయక్, సీనియర్ నాయకులు వడ్డెబోయిన నరసింహారావు, మాజీ ఎంపీపీ గోసు మధు, డీసీసీ సెక్రటరీ రాంపుడి రోశయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ గుమ్మా రోశయ్య, సేవాదళ్ జిల్లా అధ్యక్షులు ఎస్.కె. గౌస్, కాంగ్రెస్ నాయకులు ఇమ్మడి తిరుపతిరావు, స్ఫూర్తి ఓం రాధాకృష్ణ, చల్లా రామకృష్ణా రెడ్డి, కేకేసీ జిల్లా అధ్యక్షులు విప్లవ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు జంగిపల్లి ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు బాణాల లక్ష్మణ్, మల్లెల నాగేశ్వరరావు, కాటేపల్లి కిరణ్, ఉమర్, ఎండి. గౌస్, కాంపాటి వెంకన్న, మాజీద్, చెరుకుమల్లి రవి, దిరిశెల శ్రీనివాసరావు, ఒంటికొమ్ము శ్రీనివాసరెడ్డి, ఏలూరి శ్రీనివాసరావు, ఉభయ జిల్లాలకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# మార్కెట్ వాల్యూ అప్డేషన్ వేగవంతం చేయాలి

## జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

**గద్వాల బ్యూరో మే 23( నినాదం)**



జిల్లావ్యాప్తంగా ఉన్న రెవెన్యూ గ్రామాలలో మార్కెట్ వాల్యూ అప్డేషన్ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. హైదరాబాద్ నుండి చీఫ్ కమిషనర్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ లోకేష్ కుమార్ మరియు రెవెన్యూ శాఖ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు అన్ని జిల్లాల కలెక్టర్లతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మార్కెట్ వాల్యూ అప్డేషన్ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మార్కెట్ వాల్యూ అప్డేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా భూభారతి ఐజీఆర్ఎస్ పోర్టల్‌లో ఫామ్ 1, 2, 3, 4లకు సంబంధించిన అప్డేషన్ ప్రక్రియను వేగవంతంగా చేపట్టాలని సూచించారు. జీవో నెంబర్ 44 ప్రకారం జిల్లా స్థాయి నుండి మండల స్థాయి వరకు కమిటీలను ఏర్పాటు చేసి మార్కెట్ వాల్యూ సవరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. భూ లావాదేవీలు, రిజిస్ట్రేషన్ వ్యవస్థలో పారదర్శకత పెంపుతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఈ ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. గద్వాలలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆర్డీవో శ్రీనివాసరావుతో కలిసి వీసీలో పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి భూభారతి, ఐజీఆర్ఎస్ అప్డేషన్లను వేగవంతం చేయాలని పేర్కొన్నారు.

# శరవేగంగా కవర్ షెడ్డు నిర్మాణం పనులు

## 2 కోట్ల 45 లక్షలతో మార్కెట్ యార్డ్ లో షెడ్డు నిర్మాణం పనులు.

## పనుల తీరుపై పలువురు వ్యాపారులు హర్షం వ్యక్తం







**నారాయణపేట ప్రతినిధి, మే 23, (నినాదం):**

సీజన్ వచ్చిందంటే చాలు వ్యవసాయ మార్కెట్లో అవస్థలే కనిపించేవి అలాగే వర్షాకాలంలోనైతే రైతుల ధాన్యాలు తడిసి వరదల్లో కొట్టుకుపోతున్న సన్నివేశాలే కనిపించేవి అలాంటి వాటికి చెక్ పెట్టే దిశగా ప్రస్తుతం మార్కెట్ చైర్మన్ సదాశివరెడ్డి ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పనులు శరవేగంగా మొదలయ్యాయి. దశాబ్ద కాలం పై అవస్థలు పడుతున్న వ్యవసాయ మార్కెట్ రైతులకు అలాగే వ్యాపారస్తుల కు సముదాయాలకు ఉన్న అవంతరాలను తొలగించేందుకై శరవేగంగా గాల్ వాలింగ్ (కవర్ షెడ్డు) నిర్మాణాన్ని చేపట్టడంతో పలువురు రైతులు, వ్యాపారస్తులు చైర్మన్ పట్ల హర్షం వ్యక్తం చేశారు. మార్కెట్ చైర్మన్ సదాశివరెడ్డి మాట్లాడుతూ... ప్రస్తుతము 1 వ నెంబర్ షాప్ నుండి 18 వ నంబర్ షాపుల వరకు 100 మీటర్ల ప్లాట్ఫామ్ కోసం 2 కోట్ల 45 లక్షలతో గాల్ వాలింగ్ (కవర్ షెడ్డు) నిర్మాణం పనులు శరవేగంగా సాగుతున్నాయని, తెలిపారు. ఈ షెడ్డు యొక్క ముఖ్య ఉద్దేశం ప్రకృతి విపత్తు నుండి రైతులు తీసుకువచ్చే సరుకులు వర్షానికి తడిసి కొట్టుకుపోకుండా ఉండేందు కోసమేనని అన్నారు. గత కొన్ని ఏళ్లు గా ఈ ఇబ్బందులను ఎదుర్కొంటున్న విధానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి హయాంలో గుర్తించడం జరిగిందని రైతు పక్షపాతిగా ఉన్న ఇట్టి ప్రభుత్వం రైతులకు ఎలాంటి ఇబ్బందులు నష్టాలు కలగకూడదనే ఉద్దేశంతో వ్యవసాయ మార్కెట్లో ఇట్టి నిర్మాణాలను చేపట్టడం జరుగుతుందని చైర్మన్ తెలిపారు. అలాగే దశాబ్దాలుగా కమిషన్ ఏజెంట్ దుకాణ సముదాయాలు వర్షానికి కురుస్తూ శిథిలావస్థకు చేరడంతో వాటికి కూడా ఇట్టి ప్రభుత్వం రిపేర్లు చేసేందుకై నిధులను కేటాయించడంతో యుద్ధప్రాతిపాదికన పైకప్పులపై స్లాబుల రిపేరు తో పాటు దుకాణాల వెనక భాగంలో కూలడానికి సిద్ధంగా ఉన్న గోడలను సైతం తొలగించి వాటిని పునర్నిర్మించామని చైర్మన్ సదాశివరెడ్డి తెలిపారు. ఇట్టి షెడ్డు నిర్మాణ సమయంలో బేస్మెంట్ లెవెల్ ఎక్కువ ఎత్తుకు వచ్చే అవకాశం ఉన్నందున కమిషన్ దారు దుకాణాలు సగం వరకు మూసుకుపోతాయనని కొద్దిగా ఎత్తు తగ్గించి కడితే బాగుంటుందని ఒకటో నంబర్ దుకాణ యజమాని కన్న జగదీష్ తెలిపారు. పల్లానికి వర్షపు నీరు రాకుండా చర్యలు తీసుకోవడంతో అటు రైతులు ఇటు దుకాణ యజమానులు హర్షం వ్యక్తం చేశారు.



# ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి

## అదనపు కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశం

**వనపర్తి ప్రతినిధి, మే 23 (నినాదం)**

ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, వర్ష సూచన నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ (రెవిన్యూ) టి.వినోద్ కుమార్ అధికారులకు ఆదేశించారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఎలాంటి ఆటంకాలు లేకుండా అత్యంత వేగంగా పూర్తి చేయాలని కోరారు. శనివారం ఆయన వీపనగండ్ల మండల పరిధిలోని కల్వరాల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, అలాగే వీపనగండ్ల గోదామును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో ధాన్యం నిల్వలను, తూకం ప్రక్రియను పరిశీలించి అధికారులకు, రవాణా కాంట్రాక్టర్లకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.:ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వర్షం పడే అవకాశం ఉన్నందున కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం తడవకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. టార్పా లిన్లు అందుబాటులో ఉంచి, ధాన్యం రాశులపై కప్పి ఉంచాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు గోదాములకు తరలించేందుకు తగినన్ని లారీలను, వాహనాలను వెంటనే ఏర్పాటు చేయాలని వాహన కాంట్రాక్టర్లను గట్టిగా ఆదేశించారు. రవాణాలో ఎలాంటి ఆలస్యాన్ని సహించేది లేదన్నారు. వీపనగండ్ల గోదామును పరిశీలించిన ఆయన, వాహనాల అన్‌లోడింగ్ ప్రక్రియ సజావుగా సాగడానికి తహసీల్దార్ ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. గోదాముకు వచ్చే వాహనాలకు క్రమ పద్ధతిలో టోకెన్లు జారీ చేసి, టోకెన్ నంబర్ల ప్రకారమే అన్‌లోడింగ్ జరిగేలా చూడాలని ఆదేశించారు. గోదాముల్లో ధాన్యపు బస్తాల అన్‌లోడింగ్, స్టాకింగ్ పనుల కోసం అవసరమైన సంఖ్యలో హమాలీలను (కార్మికులను) అవసరమైన ఇతర పరికరాలను సిద్ధంగా ఉంచుకోవాలని గోదాము నిర్వాహకులకు స్పష్టం చేశారు.ఈ తనిఖీ కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు

# పుష్కర స్నానం... ఆధ్యాత్మిక దర్శనం



## అంత్య పుష్కరస్నానాలకు తరలివస్తున్న భక్తజనం

### మూడో రోజు పెరిగిన భక్తుల సంఖ్య

### ఆదివారం మరింత పెరిగే అవకాశం

### భక్తుల సౌకర్యాలు, ఏర్పాట్లపై కలెక్టర్, ఎస్పీ నిత్య పర్యవేక్షణ



**భూపాలపల్లి ప్రతినిధి/ మహాదేవపూర్, మే 23(నినాదం):** సరస్వతీనది అంత్య పుష్కరాలకు భక్తుల తాకిడి క్రమంగా పెరుగుతుంది. శనివారం మూడో రోజు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు కాళేశ్వరానికి తరలివచ్చారు. గోదావరి, ప్రాణహిత, అంతర్వాహిని సరస్వతీ నదిలో పుణ్యస్నానాలు ఆచరించి, నదీమాతకు పూజలు చేశారు. పిండ ప్రధాన పూజలు చేసి పితృదేవతలకు తర్పనాలు నిర్వహించారు. నదీమాతకు చీరె, సారెను సమర్పించారు. ముత్తయిదువ మహిళలు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. భక్తులతో పుష్కరిని నిండుగా దర్శనమిచ్చింది. దీపాలు వదిలి మొక్కులు చెల్లించారు. ఇసుకలో సైకత లింగాలు చేసి పూజించారు. పార్కింగ్ స్థలాలు, బస్టాండ్ నుంచి కొంత మంది ఆటోలు, కాలినడకన పుష్కర ఘాట్ల వద్దకు తరలివచ్చారు.



**క్రమంగా పెరుగుతున్న రద్దీ...**
సరస్వతి నది అంత్య పుష్కరాలకు భక్తుల సంఖ్య క్రమంగా పెరుగుతుంది. పుష్కరాల మొదటి, రెండో రోజు కంటే మూడో రోజు కాళేశ్వరంలో భక్తుల సందడి నెలకొంది. ఆదివారం సెలవు రోజు కావడంతో శనివారం భక్తులు అధిక సంఖ్యలో చేరుకున్నారు. ఆదివారం భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. హైదరాబాద్, వరంగల్, భూపాల పల్లి మీదుగా, మంథని, కాటారం మీదుగా భారీగా వాహనాలు తర లివచ్చాయి. మంచిర్యాల, గోదావ రిఖని, చెన్నూర్, ఆసీఫాబాద్, నిర్మల్ నుంచి తరలివచ్చారు. ట్రాఫిక్ జామ్ కాకుండా పోలీసు లు డివైడర్లు ఏర్పాటు చేసి నియం త్రించారు.

**ప్రత్యేక ఆకర్షణగా నదీహారతి...**
సరస్వతి నది అంత్య పుష్కరాల్లో భాగంగా సరస్వతీఘాట్లో కాశీపండితు లచే ఏర్పాటు చేసిన నవరత్న మాలిక హారతి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. నది హారతికి రోజు రోజుకి భక్తుల తాకిడి పెరుగుతుంది. ఏడు గద్దెలపై తొమ్మిది హారతులను ప్రత్యేకం గా ఏర్పాటు చేసిన విద్యుత్ వెలుగుల్లో హారతి ఇస్తున్నారు. రోజురోజుకు పరిసర ప్రాంతాల భక్తులు వీక్షించడానికి తరలి వస్తున్నారు. సరస్వతీ అమ్మవారి విగ్రహం వద్ద భక్తులు దర్శించు కున్నారు. జ్ఞానతీర్థం వద్ద ఫొటో లు, సెల్ఫీలు దిగారు. సాయం త్రం 8గంటల వరకు భక్తులు తాకిడి ఉంది.



**కలెక్టర్, ఎస్పీ నిత్య పర్యవేక్షణ...**
పుష్కరాల ఏర్పాట్లు, భక్తుల సౌకర్యాలు, రాకపోకలు, భద్రత తదితర అంశాల పై జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ నిత్య పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. అధికారులు, సిబ్బందిని సమన్వయ పరుస్తూ పుష్కరాల్లో ఎలాంటి ఇబ్బందులు, లోటుపాట్లు లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నారు. పారిశుద్ధం, త్రాగునీటి సరఫరా పై ప్రత్యేక దృష్టి సారించి సక్రమంగా సాగేలా కృషి చేస్తున్నారు.



# ఎండ దెబ్బకు ఇదొక్కటే విరుగుడు..!

**ఆరోగ్య నిపుణుల ప్రకారం.. వేసవి కాలంలో ఉల్లిపాయను వండుకుని తినడం కంటే పచ్చిగా సలాడ్ రూపంలో తీసుకోవడం వల్ల శరీరానికి గరిష్ట స్థాయిలో పోషకాలు అందుతాయి. ముఖ్యంగా లంచ్ సమయంలో పచ్చి ఉల్లిపాయ ముక్కలపై కొద్దిగా నిమ్మరసం, ఉప్పు చల్లుకుని తింటే ఎన్నో లాభాలు ఉంటాయి. కేవలం సాంప్రదాయ నమ్మకం మాత్రమే కాదు.. ఎండకాలంలో పచ్చి ఉల్లిపాయ తినడం వెనుక ఎన్నో సైంటిఫిక్ రీజన్స్, హెల్త్ బెనిఫిట్స్ ఉన్నాయి. మరి ఆ అద్భుతమైన ప్రయోజనాలు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం.**








**వేసవిలో పచ్చి ఉల్లిపాయ తినడం వల్ల కలిగే 5 అద్భుత ప్రయోజనాలు:**

**1. ఎండదెబ్బ నుంచి రక్షణ:**
సమ్మర్లో వచ్చే అతిపెద్ద ప్రమాదం ఎండదెబ్బ తగలడం. ఉల్లిపాయలో ఉండే సహజసిద్ధమైన రసాయనాలు బాడీ టెంపరేచర్ను (శరీర ఉష్ణోగ్రతను) సమతుల్యంగా ఉంచడంలో సహాయపడతాయి. ఇది లూ అని పిలవబడే వేడి గాలుల ప్రభావాన్ని తగ్గించి, ఎండదెబ్బ తగలకుండా శరీరాన్ని కాపాడుతుంది.

**2. శరీరాన్ని చల్లబరుస్తుంది**
ఉల్లిపాయకు శరీరాన్ని సహజంగా చల్లబరిచే గుణం ఉంది. ఇందులో నీటి శాతం ఎక్కువగా ఉండటంతో పాటు బాడీని హైడ్రేట్గా ఉంచే పోషకాలు ఉంటాయి. ఎండ తీవ్రత వల్ల శరీరంలో వచ్చే వేడిని తొలగించడానికి పచ్చి ఉల్లిపాయ ఎంతగానో తోడ్పడుతుంది.

**3. జీర్ణక్రియ మెరుగవుతుంది**
ఎండకాలంలో జీర్ణవ్యవస్థ కాస్త మందగిస్తుంది. దీనివల్ల గ్యాస్, ఎసిడిటీ, అజీర్తి వంటి సమస్యలు వస్తుంటాయి. పచ్చి ఉల్లిపాయలో 'సాల్యుబుల్ ఫైబర్' పుష్కలంగా ఉంటుంది. ఇది పొట్టలోని మంచి బ్యాక్టీరియాను పెంచి, జీర్ణక్రియను సజావుగా సాగేలా చేస్తుంది.

**4. రోగనిరోధక శక్తి పెరుగుతుంది**
ఉల్లిపాయలో విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు మెండుగా ఉంటాయి. ఇవి వేసవిలో వచ్చే వివిధ రకాల వైరల్ ఇన్ఫెక్షన్లు, సీజనల్ వ్యాధుల బారిన పడకుండా మన రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తాయి.

**5. గుండె ఆరోగ్యానికి ,బ్లడ్ షుగర్ కంట్రోల్కు:**
ఉల్లిపాయలో ఉండే 'క్వెర్సిటిన్' అనే ఫ్లేవనాయిడ్ రక్తపోటును నియంత్రించడంలో మరియు శరీరంలో చెడు కొలెస్ట్రాల్ను తగ్గించడంలో సహాయపడుతుంది. అలాగే ఇది ఇన్సులిన్ ఉత్పత్తిని పెంచి, రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచడానికి కూడా తోడ్పడుతుంది.

## ఏఐకి సిద్ధం కాకపోవడం అంటే..

# మహమ్మారిని విస్మరించినట్లే



### ఆంథ్రోపిక్ కో-ఫౌండర్

శరవేగంగా విస్తరిస్తోన్న కృత్రిమ మేధ విషయంలో అప్రమత్తంగా లేకపోతే.. భవిష్యత్తులో తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని అమెరికన్ కంపెనీ ఆంథ్రోపిక్ సహ వ్యవస్థాపకుడు జాక్ క్లార్క్ హెచ్చరించారు. ఏఐ పురోగతిని ఇంకా చాలామంది అర్థం చేసుకోలేకపోత న్నారన్నారు. ఏఐకి సిద్ధం కాకపోవడం అంటే.. కొవిడ్-19 వంటి మహమ్మారిని ఎదుర్కోవడానికి సన్నద్ధంగా లేకపోవడం వంటిదే అవుతుందని చెప్పారు. మనుషులను మించిన సామర్థ్యం ఉండే ఈ సాంకేతికత నుంచి ముప్పు ఎదుర్కోక తప్పదని హెచ్చరికలు చేశారు. ఆక్స్ఫర్డ్ యూనివర్సిటీలో ఆయన ఇచ్చిన ఉపన్యాసం తాజాగా వైరల్ అవుతోంది.
"మానవ మనుగడకు దీనితో ఉన్న ముప్పు తొలగిపోలేదు. మనం చూస్తూ ఉండిపోయి, కృత్రిమ మేధ తన సామర్థ్యాలను పెంచుకోవడానికి మనం అనుమతిస్తూ ఉంటే.. చివరకు మనం ప్రతిస్పందించాల్సిన పరిస్థితి వస్తుంది. ఈ సాంకేతిక అభివృద్ధిని కాస్త నెమ్మదింపజేయగలితేనే.. మానవాళికి మంచిది. అయితే ఈ టెక్నాలజీ విషయంలో ఒకరిమీద మరొకరు/ఒక దేశంపై మరో దేశం పైచేయి సాధించేందుకు తీవ్రంగా పోటీ పడుతున్నందున ఆ ఆలోచన అసాధ్యమే అవుతోంది" అని క్లార్క్ విద్యార్థులతో మాట్లాడారు.

**ఏఐ టూల్ చేయించుకొని.. ఆపై లేఆఫ్ వేసి..!**
అంతకుముందు ఆంథ్రోపిక్ సీఈఓ డారియో అమోడెయ్ ఇదేవిధంగా స్పందించారు. 'ది అడాల్సెన్స్ ఆఫ్ టెక్నాలజీ' పేరుతో రాసిన సుదీర్ఘ వ్యాసంలో ఏఐ భవిష్యత్తు, పొంచి ఉన్న ముప్పు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డారియో సమగ్ర విశ్లేషణ చేశారు. మనం ఇప్పుడు అత్యంత శక్తిమంతమైన సాంకేతికతను చేజిక్కించుకునే దశలో ఉన్నామని, ఇది మానవజాతికి ఒక అగ్నిపరీక్ష వంటిదని, మన సామాజిక, రాజకీయ వ్యవస్థలకు ఈ శక్తిని నిర్వహించే పరిపక్వత ఉందో, లేదో తెలియని సందిగ్ధత నెలకొందని ఆయన వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.

## బంపర్ ఆఫర్.. కేవలం రూ.51కే 28 రోజుల వ్యాలిడిటీ




భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ అయినప్పటికి ప్రైవేట్ టెలికాం కంపెనీలకు గట్టి పోటీనిస్తుంది. ఈ క్రమంలో తమ మొబైల్ వినియోగదారుల కోసం ఒక అద్భుతమైన ధమాకా ఆఫర్ను ప్రకటించింది. దేశవ్యాప్తంగా సరికొత్త కస్టమర్లను ఆకర్షించడమే లక్ష్యంగా 'ఫ్రీడమ్ ఆఫర్' రిట కేవలం రూ.51 కే అత్యంత చౌకైన రీఛార్జ్ ప్లాన్ను మార్కెట్లోకి అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ ఆఫర్ కింద కొత్త కనెక్షన్ తీసుకునే వినియోగదారులకు ఎటువంటి అదనపు రుసుము లేకుండా సిమ్ కార్డ్ పూర్తిగా ఉచితంగా అందించబడుతుంది. సాధారణంగా ప్రైవేట్ కంపెనీలు వందల రూపాయలు వసూలు చేసే 28 రోజుల సుదీర్ఘ వ్యాలిడిటీని బీఎస్ఎన్ఎల్ కేవలం రూ.51 ప్లాన్తోనే ఆఫర్ చేస్తుండటం గమనార్హం.

ఈ ప్లాన్ ద్వారా వినియోగదారులకు 28 రోజుల పాటు ప్రతిరోజూ 2+దీ హై-స్పీడ్ డేటా, రోజూ 100 ఎస్ఎమ్ఎస్ (ాపీూ)లతో పాటు దేశంలోని ఏ నెట్వర్క్కైనా ఉచితంగా మాట్లాడుకునేలా అన్లిమిటెడ్ వాయిస్ కాలింగ్ సదుపాయం లభిస్తుంది. అయితే, ఈ బంపర్ ఆఫర్ పరిమిత కాలం పాటు మాత్రమే అందుబాటులో ఉంటుందని బీఎస్ఎన్ఎల్ స్పష్టం చేసింది. ఆసక్తి గల వినియోగదారులు జూన్ 30 లోపు మాత్రమే ఈ ఆఫర్ను క్లెయిమ్ చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. కొత్త కనెక్షన్ పొందాలనుకునే వారు తమ సమీపంలోని బీఎస్ఎన్ఎల్ కస్టమర్ సర్వీస్ సెంటర్లు లేదా అధీకృత రిటైల్ స్టోర్లను సందర్శించి ఈ లబ్ధిని పొందవచ్చని సంస్థ అధికారులు వెల్లడించారు

# బిట్కాయిన్ షాక్!

## $75,000 కిందకు పడిపోయిన క్రిప్టో కింగ్..

క్రిప్టోకరెన్సీ మార్కెట్లో అత్యంత కీలకమైన మైలురాయిగా భావించే $75,000 సైకలాజికల్ సపోర్ట్ స్థాయిని బిట్కాయిన్ వాళ బ్రేక్ చేసింది. అంతర్జాతీయ క్రిప్టో మార్కెట్ మానిటరింగ్ సంస్థ ట్రేడింగ్ వ్యూ లైవ్ చార్ట్ ఆధారాల ప్రకారం.. బిట్కాయిన్ ప్రస్తుతం $74,678 వద్ద ట్రేడవుతోంది. ఇటీవలి కాలంలో సాధించిన గరిష్ఠ స్థాయిల నుంచి ఇది ఒక గమనించదగ్గ పతనంగా నిపుణులు విశ్లేషిస్తున్నారు.

స్థిరత్వం నుంచి ఒక్కసారిగా క్రాష్!

గత రెండు రోజులుగా బిట్కాయిన్ $77,000 నుంచి $78,000 రేంజ్లో గట్టి పట్టు సాధించడానికి ప్రయత్నించింది. మార్కెట్లో కొనుగోళ్ల మద్దతు గట్టిగానే కనిపించింది. అయితే, ఇవాళ (మే 23) భారీ పతనం చవిచూసింది. ఈ మధ్యాహ్నం తర్వాత మార్కెట్ సెంటిమెంట్ ఒక్కసారిగా మారిపోయింది. $76,500 స్థాయిల వద్ద ఉన్న సపోర్ట్ను బ్రేక్ చేస్తూ ధర నేరుగా $74,250 వరకు పడిపోయింది. ప్రస్తుతం అక్కడ నుంచి స్వల్పంగా కోలుకుని $74,678 వద్ద కొనసాగుతోంది.



పతనానికి తక్షణ కారణాలు

గ్లోబల్ ఫైనాన్షియల్ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చితి మధ్య బిట్కాయిన్ ఒడుదొడుకులను ఎదుర్కొంటోంది. ఈ తాజా పతనానికి ప్రధానంగా మూడు కారణాలు కనిపిస్తున్నాయి. అంతర్జాతీయంగా నెలకొన్న ఆర్థిక పరిణామాలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు. పెద్ద పెద్ద సంస్థలు, ఇన్వెస్టర్లు తమ పెట్టుబడుల వ్యూహాలను మార్చుకోవడం. ఇటీవలి కాలంలో బిట్కాయిన్ దిగువ స్థాయిల నుంచి భారీగా పుంజుకోవడంతో, ట్రేడర్లు ఈ స్థాయిలో లాభాల స్వీకరణకు మొగ్గు చూపడం వంటి కారణాలను చెప్పుకొస్తున్నారు.

# గోల్డ్ రేట్స్.. రెండో రోజూ పతనం



భారత్లో నేడు కూడా బంగారం ధరలు తిరోగమనంలో పయనిస్తున్నాయి. ధరలు తగ్గడం వరుసగా ఇది రెండోసారి. వెండి ధరలు మాత్రం స్థిరంగా కొనసాగుతున్నాయి. గుడ్ రిటర్న్స్ వెబ్సైట్ ప్రకారం, నేటి (మే 23) ఉదయం 10.30 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర క్రితం ముగింపుతో పోలిస్తే రూ.430ల మేర తగ్గి రూ.1,59,060కు దిగొచ్చింది. 22 క్యారెట్ల పసిడి కూడా నిన్నటితో పోలిస్తే రూ.400ల మేర తగ్గి రూ.1,45,800కు చేరుకుంది. నగరంలో వెండి ధర మత్రం రూ.2.95 లక్షల వద్ద స్థిరంగా కొనసాగుతోంది.

దేశవ్యాప్తంగా కూడా బంగారం ధరలు స్వల్ప స్థాయిలో తగ్గాయి. చెన్నైలో ప్రస్తుతం 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,60,690కు చేరుకుంది. 22 క్యారెట్ల ఆర్నమెంటల్ పసిడి ధర రూ.1,47,300గా ఉంది. ముంబైలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,59,060గా, 22 క్యారెట్ల పసిడి ధర రూ.1,45,800గా ఉంది. రాజధాని న్యూఢిల్లీలో మేలిమి బంగారం ధర రూ.1,59,210 వద్ద, 22 క్యారెట్ల పసిడి ధర రూ.1,45,950 వద్ద కొనసాగుతోంది.



## నినాదం మార్కెట్

### ఇంధన సరఫరాలో అంతరాయం లేదు: ఐఓసీ



దేశవ్యాప్తంగా ఇంధన సరఫరాలో ఎలాంటి కొరత లేదని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ స్పష్టం చేసింది. కొన్ని ప్రాంతాల్లోని బంకుల్లో పెట్రోల్, డీజిల్కు అధిక డిమాండ్ కారణంగా స్థానికంగా ఆయా బంకుల్లో ఇంధన సరఫరాకు అంతరాయం ఏర్పడిందని, ఇది తాత్కలికమేనని ఐఓసీ తెలిపింది. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. "ప్రస్తుతం పంట కోతల సమయం కావడంతో డీజిల్కు అధిక డిమాండ్ ఏర్పడింది. అదే సమయంలో ప్రైవేట్ బంకుల్లో ఇంధనం అధిక ధర పలుకుతుండటంతో వినియోగదారులు ప్రభుత్వ బంకులకు తరలివెళ్తున్నారు. అంతర్జాతీయ చమురు ధరల కారణంగా బల్క్లో పెట్రోల్, డీజిల్ను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న 42,000 ఇంధన స్టేషన్లలో కొన్ని బంకుల్లో మాత్రమే ఈ సమస్య వచ్చింది. ఇది తాత్కలికమే. ఇంధనానికి అధిక డిమాండ్ ఉన్నప్పటికీ సరఫరాలో ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా నిరంతరం తగిన చర్యలను తీసుకొంటూ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నాం. వినియోగదారులు ఎలాంటి ఆందోళనలకు గురికావొద్దు" అని ఐఓసీ ఓ ప్రకటనలో పేర్కొంది.

### మార్కెట్లోకి రోర్ ఈవో బైకు



హైదరాబాద్, :దేశీయ ఎలక్ట్రిక్ మోటర్సైకిళ్ల తయారీ సంస్థ ఒబెన్ ఎలక్ట్రిక్ మరో బైకును రాష్ట్ర మార్కెట్లోకి విడుదల చేసింది. రోర్ ఈవో పేరుతో విడుదల చేసిన ఈ మోటర్సైకిల్ ప్రారంభ ధర రూ.99,999గా నిర్ణయించింది. ఈ ధర కేవలం తొలి 10 వేల బుకింగ్లకు మాత్రమే వర్తించనున్నదని, ఆ తర్వాత ఈ బైకు ధర రూ.1,24,999కి పెంచుతున్నట్టు వెల్లడించింది. 3.4 కిలోవాట్ల ఎల్ఎఫ్పీ బ్యాటరీతో తయారైన ఈ బైకు సింగిల్ చార్జింగ్తో 180 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. కేవలం మూడు సెకండ్లలో 40 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ బైకు గంటకు 110 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోనున్నది. కేవలం 90 నిమిషాల్లో 80 శాతం వరకు చార్జింగ్ కానున్న బ్యాటరీపై ఎనిమిదేండ్ల వ్యారెంటీని కల్పిస్తున్నది. ఈ సందర్భంగా కంపెనీ వైస్ ప్రెసిడెంట్(సేల్స్ అండ్ మార్కెటింగ్) హర్షవర్ధన్ దేశ్ముఖ్ మాట్లాడుతూ..ప్రస్తుతం తెలంగాణలో ఐదు షోరూంలు ఉండగా, ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి వీటి సంఖ్య ను 25కి పెంచుకోనున్నట్టు చెప్పారు. కంపెనీ మొత్తం విక్రయాల్లో హైదరాబాద్ వాటా 10 శాతంగా ఉన్నదన్నారు.

## పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



**పటాన్చెరు, మే23(నినాదం):** పటాన్చెరు నియోజకవర్గం అమీన్పూర్ డివిజన్, బీరంగూడ డివిజన్ల పరిధిలోని వివిధ కాలనీలు, విలీన గ్రామాలలో 3 కోట్ల 66 లక్షల రూపాయలతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన పటాన్చెరు సభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి. శర వేగంగా అభివృద్ధి చెందుతున్న బీరంగూడ, అమీన్పూర్ డివిజన్ల పరిధిలోని ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని ఆయన తెలిపారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకుల ద్వారా ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. హాజరైన మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ సత్యనారాయణ, మాజీ ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## హిందూ సమ్మేళనాన్ని విజయవంతం చేద్దాం

### దేశాన్ని విశ్వ గురువుగా నిలపండి



**జవహర్ నగర్, మే 23 (నినాదం):** హిందూ సమ్మేళనం సమాజంలో గౌరవాన్ని పెంచుతుందని దేశాన్ని విశ్వ గురువుగా నిలిపేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఉద్యమకారుల పోరం జవహర్ నగర్ అధ్యక్షుడు సుధాకర్ చారి శనివారం ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. హిందూ సమ్మేళన సమితి బజరంగ్దళ్ బస్తీ ఆధ్వర్యంలో ఆదివారంసాయంత్రం జవహర్ నగర్ జ్యోతి కాలనీలో నిర్వహించే కార్యక్రమానికి హిందువులందరూ హాజరుకావాలని తెలిపారు. గడప లోపల కులం... గడప దాటితే హిందువులం... ప్రియ బంధువుమని కాలమాన పరిస్థితుల్లో ఎదురవుతున్న సవాలను ఎదుర్కొనేందుకు హిందువులు ఐకమత్యంతో ఉండాలన్నారు.

## మద్యం రహిత గ్రామమే లక్ష్యం

### కొమురవెల్లిలో బెల్ట్ షాపుల నిషేధానికి ఏకగ్రీవ తీర్మానం



**కొమురవెల్లి మే 23 (నినాదం):** కొమురవెల్లి మండల కేంద్రంలో మద్యం మహమ్మారిని అరికట్టడమే లక్ష్యంగా కొమురవెల్లి గ్రామ పంచాయతీ ఒక కీలకమైన, ఆదర్శవంతమైన నిర్ణయాన్ని తీసుకుంది. శనివారం రోజున గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ గొల్లపల్లి పద్మ అధ్యక్షతన పాలకవర్గం అత్యవసర బాడీ మీటింగ్‌ను నిర్వహించింది. ఈ సమావేశంలో గ్రామంలో అక్రమంగా నడుస్తున్న బెల్ట్ షాపుల వల్ల స్థానిక మహిళలు, యువత, పేద కుటుంబాలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై సుదీర్ఘంగా చర్చించారు. గ్రామాన్ని మద్యం రహితంగా, ప్రశాంతంగా ఉంచేందుకు వీలుగా కొమురవెల్లి పరిధిలో ఉన్న అన్ని రకాల బెల్ట్ షాపులను పూర్తిగా నిషేధించాలని పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానించి ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా సర్పంచ్ గొల్లపల్లి పద్మ, ఉప సర్పంచ్ పోతుగంటి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి సి.హెచ్. కరుణాకర్ మాట్లాడుతూ.. గ్రామ ప్రజల సంక్షేమం, శాంతిభద్రతల దృష్ట్యా ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ నిబంధనలను ఉల్లంఘించి ఎవరైనా అక్రమంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు. బెల్ట్ షాపుల నిషేధానికి పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానం చేయడం పట్ల స్థానిక మహిళలు, గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### సెంట్రింగ్ కాంట్రాక్టర్ల సమస్యలు పరిష్కారమయ్యే వరకు

# బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు

### బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్

**కుత్బుల్లాపూర్, మే 23 (నినాదం) :** నగరంలోని ఇందిరాపార్క్ వద్ద గల ధర్నా చౌక్ వద్ద "గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యుల" ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన "సెంట్రింగ్ పని బంద్" ధర్నా కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ హాజరై ధర్నాకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐకమత్యమే మహాబలమని, సెంట్రింగ్ కార్మికులంతా ఒకతాటిపై ఉండి సమస్యల పరిష్కారానికి పోరాడినప్పుడే వారి న్యాయమైన డిమాండ్లు పరిష్కారమవుతాయన్నారు. భవన నిర్మాణ సెంట్రింగ్ కార్మికులకు కార్మిక శాఖ నుంచి శాశ్వత గుర్తింపు కార్డుతో పాటు 55 సంవత్సరాలు నిండిన ప్రతీ కార్మికుడికి 3000 రూపాయల పెన్షన్ సదుపాయాన్ని కల్పించాలి. భవన నిర్మాణ సెంట్రింగ్ కార్మికుడికి ఈఎస్ఐ ఆసుపత్రిలో వైద్య సదుపాయం కల్పించాలి, నిర్మాణ సమయంలో ప్రమాదవశాత్తు మరణించిన భవన నిర్మాణ సెంట్రింగ్ కార్మికులకు కార్మిక శాఖ నుంచి ప్రభుత్వమే నష్టపరిహారాన్ని 20 లక్షలకు పెంచాలని కోరారు. సంక్షేమ బోర్డుతో సంబంధం లేకుండా సెంట్రింగ్ కార్మికుడు ప్రమాదాల బారిన పడితే పోలీస్ స్టేషన్లో నమోదైన ఎఫైర్ ప్రామాణికంగా చేసుకొని నష్టపరిహారం చెల్లించాలని, సెంట్రింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి కృషి చేస్తామని, సెంట్రింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించేంత వరకు బిఆర్ఎస్ పార్టీ వారికీ మద్దతుగా




నిలిచి సెంట్రింగ్ కార్మికుల సమస్యల పై పోరాడేందుకు టిఆర్ఎస్ పార్టీ వారికి మద్దతుగా ఉంటుందని భరోసా ఇచ్చారు. భవన నిర్మాణ ప్రాంతాలలో తరచూ సెంట్రింగ్ మెటీరియల్ దొంగతనానికి గురవుతుంది, అట్టి మెటీరియల్ను దొంగిలించిన వారిపై చట్టరీత్యా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. సెంట్రింగ్ మెటీరియల్ ను దొంగతనంగా కొనుగోలు చేసే స్క్రాప్ దుకాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలి, రైల్వే మెటీరియల్ మాదిరిగానే సెంట్రింగ్ మెటీరియల్ కు ప్రత్యేక గుర్తింపునిస్తూ దొంగతనాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. సెంట్రింగ్ పద్ధతిలో ఉన్న వారికి ప్రతి అమావాస్యకు చట్టబద్ధంగా సెలవుదినంగా ప్రకటించి కార్మిక, పోలీస్ శాఖల సహకారం అందేలా చూడాలని ఎమ్మెల్యే వివరించారు. ఈ



కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పి.కృష్ణ, చైర్మన్ ఎస్ పరశురాం రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎండి. చాంద్ పాషా, జై దుర్గ భవాని సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కుంట వేణుగోపాల్, షాపూర్ నగర్ జోన్ అధ్యక్షులు మక్బుల్, దుండిగల్ జోన్ అధ్యక్షులు సదానందం, ఉపాధ్యక్షులు సిహెచ్. సత్తిబాబు, కుంటి వీరేష్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ రెడ్డి, కోశాధికారి ఎం.వీరేష్, శివశంకర్, శ్రీనివాస్, వివిధ వివిధ సంఘాల కార్యవర్గ సభ్యులు బి.యాదగిరి, పి.వీరేష్, వి.రాకేష్, ఈశ్వర్, కృష్ణ, మహంకాళి రావు, సత్యనారాయణ, ముని, సంజీవులు వెంకటేశ్వరరావు, ఇంద్రసేనారెడ్డి, నరసింహారెడ్డి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## మినీ స్టేడియం, పార్కులు ఏర్పాటు చేయాలి

### మెట్టు శ్రీధర్

**పటాన్చెరు, మే23(నినాదం):** ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ప్రజా ప్రయోజనాల కొరకు మినీ స్టేడియం, పార్కులను ఏర్పాటు చేయాలని, నానాటికీ పెరిగిపోతున్న ప్రభుత్వ రోడ్ల ఆక్రమణలను అడ్డుకోవాలని, అలాగే తీవ్ర గందరగోళంగా మారిన కొత్త ఇండ్ల నంబర్ల సమస్యను తక్షణమే పరిష్కరించాలని నవభారత్ నిర్మాణ్ యువసేన అధ్యక్షుడు మరియు తెలంగాణ యువజన సంఘాల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెట్టు శ్రీధర్ డిమాండ్ చేశారు. శనివారం రోజున ఆయన మున్సిపల్ కార్యాలయంలో కమీషనర్ వెంకట కిషన్ రావును కలిసి ఈ మేరకు ఒక సమగ్ర వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా మెట్టు శ్రీధర్ మాట్లాడుతూ ఇస్నాపూర్ మున్సిపాలిటీ శరవేగంగా విస్తరిస్తున్నప్పటికీ, స్థానిక యువతకు మరియు విద్యార్థులకు క్రీడల్లో రాణించడానికి, శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవడానికి కనీసం ఒక్క ఆట స్థలం లేదా మినీ స్టేడియం కూడా లేకపోవడం విచారకరమన్నారు. అదేవిధంగా వృద్ధులు, మహిళలు, పిల్లలు సాయంత్రం వేళల్లో మానసిక ఉల్లాసం కొరకు గడపడానికి, వ్యాయామం చేయడానికి మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ స్థలాలను గుర్తించి వెంటనే పార్కులను ఏర్పాటు చేయాలని కోరారు. మున్సిపాలిటీలో ఇంటి నెంబర్ల సమస్య వల్ల స్థానిక ప్రజలు ఆధార్ కార్డ్, ఓటర్ ఐడీ, కరెంట్ కనెక్షన్లు మరియు వివిధ ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకునేటప్పుడు కార్యాలయాల



చుట్టూ తిరగాల్సి వస్తోందని మండిపడ్డారు. ఈ ఇండ్ల నంబర్ల సమస్యను మున్సిపల్ రెవెన్యూ విభాగం తక్షణమే సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీలలో కొంతమంది వ్యక్తులు నిబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి మున్సిపల్ అనుమతులు లేకుండా ప్రభుత్వ రోడ్లను, ఖాళీ స్థలాలను ఆక్రమించి అక్రమంగా భవన నిర్మాణాలు చేపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనివల్ల రోడ్లు ఇరుకుగా మారి తీవ్రమైన ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ మున్సిపాలిటీ చట్టం ప్రకారం అధికారులు స్పందించి, తక్షణమే క్షేత్రస్థాయి పరిశీలన జరిపి రోడ్లపై ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించాలని డిమాండ్ చేశారు.

## జవహర్‌నగర్ గబ్బిలాల పేటలో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు చేయాలి

### పేదల చదువుల కోసం రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురండి

### ఎంపీ ఈటెల రాజేందర్‌కు వినతి



**జవహర్‌నగర్, మే 23 (నినాదం):** మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్, డంపింగ్ యార్డ్ ప్రాంతంలో పూర్తి స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే వీలైనన్ని పాఠశాలల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని మల్కాజ్గిరి పార్లమెంటు సభ్యులు ఈటెల రాజేందర్కు ఏఐఎస్ఎఫ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ ఆసియాలోనే అతిపెద్ద డంపింగ్ యార్డ్ జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ అన్నారు. ఈ ప్రాంతంలో ఎందరో పేద, మధ్యతరగతి ప్రజలు జీవిస్తున్నారని వారి పిల్లలకు సరైన విద్యా అవకాశాలు లేకపోవడంతో డ్రగ్స్, గంజాయి కి బానిసలుగా మారుతున్నారన్నారు. ఈ ప్రాంతంలో లక్ష మందికి పైగా విద్యార్థులు వున్నారని, కానీ నాలుగు పాఠశాలలు మాత్రమే వున్నాయన్నారు. దీంతో చదువుకోవాలనే తపన వున్నా, పాఠశాలలు లేకపోవడంతో బాల కార్మికులుగా మారుతున్నారన్నారు. ప్రజలు ఎన్నో ఉద్యమాలు చేస్తున్నా అధికారులు, ప్రభుత్వం స్పందించడం లేదని తెలిపారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకునే విధంగా ఒత్తిడి తీసుకురావాలని ఈటెల రాజేందర్ కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రెహమాన్, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కార్యదర్శి ఎండీ అన్వర్, ఉపాధ్యక్షులు హరీష్, తదితరులు పాల్గొన్నారు.

## చేర్యాలలో దొంగల హల్‌చల్

**చేర్యాల, మే 23 (నినాదం):** చేర్యాల పట్టణ కేంద్రంలో జాతీయ రహదారి వెంబడి శుక్రవారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు యంసాని కృష్ణమూర్తి నివాసంలో ఎవరూ లేని సమయంలో దొంగలు చొరబడ్డారు అలాగే కొద్ది దూరంలో ఉన్న శ్రీ మార్టతో పాటు డెక్కర్ చాయ్ హోటల్లో తాళాలు పగలగొట్టి లోనికి ప్రవేశించారు వరుసగా ఈ మూడు చోరీలలో ఎంత మేర నగదు , బంగారం లేదా ఇతర సామాగ్రి అపహరణకు గురైనాయని పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది బాధితుల ఫిర్యాదు మేరకు సమాచారం అందుకున్న చేర్యాల సిఐ రమేష్ నాయక్, ఎస్సై అపూర్వ రెడ్డి తమ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నానీ క్లూస్ టీం సహాయంతో ఆధార సేకరిస్తూ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.



## ఫుట్‌బోర్డ్ ఆక్రమణలు తొలగింపు

**కుత్బుల్లాపూర్, మే 23 (నినాదం):** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆదేశాల మేరకు గాజులరామారం సర్కిల్ డెప్యూటీ కమిషనర్ యు.వెంకట్రాములు పర్యవేక్షణలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది శనివారం భారీ ఆక్రమణల తొలగింపు డ్రైవ్‌ను చేపట్టారు. ఉషా ముళ్ళపూడి హాస్పిటల్ రోడ్డు నుండి రామ్‌కీ అపార్ట్‌మెంట్స్ వరకు రహదారికి ఇరువైపులా ఉన్న అనధికారిక షాపులు, తోపుడు బండ్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఏర్పాటు చేసిన తాత్కాలిక నిర్మాణాలను టౌన్ ప్లానింగ్ సిబ్బంది జేసీబీల సహాయంతో తొలగించారు. ఈ మార్గంలో రోజురోజుకూ ట్రాఫిక్ సమస్యలు పెరిగిపోతుండటం, కాలినడకన వెళ్లే ప్రజలు ప్రమాదాల బారిన పడుతుండటంతో ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా డెప్యూటీ కమిషనర్ యు. వెంకట్రాములు మాట్లాడుతూ రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు చేయడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోందని తెలిపారు. మరోసారి ఎవరైనా రోడ్లపైకి వస్తే సామాగ్రిని జప్తు చేయడమే కాకుండా, సదరు వ్యక్తులపై కఠినమైన చట్టపరమైన చర్యలు



నమోదు చేస్తామని తీవ్రంగా హెచ్చరించారు. వ్యాపారులు మున్సిపల్ నిబంధనలను పాటించి, నగర రవాణా వ్యవస్థ సజావుగా సాగేందుకు సహకరించాలని ఆయన కోరారు.

## ఉచిత నీటి పథకం వర్తింపజేయండి..

- జలమండలి ఎండి అశోక్ రెడ్డికి వినతి

**రాజేంద్రనగర్, మే 23 (నినాదం):** జీహెచ్ఎంసీలో కొత్తగా విలీనమైన వార్డుల్లో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 20,000 లీటర్ల ఉచిత నీటి పథకాన్ని అమలు చేయాలని ఆల్ కాలనీస్ ఫెడరేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. శుక్రవారం బండ్లగూడ జాగీర్, హైదర్‌షాకోట్, కిస్మత్‌పూర్ ఏసీఎఫ్ ప్రతినిధి బృందం హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి,ని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఏసీఎఫ్ ప్రతినిధులు మాట్లాడుతూ.. బండ్లగూడ జాగీర్, కిస్మత్‌పూర్, హైదర్‌షాకోట్ ప్రాంతాలు జీహెచ్ఎంసీ పరిధిలోకి వచ్చినప్పటికీ, ఇక్కడి ప్రజలకు ఇప్పటివరకు 20 వేల లీటర్ల ఉచిత నీటి పథకం లబ్ది చేకూరలేదని ఎండీ దృష్టికి తీసుకెళ్లారు. విలీన వార్డుల ప్రజలపై వివక్ష చూపకుండా ఉచిత నీటి సరఫరాను తక్షణమే ప్రారంభించాలని కోరారు. గంధంగూడతో పాటు ఆయా వార్డుల్లోని వివిధ ప్రాంతాల్లో నిర్మించి, ప్రస్తుతం వినియోగంలో లేని నీటి రిజర్వాయర్లను వెంటనే పునరుద్ధరించాలన్నారు. కాలనీల ప్రతినిధుల వినతిపై జలమండలి ఎండీ అశోక్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. విలీన వార్డుల్లో ఉచిత నీటి సరఫరా అంశాన్ని త్వరలోనే ముఖ్యమంత్రి కార్యాలయం దృష్టికి తీసుకెళ్లి తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే, ప్రస్తుతం వినియోగంలో లేని రిజర్వాయర్లను



వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి, మరమ్మతులు చేపట్టి ప్రజా వినియోగానికి అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఎండీ ఆదేశించారు. తమ సమస్యలపై త్వరితగతిన, సానుకూలంగా స్పందించిన ఎండీ అశోక్ రెడ్డి కి ఆల్ కాలనీస్ ఫెడరేషన్ ప్రతినిధి బృందం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో ఏసీఎఫ్ అధ్యక్షులు వినయ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరేందర్ బాబు, ఉపాధ్యక్షులు నదీమ్, కార్యవర్గ సభ్యులు విజయ్ పద్మనాభన్, రవి రాజా తదితరులు ఉన్నారు.

## విద్యుత్ సరఫరాలో అంతరాయం

**వికారాబాద్, మే 23 (నినాదం):** 33/11కెవి మదనపల్లి విద్యుత్ ఉపకేంద్రంలో అత్యవసర మరమ్మతుల కారణంగా ఈ నెల 24న మండల పరిధిలోని మదనపల్లి, అత్వెల్లి, కొంపల్లి, ఎర్రవల్లి, మైలర్ దేవరపల్లి, పిలరం,రాళ్ళ చిట్టంపల్లి గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని విద్యుత్ శాఖ వికారాబాద్ టౌన్ ఇన్‌చార్జ్ ఏఈ నరేష్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పైన తెలిపిన గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.



## ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి




- 137 మంది యువతకు జాబ్ ఆఫర్ లెటర్లు అందజేత
- అడిషనల్ కలెక్టర్ పాండు

**సంగారెడ్డి బ్యూరో, మే 23 (నినాదం):** ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈ నెల 8న నిర్వహించిన జాబ్ మేళాలో వివిధ ప్రముఖ కంపెనీలకు ఎంపికైన 137 మంది అభ్యర్థులకు కలెక్టరేట్ గ్రీవెన్స్ హాలు లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ పాండు జాబ్ ఆఫర్ లెటర్లను అందజేశారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ పాండు మాట్లాడుతూ, జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. జాబ్ మేళాల ద్వారా ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలను యువతకు చేరువ చేస్తున్నామని తెలిపారు. యువత తమ విద్యార్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. కేవలం ఉద్యోగం పొందడం మాత్రమే కాకుండా విధుల్లో క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేస్తే మరింత మంచి అవకాశాలు వస్తాయని అన్నారు. ఉద్యోగాల్లో చేరిన యువత తమ కుటుంబాల ఆర్థికాభివృద్ధికి తోడ్పడటంతో పాటు సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ జిఎం తుల్జారాం నాయక్, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి అఖిలేష్ రెడ్డి, అభ్యర్థులు, తదితరులు పాల్గొన్నారు.

## సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



**వెల్దుర్తి, మే 23 (నినాదం):** మెదక్ జిల్లా వెల్దుర్తి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల వేతనాలను పెంచిన నిర్ణయాన్ని స్వాగతిస్తూ కాంగ్రెస్ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ శ్రేణులు సీఎం నిర్ణయాన్ని అభినందిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధికార ప్రతినిధి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్ రెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలను పెంచి సామాన్య ప్రజలపై భారం మోపుతోందని విమర్శించారు. అయితే సీఎం రేవంత్ రెడ్డి మాత్రం కార్మికుల కష్టాలను అర్థం చేసుకుని వారి వేతనాలను పెంచి కుటుంబాలకు అండగా నిలిచారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు ఆరు గ్యారెంటీలను అమలు చేస్తూ పేదల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ అధికార ప్రతినిధి వెల్దుర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేష్ రెడ్డి, ,రాష్ట్ర ఫిషర్మన్ కార్యదర్శి తలారి మల్లేష్, తాజా మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్ గౌడ్, మాజీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, డైరెక్టర్ నల్లచెరువు కృష్ణ గౌడ్, ఉపసర్పంచ్ పవన్ యాదవ్, సీనియర్ నాయకుడు నల్లచెరువు శేఖర్ గౌడ్, శెట్టిపల్లి వెంకట్ రెడ్డి, అక్షయ్ గౌడ్, శేఖర్ గౌడ్, అరికెల సత్యనారాయణ, దుర్గా గౌడ్, బంజే రవి, జిల్లా మహిళా మండల అధ్యక్షురాలు ముత్త బాయి, పాండు, గోగుల కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులపై సీపీని కలిసిన ఎమ్మెల్యే



**అల్వాల్, మే 23 (నినాదం):** మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి నీ మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గంలోని కీలక అభివృద్ధి పనులపై చర్చించారు. మల్కాజ్‌గిరి నియోజకవర్గ పరిధిలోని ఆర్కే పురం ఫ్లైఓవర్ మరమ్మత్తుల పనులు, అలాగే మచ్చ బొల్లారం జనప్రియ ఆర్ యు బి వద్ద జరుగనున్న అభివృద్ధి పనుల సందర్భంగా ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ట్రాఫిక్‌ను మళ్లించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ ప్రాజెక్ట్ అధికారులతో కలిసి పోలీస్ కమిషనర్ ను ఎమ్మెల్యే విన్నవించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ బి. సుమతి సమస్యలను సానుకూలంగా స్వీకరించి, ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రోహిణి , జాయింట్ ఇంజనీర్ హర్షవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## మానవత్వం చాటుకున్న నియోజకవర్గం ఇన్చార్జి

**కాంగ్రెస్ కార్యకర్త కుటుంబానికి అండగా నిలిచిన ప్రణవ్..**

**మృతుడు సలీం కుటుంబానికి 50 వేల ఆర్థిక చేయూత...**

**జమ్మికుంట, మే 23 (నినాదం)**

కాంగ్రెస్ పార్టీలో ఉన్న ప్రతి కార్యకర్త తన కుటుంబంగా భావించి,కార్యకర్తలకు ఆపద వస్తే ముందుండి ఆ కుటుంబానికి పెద్ద దిక్కులాగా హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ నిలబడ్డారని జమ్మికుంట కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. శనివారం రోజున ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన మహమ్మద్ సలీం పాషా కుటుంబానికి యాభై వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని ప్రణవ్ జమ్మికుంట కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల ద్వారా అందజేశారు.ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులు భావోద్వేగానికి లోనుకాగా వారిని నాయకులు ఓదార్చారు.అనంతరం వారు మాట్లాడుతూ మాలో ఒకడిగా ఉన్న సలీం పాషా మరణం బాధాకరమని,కార్యకర్తలకు భరోసాను ఇస్తూ హుజూరాబాద్ ఇంచార్జి ప్రణవ్ బాబు కుటుంబానికి అండగా నిలబడడం ద్వారా కష్ట సమయంలో కుటుంబానికి అండగా మానవతావాదిగా ఉంటారని తెలియజేశారని అన్నారు.ఈ కార్యక్రమంలో జమ్మికుంట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేష్ పిసిసి ఎగ్జిక్యూటివ్ నెంబర్ సాయిని రవి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మోలుగూరి సదయ్యా దుబ్బ మల్లన్న ఆలయ చైర్మన్ ముద్దమల్ల రవి జిల్లా కాంగ్రెస్ సెక్రెటరీ లింగంపల్లి లింగారావు పాత ప్రసాద్ బొంగోని వీరన్న గౌడ్ సేవా అధ్యక్షులు బండి పవన్ పోతుల శ్రీనివాస్ ప్రజా ప్రతినిధులు,సీనియర్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఎలాంటి సమస్య లేదు

**బిఆర్ఎస్ నాయకులు రాజకీయ లబ్ధి కోసం తప్పుడు వాక్యాలు**

**మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నగునూరి నర్సాగౌడ్**

**బుగ్గారం, మే23(నినాదం)**

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి సమస్య లేదని ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ నాయకులు రాజకీయ లబ్ధి కోసం రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నగునూరి నర్సగౌడ్ పేర్కొన్నారు. శనివారం చిన్నాపూర్ గ్రామం వద్ద కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన బుగ్గారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నగునూరి నర్సాగౌడ్ మాట్లాడుతూ దాదాపు 90 శాతం ధాన్యం కొనుగోలు అయి మిల్లర్లకు తరలించడం జరిగిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమం కోసమే పనిచేస్తుంది, ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని బుగ్గారం మండలంలోని అన్ని కొనుగోలు కేంద్రాలలో దాదాపు 90% దాన్యం కొనుగోలు జరిగి మిల్లర్లకు తరలించడం జరిగిందని స్పష్టం చేశారు. గత పది ఏళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వంలో రైతుల గొంతు కోయడానికి వరి ధాన్యం తప్పా, తాలు కట్టింగ్ ఆనవాయితీగా తీసుకువచ్చింది బిఆర్ఎస్ ప్రభుత్వమే అని గుర్తు చేశారు. గతంలో మీరు ,మీబిఆర్ఎస్ నాయకులు ఎప్పుడైనా కొనుగోలు కేంద్రాలను సందర్శించిన దాఖలాలు ఉన్నాయా అని ప్రశ్నించారు,ప్రతి కొనుగోలు కేంద్రాన్ని మా మంత్రి అడ్లురి లక్ష్మణ్ కుమార్ సందర్శిస్తూ ఎప్పటికప్పుడు అధికారులను ఆదేశిస్తూ ధాన్యం తరలించాలని రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగవద్దని సూచిస్తున్నారు.



## వలస కార్మికుల నమోదు ప్రక్రియ ప్రారంభం

**కరీంనగర్, మే23(నినాదం )**

కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతలను మరింత బలోపేతం చేయేందుకు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి వివిధ రంగాల్లో పనిచేస్తున్న వలస కార్మికుల వివరాల నమోదు ప్రక్రియను కొత్తపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రారంభించినట్లు ఇన్స్పెక్టర్ బిల్లా కోటేశ్వర్ తెలిపారు.పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఐపీఎస్ ఆదేశాల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో నేపాల్, బీహార్, ఉత్తరప్రదేశ్ తదితర ప్రాంతాల నుంచి వచ్చి స్థానికంగా నివసిస్తున్న కార్మికుల వ్యక్తిగత వివరాలు, నివాస సమాచారం, ఉపాధి వివరాలను సేకరించి ప్రత్యేక రిజిస్టర్లో నమోదు చేస్తున్నట్లు వెల్లడించారు.స్టేషన్ హౌస్ అధికారి ట్రైనీ ఐపీఎస్ సోహం సునిల్ మాట్లాడు తూ, నేరాల నియంత్రణ, అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన స్పందన, ప్రజల భద్రత దృష్ట్యా ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ అధికారులు, సిబ్బంది కార్మికులకు అవగాహన కల్పిస్తూ వారి వివరాలను నమోదు చేశారు.



## భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్**

**చేవెళ్ళ మే 23( నినాదం):**

చేవెళ్ళ నియోజకవర్గం మొయినాబాద్ పట్టణ కేంద్రంలో పద్మావతి ఫంక్షన్ హాల్ లో సెంట్రింగ్ అసోసియేషన్, భవనిర్మాణ కార్మికులు మేస్త్రీల ఉమ్మడి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ సెంట్రింగ్ అసోసియేషన్ మొయినాబాద్ అధ్యక్షులు బొర్ర శంకర్ హాజరై మాట్లాడుతూ నిత్యవసర ధరలు కిరాణా ,పెట్రోల్ గ్యాస్ అనేక ధరలు ఎక్కువ పెరిగిపోయాయి, సెంట్రింగ్ కాంట్రాక్టు వాళ్లకు మాత్రమే రేట్లు తక్కువ గా ఉన్నాయి, సెంట్రింగ్ మెటీరియల్స్ కూడా విపరీతంగా రేట్లు పెరిగిపోయాయి, కాబట్టి జాక్ సెంట్రింగ్ రేట్లు పెంచాలని , జీరో నుండి పది ఫీట్ల స్లాబ్ ఎత్తు వరకు 51 రూపాయలు ఇవ్వాలని, సెంట్రింగ్ కార్మికులకు ప్రభుత్వము 30 రోజులు ట్రైనింగ్ ఇచ్చి ఐదు లక్షల రూపాయలు సెంట్రింగ్ మెటీరియల్స్ కోసం బ్యాంకు ద్వారా రుణ సబ్సిడీలు ఇవ్వాలని, కార్మికుడు ప్రమాదవశాత్తు చనిపోతే 20 లక్షల రూపాయలు బీమా సౌకర్యం ఇవ్వాలి, ఈఎస్ఐ ఐదు లక్షల రూపాయలు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సెంట్రింగ్ అసోసియేషన్ మండల మాజీ అధ్యక్షులు దర్శన్ సాగర్, సెంట్రింగ్ అసోసియేషన్ మండల ప్రధాన కార్యదర్శి రవి సాగర్, కోశాధికారి మోనాకర్ సాగర్, కమిటీ సభ్యులు రామ్ రెడ్డి అంజయ్య సాగర్ పి యాదయ్య సాగర్ జే. యాదయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ప్రభుదాస్ కొండల్ రాజు కొండల్ శివ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ పింఛన్లు, రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు

**కరీంనగర్, మే23(నినాదం )**



కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ అన్ని రకాల పింఛన్లు అందిస్తుందని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న, కార్పొరేటర్ ఆకుల నర్మద తెలిపారు. శనివారం కట్టరాంపూర్లో నిర్వహించిన పింఛన్ల కేవైసీ నవీకరణ కార్యక్రమాన్ని వారు పరిశీలిం చారు. కార్యక్రమానికి వచ్చిన వృద్ధులు, మహి ళలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకు న్నారు. పింఛన్లు పొందుతున్న వారంతా తమ డివిజన్లలో జరుగుతున్న కేవైసీ నవీకరణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జూన్ 2 నుంచి అర్హులైన వారందరికీ పింఛన్లు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. అలాగే రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు త్వరలో ప్రారంభమవుతుందని, తొలి విడతలో మిగిలిన అర్హులను కూడా ఇందులో చేర్చుతామని చెప్పారు.జిల్లా మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ అసెంబ్లీ ఇంచార్జ్ వెలిచాల రాజేందర్ రావు సహకారంతో అర్హులైన ప్రతి కుటుంబానికి పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా 11వ డివిజన్లో డ్రైనేజీలు, సీసీ రోడ్లు సహా అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# వామ్మో.. భానుడు భగభగ..!

**మధ్యాహ్నం వేళ రహదారులు వెలవెల**

**ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలు**

**43 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రతలు**



**మెట్పల్లి, మే 23 (నినాదం):**

ఎండలు మెట్ పల్లి, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం ప్రాంత ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత రెండు రోజులుగా మెట్పల్లి పట్టణంలో 42 నుంచి 43 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో ఉదయం నుంచే భానుడు నిప్పులు చెరుగుతున్నాడు. మధ్యాహ్నం సమయానికి రహదారులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. తీవ్రమైన ఎండల కారణంగా ప్రజలు అత్యవసర పనులు మినహా బయటకు రావడానికి వెనుకాడుతున్నారు. అయ్యప్ప గుడి వద్ద నుంచి పాత బస్టాండ్, శాస్త్రి చౌరస్తా, వెల్లుల్ల రోడ్, వేంపేట్ రోడ్, రాజీవ్ గాంధీ సర్కిల్, ఆరపేట ప్రాంతాల్లోని ప్రధాన రహదారులు, వ్యాపార కేంద్రాలు, మార్కెట్ ప్రాంతాలు కూడా మధ్యాహ్నం వేళల్లో వెలవెలబోతున్నాయి. వాహనాల రాకపోకలు తగ్గిపోవడంతో పట్టణంలో నిశ్శబ్ద వాతావరణం కనిపిస్తోంది. సాధారణంగా రద్దీగా ఉండే కూడళ్లలో కూడా జనసంచారం తగ్గిపోవడం కనిపిస్తోంది. ఎండ తీవ్రతతో చిన్నారులు, వృద్ధులు, దినసరి కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బయట పనిచేసే కార్మికులు చెమటలు కారుస్తూ పనులు కొనసాగిస్తున్నారు. మధ్యాహ్నం వేళల్లో వేడి గాలులు ఎక్కువగా వీయడంతో ప్రజలు ఉక్కపోతకు గురవుతున్నారు. కొంతమంది తలపై తువ్వాళ్లు, గొడుగులు వేసుకుని ప్రయాణాలు చేస్తున్నారు. చల్లని పానీయాలు, కొబ్బరి బోండాలు, మజ్జిగ దుకాణాల వద్ద మాత్రం కొంత రద్దీ కనిపిస్తోంది. మరోవైపు ఎండల ప్రభావంతో విద్యుత్ వినియోగం భారీగా పెరిగింది. ఫలితంగా కొన్ని కాలనీల్లో లో వోల్టేజ్ సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. రాత్రి సమయంలో కూడా ఉక్కపోత తగ్గకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఫ్యాన్లు, కూలర్లు నిరంతరం వినియోగించడంతో విద్యుత్ భారం పెరిగిందని అధికారులు చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఎండల ప్రభావం తీవ్రంగానే కనిపిస్తోంది. పొలాల్లో పనులు చేసే రైతులు ఉదయం వేళల్లోనే పనులు ముగించేందుకు ప్రయత్నిస్తున్నారు. చెరువులు, కుంటల్లో నీటి మట్టం తగ్గిపోవడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. పశువులకు నీటి కొరత తలెత్తకుండా రైతులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కొన్ని గ్రామాల్లో ప్రజలు తాగునీటి కోసం కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు సమాచారం. వేసవి తీవ్రతతో ఆస్పత్రుల్లో జ్వరాలు, డీహైడ్రేషన్, వడదెబ్బ లక్షణాలతో వచ్చే వారి సంఖ్య పెరుగుతోందని వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు ఎండ ప్రభావానికి త్వరగా గురయ్యే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

### యువత అప్రమత్తంగా ఉండాలి..

వైద్యులు ముఖ్యంగా యువత అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ప్రస్తుతం తీవ్ర ఎండలు, ఉక్కపోత కారణంగా శరీరంలో నీటి శాతం వేగంగా తగ్గిపోతుందని చెబుతున్నారు. బైక్లపై ఎక్కువసేపు ప్రయాణాలు చేసే యువకులు తప్పనిసరిగా తలకు క్యాప్, గమ్చా లేదా హెల్మెట్ ఉపయోగించాలని సూచిస్తున్నారు. జిమ్లు, క్రికెట్, వాలీబాల్ వంటి అవుట్డోర్ క్రీడలు మధ్యాహ్నం వేళల్లో ఆడకుండా ఉదయం లేదా సాయంత్రం సమయాల్లో నిర్వహించుకోవాలని చెబుతున్నారు.

ఎండలో ఎక్కువసేపు తిరగడం వల్ల డీహైడ్రేషన్, వడదెబ్బ, తలనొప్పి, అలసట, వాంతులు వంటి సమస్యలు వచ్చే అవకాశముందని హెచ్చరిస్తున్నారు. రోజుకు కనీసం 3 నుంచి 4 లీటర్ల నీరు తాగాలని, మజ్జిగ, కొబ్బరి నీరు, నిమ్మరసం, గ్లూకోజ్, పండ్లరసాలు ఎక్కువగా తీసుకోవాలని సూచిస్తున్నారు. ఫాస్ట్ ఫుడ్, కూల్డ్రింక్స్ కంటే సహజ పానీయాలకు ప్రాధాన్యం ఇవ్వాలని చెబుతున్నారు. ముఖ్యంగా డెలివరీ బాయ్స్, కూలీలు, ఆటో డ్రైవర్లు, ఫీల్డ్ ఉద్యోగులు మధ్యమధ్యలో నీడ ప్రాంతాల్లో విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఎండలో తిరిగిన వెంటనే ఐస్ వాటర్ తాగకుండా సాధారణ చల్లని నీరు తీసుకోవాలని చెబుతున్నారు. శరీరంలో నీరసం, తల తిరగడం, అధిక చెమటలు, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు.

# ఔట్సోర్సింగ్ ఉద్యోగి అవినీతిపై కమిషనర్కు ఫిర్యాదు

- సమగ్ర విచారణ జరపాలని డిమాండ్
- పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పూదరి రేణుక శివకుమార్ గౌడ్



**జమ్మికుంట, మే 23 (నినాదం)**

జమ్మికుంట మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగి బోళ్ల సదానందం అవినీతి, అక్రమ వసూళ్ల తో పాటు అధికార దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పూదరి రేణుక శివకుమార్ శనివారం కమిషనర్ మల్లికార్జున్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జమ్మికుంట పట్టణ ప్రజలు, సామాజిక బాధ్యత కలిగిన పౌరులమై, జమ్మికుంట మున్సిపాలిటీలో గత కొన్ని సంవత్సరాలుగా ఔట్సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న బోళ్ల సదానందం వ్యవహారాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తుందన్నారు. బోళ్ల సదానందం గతంలో ఎన్నో అవినీతి ఆరోపణలు వెలుగులోకి వచ్చాయని ఉద్యోగాల పేరుతో, జీతాల పెంపు పేరుతో ఇతర పనుల పేరుతో ప్రజల నుంచి, కార్మికుల నుంచి వేలాది రూపాయల నుండి లక్షల రూపాయల వరకు అక్రమ వసూళ్లు చేస్తున్నాడనే ఆరోపించారు. ఈ వ్యవహారాలపై విజిలెన్స్ విచారణలు, ఏసీబీ దాడులు జరిగిన ఇప్పటివరకు ఎటువంటి స్పష్టమైన చర్యలు తీసుకోకపో వడం ప్రజల్లో అనుమానాలకు తావిస్తుం దన్నారు.సాధారణ ఔట్సోర్సింగ్ ఉద్యోగి కోట్లాది రూపాయల ఆస్తులు సంపాది స్తున్నాడనే ఆరోపణలు వస్తున్నా, సంబంధిత అధికారులు మౌనంగా ఉండటం పలు అనుమానాలు కలిగిస్తుందన్నారు. కమిషనర్లు మారిన పాలకవర్గం మారిన ఔట్సోర్సింగ్ బోళ్ళ సదానందం తీరు మారకపోవడమే కాకుండా వచ్చిన వారిని తన వైపుకు తిప్పుకొని తన ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సేవ చేయాల్సిన వ్యవస్థలో కొందరు వ్యక్తులు అధికారుల పేరును ఉపయోగించుకొని దోపిడీ పాలన కొనసాగించడం బాధాకరమన్నారు. ఈ సందర్భంగా పూదరి రేణుక బోళ్ల సదానందం కు సంబంధించిన పలు అంశాలపై విచారణ జరపాలని కోరారు.బోళ్ల సదానందం ఆస్తులు, ఆదాయ వనరులు, ఆర్థిక లావాదేవీలపై సమగ్ర విజిలెన్స్ఏసీబీ విచారణ జరపాలని,గతంలో జరిగిన ఏసీబీ దాడులు, విజిలెన్స్ నివేదికలను ప్రజలకు వెల్లడించాలని కోరారు. ఉద్యోగాల పేరుతో, జీతాల పెంపు పేరుతో జరిగిన అక్రమ వసూళ్లపై ప్రత్యేక దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. విచారణ పూర్తయ్యే వరకు అతనిని విధుల నుండి సస్పెండ్ చేయాలని కోరారు. జమ్మికుంట మున్సిపాలిటీలో అవినీతి రహిత పారదర్శక పాలన ఏర్పడేలా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.



## భక్తులకు మజ్జిగ వితరణ

**జమ్మికుంట, మే 23 (నినాదం)**

ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని జమ్మికుంట పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయానికి వచ్చే భక్తుల కోసం వికాస తరంగిణి ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. పట్టణంలోని వెంకటాద్రి నగర్ లో గల శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో భక్తులు శనివారం రోజున అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. ఎండాకాలం తీవ్రత ఎక్కువగా ఉండటంతో వివిధ ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండాలనే ఉద్దేశంతో భక్తులకు మజ్జిగ దాత కల్వల దీప్తి కిషన్ రెడ్డి సహకారంతో వికాస తరంగిణి ఆధ్వర్యంలో మజ్జిగను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు వికాస తరంగిణి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ నేతల పరామర్శ

**మల్హార్ మే 23 (నినాదం):**

మల్హార్ రావు మండలంలోని గాదంపల్లి గ్రామానికి చెందిన నారా కృష్ణ ఇటీవల మృతి చెందగా, ఆయన కుటుంబ సభ్యులను గ్రామ సర్పంచ్ బండారి నర్సింగం, మాజీ ఎంపీపీ చింతలపల్లి మల్హార్ రావు పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబా నికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తాళ్ళ రవీందర్, వార్డు సభ్యులు బియ్యని శ్రీవాణి కుమార్, తాటికొండ కేశవచారి, జంబోజు రవీందర్, మాజీ సర్పంచ్ రాజునాయక్, చెంద్రునాయక్, యూత్ ఉపాధ్యక్షుడు అడ్డూరి శివ, కొండికొప్పుల వెంకటస్వామి, నారా సతీష్, నారా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# భద్రతా విధుల్లో అప్రమత్తతే ప్రధాన ఆయుధం

- పీఎస్ఓలు, బాంబు నిర్వీర్య దళం, శునక దళ సిబ్బంది
- అత్యున్నత ప్రమాణాలతో విధులు నిర్వహించాలని సూచన
- ఏఆర్ ఏసీపీ ప్రతాప్



**కరీంనగర్, మే 23(నినాదం)**

ప్రజాప్రతినిధులు, వీఐపీల భద్రతతో పాటు శాంతిభద్రతల పరిరక్షణలో పీఎస్ ఓలు, బాంబు నిర్వీర్య దళం, శునక దళ సిబ్బంది అప్రమత్తత, క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేయాలని కరీం నగర్ ఏఆర్ ఏసీపీ ప్రతాప్ సూచించారు. శనివారం కమీషనరేట్ కార్యాలయంలో ఏఆర్ సిబ్బందితో నిర్వహించిన ప్రత్యేక సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. విధి నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రామాణిక విధానాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. వీఐపీల భద్రతను పీఎస్ఓలు అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని, ఆయుధాల వినియోగం, మార్గాల పరిశీలన, అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. వీఐపీల ప్రయాణ వివరాల గోప్యతను తప్పనిసరిగా కాపాడాలని తెలిపారు.బాంబు నిర్వీర్య దళ సిబ్బంది సాంకేతిక నైపుణ్యం, మానసిక ధైర్యం, సమయస్ఫూర్తితో పనిచేయాలని, చిన్న పొరపాటు కూడా తీవ్ర పరిణామాలకు దారితీసే అవకాశం ఉన్నందున అప్రమ త్తంగా ఉండాలని హెచ్చరించారు. శునక దళ హ్యాండ్లర్లు శునకాల ఆరోగ్యం, దృఢత్వంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, హ్యాండ్లర్ తెలివితేటలు, శునకాల ఘ్రాణశక్తి సమన్వయంతోనే ఆపరేషన్లు విజయవంతమవుతాయని పేర్కొన్నారు. వృత్తి నైపుణ్యం, క్రమశిక్షణే విజయానికి మూలమని, ప్రజల భద్రత కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతా యుతంగా విధులు నిర్వర్తించాలని ఏసీపీ ప్రతాప్ పిలుపు నిచ్చారు. సమావేశంలో రిజర్వు ఇన్స్పె క్టర్ రజినీకాంత్, ఆర్ఎస్ఐలు నీలవేణి రాజు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## ‘నిజాం గేమింగ్ జోన్’ ప్రారంభం

**కరీంనగర్, మే23(నినాదం)**



కరీంనగర్ నగరంలోని కాశ్మీర్ గడ్డ ప్రాంతంలో, గ్రో హై అకాడమీ పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన ‘నిజాం గేమింగ్ జోన్’ శనివారం ఘనంగా ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు హాజరై రిబ్బన్ కట్ చేసి కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో 60వ డివిజన్ కార్పొరేటర్ జనాబ్ ఇబ్రహీం బియాబాని, మాజీ కార్పొరేటర్ చంద్రమౌళి, స్థానిక నాయకులు, గేమింగ్ కేంద్రం నిర్వాహకులు, డివిజన్ వాసులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొ న్నారు. కొత్తగా ప్రారంభమైన ఈ గేమింగ్ కేంద్రం యువతకు ఆధు నిక వినోద వేదికగా ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు.

# వరి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

**కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెనువెంటనే మిల్లులకు తరలించాలి**

**జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్ లత**



**జగిత్యాల ప్రతినిధి మే 23 నినాదం**

వరి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్ లత అధికారులను ఆదేశించారు శనివారం ధర్మపురి మండలంలోని జైనా, దొంతపూర్ ఆరవెల్లి గ్రామాలు, సారంగాపూర్ మండలంలోని గణేష్ పల్లి గ్రామం లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా పరిశీలించారు.ఈ సందర్భంగా కేంద్రాలలో జరుగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేగంగా కొనుగోలు ప్రక్రియను కొనసాగించాలని అధికారులకు సూచించారు. కేంద్రాలలో హమాలీలు తగిన సంఖ్యలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ధాన్యం లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేసి లారీలను ఆలస్యం లేకుండా మిల్లులకు తరలించాలని ఆదేశించారు.అలాగే ట్రక్ షీట్ నమోదు, ట్యాబ్ ఎంట్రీలు వంటి అన్ని డాక్యుమెంటేషన్ పనులను సమయానికి పూర్తి చేయాలని, ఎలాంటి పెండింగ్ లేకుండా చూడాలని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాలలో పారదర్శకత పాటించడంతో పాటు రైతులకు సరైన సమాచారం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ధాన్యం కొనుగోలు సమయంలో తేమ శాతం, నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పరిశీలించాలని, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎటువంటి అవకతవకలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, కేంద్రల నిర్వాహకులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ బాధ్యత మందులు ఇవ్వడమే కాదు..

# రోగిలో ఆశను నిలబెట్టడం

## అవయవ దానం అనేది కేవలం ఒక వైద్య ప్రక్రియ మాత్రమే కాదు...

## ఒక మనిషి జీవితాన్ని మరో మనిషి ద్వారా కొనసాగించే మహత్తర మానవతా కార్యక్రమం

**హైదరాబాద్ లోని నిజాం ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) లో నెఫ్రాలజీ విభాగం హెడ్, సీనియర్ ప్రొఫెసర్ గా సేవలందిస్తున్న డాక్టర్ డి. శ్రీ భూషణ్ రాజు గారు వైద్య రంగంలో అత్యున్నత స్థాయి గుర్తింపు పొందిన నిపుణులు. ఎంతో అనుభవం, అంకితభావం కలిగిన ఆయన, కిడ్నీ వ్యాధుల చికిత్సలో ముఖ్యంగా డయాలసిస్ , కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సల్లో ఎన్నో క్లిష్టమైన కేసులు విజయవంతం చేసి రోగులకు ప్రాణదానం చేశారు. ఢిల్లీలోని ప్రతిష్టాత్మక ఎ.ఐ.ఎం.ఎస్ లో డి.ఎమ్ పూర్తి చేసిన ఆయన, అంత ర్జాతీయ స్థాయిలో అనేక పరిశోధన పత్రాలు ప్రచురించారు. కేవలం వైద్యుడిగా కాకుండా, రోగులకు అవగాహన కల్పించడంలో వైద్య విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించడంలో ఆయన ఎప్పుడూ ముందుంటారు. వైద్య రంగానికి ఆయన చేస్తున్న విశేష సేవలకు గాను పలు అవార్డులు అందుకున్నారు. రోగుల పట్ల ఆయన చూపే మానవీయ దృక్పథం , సేవాభావం ఆయన్ని ఎందరో రోగుల అభిమాన వైద్యుడిగా నిలబెట్టాయి. ఆయన వైద్య వృత్తి పట్ల చూపే అంకితభావం, నిరాడంబరమైన వ్యక్తిత్వం నేటి యువ వైద్యులకు ఒక గొప్ప స్ఫూర్తిదాయకం. ఆయనతో ముఖాముఖి....**

**నినాదం: మీరు భువనగిరి లాంటి చిన్న పట్టణం నుండి వచ్చి, ఎయిమ్స్ లో చదివి, ఇప్పుడు నిమ్స్ హెచ్ఓడీగా ఉన్నారు. ఈ సుదీర్ఘ ప్రయాణంలో వైద్యుడిగా మీ కంటే.. ఒక సాధారణ మనిషిగా మిమ్మల్ని కదిలించిన ఒక్క సంఘటన గురించి చెప్తారా**

**డాక్టర్:** ఒకటే సంఘటన అని చెప్పలేం. చాలా సంఘటనలు ఉంటాయి. కుటుంబ వాతావరణమే కాకుండా, మన చుట్టూ ఉండే మనుషులు, ఉపాధ్యాయులు, స్కూల్ వాతావరణం కూడా మనల్ని ఎంతో ప్రభావితం చేస్తాయి. ఆ రోజుల్లో నల్లగొండలో నేను చదివిన పాఠశాల వాతావరణం, అక్కడి ఉపాధ్యాయుల ఆలోచనా విధానం --- ఇవన్నీ కూడా సామాజిక ద క్పథాన్ని పెంపొందించేలా ఉండేవి. నేను చదివిన పుస్తకాలు, వేసిన నాటకాలు, పాడిన పాటలు, చదివిన కథలు, సాహిత్యం... అలాగే నేను కలిసిన మనుషులు వీరందరూ కలిసి నాలో ఒక సామాజిక ద క్పథాన్ని పెంచారని నేను భావిస్తున్నాను

**నినాదం:** మీ పేషెంట్లు ఎప్పుడూ ఒక మాట చెబుతుంటారు... మీరు మందుల కంటే ముందు మీ మాటలతోనే సగం రోగాన్ని నయం చేస్తారని. నేటి కార్పొరేట్ ఆసుపత్రుల యుగంలో రోగులతో ఇంత సమయం గడపడం, అంత ఓపికగా వారి సమస్యలను వినడం వెనుక ఉన్న మీ జీవన విధానం ఏమిటి

**డాక్టర్:** మొదటి నుంచి నాకు మనుషులను ఇష్టపడాలి, మనుషులను గౌరవించాలి అనే భావజాలం ఉంది. పైగా నాలాంటి అత్యంత సాధారణ వ్యక్తి దగ్గరకు రోగులు వందల రూపాయలు ఖర్చు పెట్టుకుని వస్తున్నారు. రెండు, మూడు బస్సులు మారి నా కోసం వచ్చి, క్యూలో నిలబడి, గంటల తరబడి ఎదురుచూస్తుంటారు. కొన్ని సందర్భాల్లో నేను కేవలం రెండు మూడు నిమిషాలు మాత్రమే వాళ్లను చూడగలుగుతాను. నేను ఇక్కడ కొత్తగా చేరిన రోజుల్లో కొన్నిసార్లు నేను ఊర్లో లేనప్పుడు, వారు మరెవరికీ చూపించుకోకుండా అలాగే తిరిగి వెళ్లిపోయేవారు. అది నాకు చాలా ఆశ్చర్యంగాను, కొంత భయంగాను అనిపించేది. ఎందుకంటే నేను చాలా సాధారణ వ్యక్తిని. ఎంతో దూరం నుంచి వందలాది రూపాయలు ఖర్చు పెట్టుకుని రోగులు వస్తారు. కేవలం రెండు మూడు నిమిషాలు డాక్టర్ తో మాట్లాడడం కోసం గంటల తరబడి బయట కూర్చుంటారు. నాకోసం ఓపికగా ఎదురుచూసే వారి నమ్మకమే నన్ను నడిపిస్తోంది. సైన్స్తోనే వాళ్లకు వైద్యం అందిస్తూ, మానసిక ధైర్యాన్ని ఇవ్వడం చాలా ముఖ్యం. సరైన వైద్యం, మానసిక ధైర్యం, కుటుంబ సహకారం ఉంటే ఎంతోమంది సాధారణ జీవితాన్ని కొనసాగించగలుగుతున్నారు. ఒక డాక్టర్ బాధ్యత కేవలం మందులు ఇవ్వడం మాత్రమే కాదు, రోగిలో ఆశను నిలబెట్టడం కూడా ఎంతో ముఖ్యమైనది.

**నినాదం:** సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులు వైద్యరంగాన్ని ఎలా ప్రభావితం చేస్తున్నాయి

**డాక్టర్:** ప్రపంచవ్యాప్తంగా మాత్రమే కాకుండా మన దేశంలోనూ సాంకేతిక రంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. టెక్నాలజీలో వస్తున్న ప్రతి కొత్త మార్పును వైద్యరంగంలో కూడా విస్త తంగా అన్వయించుకుంటున్నాం. అందువల్లే నేడు సీటీ స్కాన్, ఎంఆర్ఐ వంటి అత్యాధునిక పరీక్షలు అందుబాటులోకి వచ్చాయి. చివరికి మనం నోట్లో వేసుకునే కొన్ని మాత్రల తయారీలో కూడా అత్యున్నత సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. సాధారణంగా టాబ్లెట్ మింగేయడమే అనుకుంటాం కానీ, దాని వెనుక కూడా ఎంతో టెక్నాలజీ దాగి ఉంటుంది. ఇలాంటి ఎన్నో ఆధునిక పద్ధతులు నిరంతరం రూపుదిద్దుకుంటూనే ఉన్నాయి.

**నినాదం:** మీరు బిజీ నెఫ్రాలజిస్ట్గా ఉంటూనే హెల్త్కేర్ మేనేజ్మెంట్లో ఎంబీఏ చేయడానికి కారణం ఏమిటి

**డాక్టర్:** ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న సమయంలో ఒక విషయం స్పష్టంగా అర్థమైంది. మంచి చేయాలనే ఉద్దేశం, వనరులు, అవకాశాలు ఉన్నా... వాటిని ప్రజలకు సరిగా చేరవేయడంలో వ్యవస్థ (సిస్టమ్) లోపాలు అడ్డంకిగా మారుతున్నాయి. ఆ సమస్యలను అర్థం చేసుకోవాలనే ఉద్దేశంతోనే హాస్పిటల్ మేనేజ్మెంట్పై ఆసక్తి పెరిగింది. ఆ తర్వాత హెల్త్కేర్ మేనేజ్మెంట్లో ఎంబీఏ పూర్తి చేశాను. ఆ చదువు వల్ల ఆసుపత్రి వ్యవస్థ మాత్రమే కాదు, సమాజం మొత్తం ఎలా పనిచేస్తుందో అర్థమైంది. మేనేజ్మెంట్ అనేది కేవలం పరిపాలన కాదు... మంచి ఆలోచనలు, మనుషులు, వనరులను ఒకే దిశలో నడిపించే ప్రక్రియ అని తెలుసుకున్నాను. ఈ చదువు నాకు సమాజం పట్ల మరింత గౌరవాన్ని పెంచింది. అలాగే పరిస్థితులను అర్థం చేసుకోవడంలో, నన్ను నేను సమర్థంగా మేనేజ్ చేసుకోవడంలో కూడా ఎంతో ఉపయోగపడింది.

**నినాదం:** వైద్య విద్యార్థులకు మేనేజ్మెంట్ స్కిల్స్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్పై అవగాహన ఎంతవరకు అవసరం

**డాక్టర్:** ఎంబీబీఎస్ చదివే దశలోనే విద్యార్థులకు హాస్పిటల్ మేనేజ్మెంట్, ఆసుపత్రి నిర్వహణ విధానం గురించి కనీస అవగాహన ఉండటం చాలా అవసరం. దీనివల్ల వారు భవిష్యత్తులో వైద్య స్పెషలైజేషన్తో పాటు అడ్మినిస్ట్రేషన్ రంగాన్ని కూడా కెరీర్గా ఎంచుకునే అవకాశం ఉంటుంది. ఈ దిశగా ఎన్ఎమ్సి వంటి సంస్థలు సరైన విధానాలు తీసుకురావాలి.

**నినాదం:** ప్రస్తుతం వైద్య రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రభావాన్ని మీరు ఎలా చూస్తున్నారు భవిష్యత్తులో ఇది వైద్యుల స్థానాన్ని భర్తీ చేయగలదా

డాక్టర్: ఏఐ రావడం వల్ల మానవ స్పర్శ పూర్తిగా పోతుందని అనుకోవడం కూడా తప్పే, వైద్యులను పూర్తిగా భర్తీ చేస్తుందని భావించడం కూడా సరైంది కాదు. వైద్య రంగం మొదటి నుంచే కొత్త సాంకేతికతలను స్వీకరిస్తూ వచ్చింది. ఏఐ కూడా ఒక సహాయక సాధనంగా వైద్య రంగానికి ఎంతో ఉపయోగపడుతుంది. ముఖ్యంగా ముందస్తు నిర్ధారణ, డేటా విశ్లేషణ వంటి అంశాల్లో ఇది కీలక పాత్ర పోషించవచ్చు. కానీ వైద్యుడి అనుభవం, మానవీయత, రోగితో ఉండే అనుబంధాన్ని ఏఐ ఎప్పటికీ పూర్తిగా భర్తీ చేయలేదు.

**నినాదం:** బయో ఆర్టిఫిషియల్ కిడ్నీ పరిశోధనలు ప్రస్తుతం ఏ దశలో ఉన్నాయి

**డాక్టర్:** గత 25-30 సంవత్సరాలుగా 'బయో ఆర్టిఫిషియల్ కిడ్నీ' లేదా 'వేరబుల్ కిడ్నీ' వంటి సరికొత్త ఆవిష్కరణలపై ప్రపంచ వ్యాప్తంగా నిరంతరం పరిశోధనలు జరుగుతున్నాయి. అయితే, మానవ శరీరంలో అత్యంత సంక్లిష్టమైన అవయవాల్లో ఒకటైన కిడ్నీకి పూర్తి స్థాయి శాస్త్రీయ ప్రత్యామ్నాయాన్ని రూపొందించడం ఇప్పటికీ పెద్ద సవాలుగానే ఉంది. ప్రస్తుతం ఈ సాంకేతికతకు సంబంధించి అనేక ప్రయోగాలు కొనసాగుతున్నప్పటికీ, కిడ్నీ నిర్మాణం మరియు పనితీరుకు సంబంధించిన సాంకేతిక లోపాల కారణంగా శాస్త్రవేత్తలు ఇంకా పూర్తి స్థాయి విజయాన్ని సాధించలేకపోయారు. అయినప్పటికీ, కొత్త తరహా బయో మెటీరియల్స్, అడ్వాన్స్డ్ టెక్నాలజీల సహాయంతో పరిశోధనలు వేగంగా ముందుకు సాగుతున్నాయి. భవిష్యత్తులో రోగి శరీరంలోనే నిరంతరాయంగా డయాలసిస్ ప్రక్రియ కొనసాగించేలా, చిన్న పరిమాణంలో ఉండే అత్యాధునిక పరికరాలను అందుబాటులోకి తీసుకురావడానికి ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ సరికొత్త టెక్నాలజీ ద్వారా డయాలసిస్పై ఆధారపడుతున్న లక్షలాది మంది రోగులకు మరింత సులభమైన, మెరుగైన వైద్యం అందే అవకాశాలు ఉన్నాయని వైద్య నిపుణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



**నినాదం:** ఈ మధ్య కాలంలో 20 నుండి 30 ఏళ్ల లోపు యువతలో కూడా కిడ్నీ ఫెయిల్యూర్స్ (మూత్రపిండాల వైఫల్యం) ఎక్కువగా కనిపిస్తున్నాయి. దీనికి కేవలం మారుతున్న జీవనశైలి మాత్రమే కారణమా లేక మనకు తెలియకుండా ఆహారంలో కలిసిపోతున్న రసాయనాలు, మైక్రోప్లాస్టిక్స కూడా కారణమవుతున్నాయా మీ పరిశోధనలు ఏం చెబుతున్నాయి

**డాక్టర్:** జీవనశైలి , వాతావరణంలో వచ్చిన మార్పులు కిడ్నీ వ్యాధులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఒకప్పుడు 45--50 ఏళ్ల వయసులో కనిపించే డయాబెటిస్ ఇప్పుడు 20--30 ఏళ్ల యువతలోనే కనిపిస్తోంది. దీనికి ప్రధాన కారణాలు శారీరక శ్రమ తగ్గిపోవడం, గంటల తరబడి ఒకేచోట కూర్చోవడం, వ్యాయామం లేకపోవడం. ఆహారపు అలవాట్లలో కూడా విపరీతమైన మార్పులు వచ్చాయి. ఒకప్పుడు మాంసాహారం ఆదివారాలు లేదా ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే తినేవారు. కానీ ఇప్పుడు ప్రతిరోజూ అధిక పరిమాణంలో ఆహారం తీసుకోవడం సాధారణమైపోయింది. దీనికి తోడు శారీరక శ్రమ గణనీయంగా తగ్గిపోయింది. ఒకప్పుడు చిన్న పనులకైనా నడిచి వెళ్లేవారు లేదా సైకిళ్లపై ప్రయాణించేవారు. ఇప్పుడు చిన్న దూరాలకు కూడా కార్లు, బైక్లు వాడుతున్నారు. ఈ శారీరక చలనం తగ్గిపోవడం వల్ల డయాబెటిస్, గుండె జబ్బులు మాత్రమే కాదు, కిడ్నీ వ్యాధులు కూడా వేగంగా పెరుగుతున్నాయి. ప్రతి వయసులోనూ వేర్వేరు కారణాల వల్ల కిడ్నీ వ్యాధులు వస్తుంటాయి.

**నినాదం:** సోషల్ మీడియాలో ప్రతిరోజూ ''ఇది తాగితే కిడ్నీలో రాళ్లు కరిగిపోతాయి'', ''ఆ ముక్క తింటే కిడ్నీలు రీఛార్జ్ అవుతాయి'' అంటూ వందలాది నకిలీ చిట్కాలు వైరల్ అవుతున్నాయి. ఒక బాధ్యతాయుతమైన వైద్యుడిగా ఇలాంటి ''డిజిటల్ మెడికల్ మిస్-ఇన్ఫర్మేషన్''ను మీరెలా చూస్తారు

**డాక్టర్:** ఇది చాలా తీవ్రమైన సమస్య. సోషల్ మీడియాలో వైద్య శాస్త్రానికి సంబంధం లేని వ్యక్తులు కూడా తమకు అన్నీ తెలుసన్నట్లుగా సలహాలు ఇస్తున్నారు. ''ఇది తింటే కిడ్నీలు శుభ్రం అవుతాయి'', ''అది తాగితే డయాలసిస్ అవసరం ఉండదు'' వంటి వీడియోలు ప్రజల్లో తప్పుడు ఆశలు కలిగిస్తున్నాయి. కానీ, వైద్య శాస్త్రం అనేది అంత సులభమైన విషయం కాదు. ఒక డాక్టర్కే తన విభాగానికి చెందని అన్ని విషయాలపై పూర్తి అవగాహన ఉండకపోవచ్చు. అలాంటప్పుడు ఎలాంటి శాస్త్రీయ ఆధారం లేని చిట్కాలను నమ్మడం ప్రమాదకరం. ఇలాంటి తప్పుడు ప్రచారాల వల్ల చాలామంది సరైన సమయంలో వైద్యులను సంప్రదించకుండా ఆలస్యం చేస్తున్నారు. ఫలితంగా వ్యాధి ముదిరిన తర్వాతే ఆసుపత్రులకు వస్తున్నారు. కాబట్టి సోషల్ మీడియాలో కనిపించే ప్రతి విషయాన్ని గుడ్డిగా నమ్మకుండా, అర్హత కలిగిన నిపుణులైన డాక్టర్లను మాత్రమే సంప్రదించడం ఎంతో ముఖ్యం.

**నినాదం:** కిడ్నీ వ్యాధిగ్రస్తులకు డయాలసిస్ అనేది కేవలం తాత్కాలిక ఉపశమనమేనా దీనిపై మీ అభిప్రాయం ఏంటి

డాక్టర్: డయాలసిస్ అనేది కేవలం తాత్కాలిక ఉపశమనం మాత్రమే కాదు, కొందరికి అది జీవితం! కొంతమందికి ఇది తాత్కాలికంగా అనిపించవచ్చు, ఎందుకంటే కిడ్నీ మార్పిడి (ట్రాన్స్ప్లాంటేషన్) జరిగే లోపు వారు ఈ చికిత్స తీసుకోవాల్సి వస్తుంది. డయాలసిస్ ద్వారా 20, 30, లేదా 40 ఏళ్లకైనా జీవితాన్ని పొడిగించుకుంటూ వెళ్ళవచ్చు. సరిగ్గా వినియోగించుకున్న వారు గత 30, 40 సంవత్సరాలకు పైగా డయాలసిస్ చేయించుకుంటూ ప్రపంచవ్యాప్తంగానూ, అలాగే మన ఇండియాలోనూ ఆరోగ్యంగా జీవిస్తున్నారు.

**నినాదం:** గ్రామీణ ప్రాంతాల్లో డయాలసిస్ సెంటర్ల లభ్యత ఏ విధంగా ఉపయోగపడుతోంది

**డాక్టర్:** గతంలో కిడ్నీ రోగులు డయాలసిస్ కోసం సుదూర ప్రాంతాలకు, పెద్ద నగరాల్లో ఉన్న సెంటర్లకు వెళ్ళాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు డయాలసిస్ కేంద్రాలు స్థానికంగా అందుబాటులోకి రావడం వల్ల, వారు ఎక్కడికో వెళ్ళాల్సిన దూరాభారం తగ్గింది.

**నినాదం:** కిడ్నీ ఫెయిల్ అయిన ప్రతి ఒక్కరికీ కిడ్నీ మార్పిడి (ట్రాన్స్ప్లాంటేషన్) ఒకటే సరైన ప్రత్యామ్నాయమా

**డాక్టర్:** కిడ్నీ ఫెయిల్ అయితే వెంటనే ట్రాన్స్ప్లాంట్ చేయించుకోమని చెప్పడం చాలా సులువైన సలహా. కానీ ఇక్కడ మనం గమనించాల్సింది ఏంటంటే, కిడ్నీ వ్యాధిగ్రస్తులందరూ ట్రాన్స్ప్లాంటేషన్కు అర్హులు కారు. అందరికీ కిడ్నీ మార్పిడి చేసుకోవాల్సిన అవసరం ఉండకపోవచ్చు, పైగా చాలా మంది శారీరక స్థితి దానికి సహకరించదు. ఈ విషయం సరిగ్గా తెలుసుకోకుండా ట్రాన్స్ప్లాంట్ చేయించుకునే వారు కొందరైతే, కిడ్నీ మార్పిడికి అన్ని విధాలా అనుకూలంగా ఉన్నప్పటికీ చేయించుకోకుండా ఉండేవారు మరికొందరు ఉన్నారు. అందుకే, ఎలాంటి పరిస్థితుల్లో ఉన్న వారికైనా డయాలసిస్ సెంటర్లు అనేవి నిరంతరం అందుబాటులో ఉండాలి.

**నినాదం:** డయాలసిస్ చేయించుకుంటున్న రోగుల జీవన నాణ్యత, ఆయుష్షు దేనిపై ఆధారపడి ఉంటాయి

**డాక్టర్:** అది పూర్తిగా వారి వ్యక్తిగత ఆలోచనా విధానంపై ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు, 75 ఏళ్ల వయసున్న వ్యక్తి డయాలసిస్తో మరో రెండేళ్లు బతికితే చాలు అనుకోవచ్చు. అదే 30 ఏళ్ల యువకుడు ఉంటే, రాబోయే 40 ఏళ్ల జీవితం కోసం ప్రణాళికలు వేసుకోవాలి. డయాలసిస్ అనేది ఒక అద్భుతమైన ప్రక్రియ, ఇందులో లోటుపాట్లు ఏమీ ఉండవు.

**నినాదం:** కిడ్నీ ఫెయిల్యూర్ అయిన రోగులలో మరణాల రేటు ఎక్కువగా ఉండడానికి ప్రధాన కారణాలు ఏమిటి డయాలసిస్ రోగులు సుదీర్ఘ కాలం ఆరోగ్యంగా జీవించాలంటే ఏం చేయాలి

**డాక్టర్:** గణాంకాల ప్రకారం చూస్తే, కిడ్నీ ఫెయిల్యూర్ అయి డయాలసిస్ ప్రారంభించిన మొదటి ఆరు నెలల్లోనే దాదాపు 70 శాతం మంది రోగులు మరణిస్తున్నారు. ఇది చాలా పెద్ద సంఖ్య. కేవలం 30 శాతం మంది మాత్రమే దీర్ఘకాలికంగా, ఎక్కువ కాలం జీవించగలుగుతున్నారు. ఎవరైతే ఆరంభంలో వచ్చే సమస్యలను (బాలారిష్టాలను) తట్టుకుని, మొదటి ఆరు-ఏడు నెలల కష్ట కాలాన్ని దాటగలుగుతారో, వారు ఖచ్చితంగా మరిన్ని ఏళ్లపాటు ఆరోగ్యంగా జీవిస్తారు. ఇందుకోసం రోగులు ఎల్లప్పుడూ సానుకూల దృక్పథం తో ఉండాలి. భవిష్యత్తుపై నమ్మకంతో దూరపు స్వప్నాలను, ఆశయాలను ఈరోజే వారు కనగలగాలి. అలా మానసిక ధైర్యంతో, వైద్యుల సూచనలు పాటిస్తూ ముందుకు సాగితే సుదీర్ఘ కాలం జీవించడం ఖచ్చితంగా సాధ్యమవుతుంది. అయితే ఎంత మందిలో అటువంటి సానుకూల భావజాలం ఉంటుందనేదే ఇక్కడ ముఖ్యం.



**నినాదం:** కిడ్నీల ఆరోగ్యం విషయంలో ప్రజలకు మీరిచ్చే సలహా ఏంటి

**డాక్టర్:** ఒక మనిషి జీవితంలో ఏదైనా నష్టం జరిగితేనే కానీ మంచిని గుర్తించలేకపోవడం విచారకరం. వ్యాపారంలో పెట్టుబడి పెట్టి నష్టపోతే కేవలం డబ్బు మాత్రమే పోతుంది, అది ఒక అనుభవంగా మిగులుతుంది. కానీ, ఆరోగ్య రంగంలో అలా కాదు. ఇక్కడ పొరపాటు చేస్తే ప్రాణాలకే ప్రమాదం రావచ్చు లేదా ఆరోగ్యం పూర్తిగా క్షీణించవచ్చు. వేరేవాళ్ల అనుభవాల నుండి నేర్చుకోవడం మంచిది. అతిగా అవసరం లేకపోయినా మందులు వేసుకోవడం కిడ్నీల పనితీరుపై ప్రభావం చూపుతుంది. కిడ్నీల సంరక్షణ విషయంలో సోషల్ మీడియా చిట్కాలను కాకుండా, ఎల్లప్పుడూ అర్హత కలిగిన కిడ్నీ వైద్య నిపుణులను (నెఫ్రాలజిస్ట్లను) సంప్రదించి మాత్రమే నిర్ణయాలు తీసుకోవాలి.

**నినాదం:** కిడ్నీ మార్పిడి (ఆర్గాన్ డొనేషన్) అనగానే సమాజంలో ఎన్నో అనుమానాలు, భయాలు ఉంటాయి. తెలంగాణ బ్రెయిన్ డెడ్ డిక్లరేషన్, జీవన్దాన్ నోడల్ అధికారిగా మీరు ఎన్నో మార్పులు తీసుకొచ్చారు. అయినప్పటికీ లైవ్ డోనర్స్ (కుటుంబ సభ్యులు) అవ్వడానికి ఇప్పటికీ చాలామంది వెనుకాడుతున్నారు. ఈ సమస్య నుంచి బయటపడేందుకు సమాజం ఏం చేయాలి

**డాక్టర్:** అవయవ దానం గురించి సమాజంలో ఇంకా పూర్తిస్థాయి అవగాహన పెరగాల్సిన అవసరం ఉంది. చాలా సందర్భాల్లో ప్రజలు చివరి నిమిషంలో మాత్రమే 'ఆర్గాన్ డొనేషన్' గురించి తెలుసుకుంటున్నారు. ముఖ్యంగా బ్రెయిన్ డెడ్ పరిస్థితుల్లో కుటుంబ సభ్యులు తీవ్రమైన మానసిక వేదనలో ఉంటారు. అలాంటి సమయంలో కూడా అవయవ దానానికి అంగీకరించే కుటుంబాలు నిజంగా ఎంతో గొప్ప మనసు కలిగినవాళ్లు. పాఠశాల స్థాయి నుంచే అవయవ దానం గురించి చర్చలు, అవగాహన కార్యక్రమాలు జరగాలి. ఒక వ్యక్తి మరణించిన తర్వాత కూడా తన అవయవాల ద్వారా మరొకరికి ప్రాణం పోయగలడనే భావన సమాజంలో బలంగా వెళ్లాలి. లైవ్ డొనేషన్ విషయంలో కూడా భయాలు, అపోహలు చాలానే ఉన్నాయి. ''డొనేషన్ ఇచ్చాక నా ఆరోగ్యం ఎలా ఉంటుంది'', ''భవిష్యత్తులో సమస్యలు వస్తాయా'' అనే సందేహాలు సహజమే. కానీ సరైన వైద్య పరీక్షలు, నిపుణుల పర్యవేక్షణతో జరిగే అవయవ దానం చాలా భద్రంగా ఉంటుంది. అవయవ దానం అనేది కేవలం ఒక వైద్య ప్రక్రియ మాత్రమే కాదు... ఒక మనిషి జీవితాన్ని మరో మనిషి ద్వారా కొనసాగించే మహత్తర మానవతా కార్యక్రమం

**నినాదం:** ఈ మధ్యకాలంలో యువతలో జిమ్ కల్చర్ బాగా పెరిగింది. సిక్స్ ప్యాక్స్, మజిల్స్ కోసం రకరకాల ప్రోటీన్ సప్లిమెంట్లు, స్టెరాయిడ్స్ వాడుతున్నారు. దీనివల్ల కిడ్నీలు దెబ్బతిని మీ దగ్గరకు వచ్చే కేసులు ఏమైనా పెరుగుతున్నాయా అసలు ఒక సాధారణ మనిషికి రోజుకు ఎంత ప్రోటీన్ అవసరం ఈ ట్రెండ్పై మీరిచ్చే హెచ్చరికలేంటి

**డాక్టర్:** సాధారణంగా మన భారతదేశంలో ఒక సగటు మనిషికి రోజుకు, వారి శరీర బరువును బట్టి ప్రతి కిలోగ్రాముకు 0.6 నుండి 0.8 గ్రాముల ప్రోటీన్ అవసరం ఉంటుంది. అదే అమెరికా, యూరప్ వంటి పాశ్చాత్య దేశాల్లో అయితే దాదాపు 1.5 నుండి 2 గ్రాముల వరకు తీసుకుంటారు. ఎందుకంటే అక్కడి ప్రజలు శారీరకంగా మరింత ద ఢంగా ఉండటంతో వారి కండరాల పరిమాణం కూడా ఎక్కువగా ఉంటుంది. మనదేశంలో కూడా ఎక్కువ శారీరక శ్రమ చేసే వారు గరిష్టంగా 0.8 నుండి 1 గ్రాము వరకు ప్రోటీన్ తీసుకోవచ్చు. అంతకంటే ఎక్కువ అవసరం లేదు. ''అతి సర్వత్ర వర్జయేత్'' అన్నట్లుగా పరిమితికి మించి ఏది తీసుకున్నా ప్రమాదకరమే. మన శరీరం ఎంత సున్నితంగా ఉంటుందో చాలామందికి తెలియదు.

**నినాదం:** ప్రోటీన్ లభ్యతలో శాకాహారానికి, మాంసాహారానికి ఏమైనా తేడాలు ఉంటాయా కిడ్నీ సమస్యలు ఉన్నవారు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి

**డాక్టర్:** సాధారణంగా ప్రోటీన్ తీసుకునే విషయంలో శాకాహారులకు, మాంసాహారులకు పెద్దగా తేడా ఉండదు. ఇద్దరూ అవసరమైన ప్రోటీన్ను పొందగలుగుతారు. అయితే ఇప్పటికే కిడ్నీ సమస్యలు ఉన్నవారు లేదా కిడ్నీ వ్యాధి బారిన పడినవారు మాంసాహార ప్రోటీన్లను తగ్గించి, శాకాహార ప్రోటీన్లకు ప్రాధాన్యత ఇవ్వడం మంచిది. ఎందుకంటే మాంసాహారాన్ని ఫిల్టర్ చేసే ప్రక్రియలో కిడ్నీలు మరింతగా శ్రమించాల్సి వస్తుంది. దాంతో అవి త్వరగా దెబ్బతినే అవకాశం ఉంటుంది. అలాగని ప్రోటీన్లు పూర్తిగా మానేస్తే శరీరం బలహీనపడటం, కండరాలు తగ్గిపోవడం, రోగనిరోధక శక్తి క్షీణించడం వంటి సమస్యలు వస్తాయి. కాబట్టి ప్రతి వ్యక్తి తన శరీర పరిస్థితి, కిడ్నీ వ్యాధి దశను బట్టి వైద్యుల సలహా మేరకు మాత్రమే ప్రోటీన్ పరిమాణాన్ని నిర్ణయించుకోవాలి

**నినాదం:** యువతలో కనిపిస్తున్న ఈ సప్లిమెంట్ల ట్రెండ్పై మీ అభిప్రాయం ఏంటి

**డాక్టర్:** ప్రస్తుతం చాలామంది యువకులు రాత్రికి రాత్రే కండలు పెంచుకోవాలనే ఉద్దేశంతో జిమ్లలో చేరుతున్నారు. ఈ క్రమంలో రకరకాల ప్రోటీన్ సప్లిమెంట్లు, స్టెరాయిడ్స్ విచ్చలవిడిగా వాడుతున్నారు. ఫలితంగా చాలామంది తమ కిడ్నీలను తెలియకుండానే దెబ్బతీసుకుంటున్నారు. సత్వర ఫలితాల కోసం శరీర తత్వాన్ని పట్టించుకోకుండా తీసుకునే నిర్ణయాలు ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉంది. అందుకే జిమ్లకు వెళ్లే యువత ప్రోటీన్ సప్లిమెంట్లు లేదా స్టెరాయిడ్స్ వాడే ముందు తప్పనిసరిగా నిపుణులైన డాక్టర్ల సలహా తీసుకోవాలి.

**నినాదం:** నిమ్స్ లాంటి ప్రభుత్వ రంగ సంస్థల్లో రోజుకు వందలాది మంది రోగులు వస్తుంటారు. పైసా ఖర్చు లేని పేదవాడి నుండి వీఐపీ వరకు అందరికీ ఒకేలా వైద్యం అందించడంలో ఎదురయ్యే ప్రాక్టికల్ సమస్యలు ఏమిటి ఆ ఒత్తిడిని మీ మేనేజ్మెంట్ ఎలా ఎదుర్కొంటుంది

డాక్టర్: దీని గురించి చెప్పడం పెద్ద కష్టమేమీ కాదు. ఎందుకంటే మా ద ష్టిలో రోగులందరూ ఒక్కటే. బాధలు, కష్టాలు, కన్నీళ్లకు పేద, ధనిక అనే తేడా ఉండదు. వాటి భాష ఒక్కటే, వాటి భావవ్యక్తీకరణ కూడా ఒక్కటే. పేదవాడు కష్టాల్లో ఉన్నా, ధనవంతుడు కష్టాల్లో ఉన్నా వారి బాధ ఒకేలా ఉంటుంది. కాబట్టి వాళ్లను డీల్ చేయడం మాకు పెద్ద కష్టమైన విషయమేమీ కాదు. అలాగని రోగుల వర్గాలను బట్టి మేము మాట్లాడే భాష మారదు. ఒకరికి ''పోరా'' అని, మరొకరికి ''రండి'' అని మాట్లాడటం ఇక్కడ కుదరదు. అందరినీ సమానంగా గౌరవిస్తూ, ఒకే రకమైన సేవలందించడమే మా విధి.

**నినాదం:** ప్రస్తుత కాలంలో వైద్య విద్యార్థులకు కేవలం సబ్జెక్టు మాత్రమే కాకుండా, రోగుల పట్ల సానుభూతి (ఎంపతి)ని నేర్పించడం ఎలా సాధ్యమవుతుంది

**డాక్టర్:** నిజానికి సానుభూతి అనేది ప్రత్యేకంగా నేర్పించేది కాదు. అది ఒక వ్యక్తిలో జన్మతః ఉండాలి. అయితే, ప్రతి మనిషిలోనూ ఇది సహజంగానే ఉంటుంది. కానీ, ఒక వ్యక్తి జీవితంలో---ముఖ్యంగా 15 సంవత్సరాల లోపు జరిగే కొన్ని సంఘటనలు, వారు చూసే పరిస్థితులు, చుట్టూ ఉండే మనుషులు ఆ గుణాన్ని సానుకూలంగానో లేదా ప్రతికూలంగానో ప్రభావితం చేస్తారు. అందుకే పిల్లలకు చిన్నప్పటి నుంచే మంచి వాతావరణాన్ని, మంచి జీవితాన్ని ఇవ్వాలి. పిల్లలు బాగుంటేనే రేపటి సమాజం అంతా బాగుంటుంది.

**నినాదం:** సమాజానికి , తల్లిదండ్రులకు మీరు ఇచ్చే సందేశం ఏంటి

**డాక్టర్:** పిల్లలు కేవలం డాక్టర్లు మాత్రమే కావాల్సిన అవసరం లేదు. ఏ ఉద్యోగమైనా, ఏ వ త్తైనా సరే... అందులో నైతికత అనేది అత్యంత ముఖ్యమైనది. పిల్లలకు మంచి-చెడులను గుర్తించే విచక్షణా జ్ఞానం ఉండాలి. ఆ విచక్షణ ఉంటే వారు ఏ రంగంలోనైనా, ఏ వృత్తిలోనైనా విజయవంతంగా రాణించగలుగుతారు. అయితే, మిగతా రంగాలతో పోలిస్తే వైద్య వృత్తిలో ఈ నైతికత మరింత ఎక్కువగా అవసరం అవుతుంది.

లక్షలాది మందికి పునర్జన్మ ప్రసాదించినప్పటికీ, ఏమాత్రం గర్వం లేకుండా, నిమ్స్ కి వచ్చే ప్రతి పేదవాడి నవ్వులోనే దేవుడిని చూసుకునే డాక్టర్ శ్రీ భూషణ్ రాజు గారి ప్రయాణం.. రాబోయే తరం వైద్యులకు నిరంతర చైతన్యదీప్తి





## ర్యాపిడ్ ఫైర్

**వైద్యుడిగా సేవే నా ప్రాధాన్యత: డా. శ్రీ భూషణ్ రాజు**

**నినాదం: మీ వృత్తిలో మీకు అత్యంత సంతోషాన్ని ఇచ్చిన క్షణం ఏది**

**డాక్టర్: ప్రతి రోజు, ప్రతి క్షణం కూడా నాకు సంతోషాన్ని ఇస్తుంది. ఒక వైద్యుడిగా ప్రజలకు సేవ చేయడం నాకు లభించిన గొప్ప అవకాశం.**

**నినాదం: కిడ్నీ ఆరోగ్యాన్ని ఒక్క మాటలో చెప్పాలంటే ఏం చెబుతారు**

**డాక్టర్: కిడ్నీ ఆరోగ్యమే శరీర మొత్తానికి ఆరోగ్యం.**

**నినాదం: మీకు ఇష్టమైన జ్ఞాపకం ఏమైనా ఉందా**

**డాక్టర్: అప్పట్లో చదువుకున్న పద్యాలు ఇప్పటికీ గుర్తుంటాయి.**

**నినాదం: మీరు ఏ రకమైన వైద్యం వైపు మొగ్గు చూపుతారు కార్పొరేట్ వైద్యమా ప్రభుత్వ వైద్యమా**

**డాక్టర్: నేను ఇప్పటికీ ప్రభుత్వ వైద్యం వైపే మొగ్గు చూపుతాను.**

**నినాదం: రాబోయే తరం వైద్యులకు మీరు ఇచ్చే సలహా ఏంటి**

**డాక్టర్: బాగా చదువుకోవడం మాత్రమే కాదు, మంచి మనిషిగా కూడా ఉండాలని నేను వారికి సూచిస్తున్నాను.**

**నినాదం: మీ భవిష్యత్తు ప్రణాళికలు లేదా ఏదైనా డ్రీమ్ ప్రాజెక్ట ఉందా**

**డాక్టర్: నెఫ్రాలజీపై ఒక సమగ్ర టెక్స్ట్బుక రాయాలనేది నా ఆలోచన.**

**ఇంటర్వ్యూ : గుంపుల ఇందిరా ప్రియదర్శిని యాదవ్**
**బ్యూరో చీఫ్, నినాదం**

Printed, Published & Owned by B.Srinivas, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar Medchel, Malkajgiri Dist. Hyderabad 500037 (T.S)
Published at Plot S11, 3rd Floor, Ballard Estate Margadarshi Building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B.Srinivas, PRGI.REGN.NO. APTEL /2003/11288, CELL : +91 8333068787